మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - బుధవారం 11 నవంబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 305 || పేజీలు:12 || వెల రూ.5


HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

స్వామినారాయణ్‌లో 1200 రకాల నైవేద్యం



2

వందేళ్ల తర్వాత.. భారత్‌కు రానున్న అవశేషాలు



2

ఓబీసీలకు రాజకీయ ప్రాధాన్యంపై
రాహుల్‌తో చర్చించా

భారత్ సమ్మిట్‌కు ఆయనను ఆహ్వానించా

రాష్ట్రంలో పీసీసీ అమలు చేస్తున్న కార్యక్రమాలు వివరించా

పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్, నవంబర్ 10, (మనం బ్యూరో): తెలంగాణ సహా దేశవ్యాప్తంగా ఓబీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో చర్చించినట్లు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లో 'సర్'కు వ్యతిరేకంగా నిర్వహించనున్న సభతో పాటు మెగా బీసీ ర్యాలీలో పాల్గొనాలని రాహుల్‌ను ఆహ్వానించామన్నారు. మంగళవారం ఢిల్లీలో రాహుల్ గాంధీతో భేటీ అయిన అనంతరం మహేశ్ గౌడ్ మీడియాతో ఆయన మాట్లాడారు. వెనుకబడిన తరగతులకు రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరాన్ని రాహుల్‌కు వివరించినట్లు చెప్పారు.. తెలంగాణలో కాంగ్రెస్ చేపడుతున్న సంస్థాగత కార్యక్రమాలు, బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలపైనా రాహుల్తో

...మిగతా 2లో

యువ అధికారులు ప్రజల కోసం
చిత్తశుద్ధితో పని చేయాలె



టీఎస్‌పీఎస్‌సిని యూపీపీఎస్‌సి తరహాలో తీర్చిదిద్దుతం

ఏ హోదాకు వెళ్లినా గతాన్ని మర్చిపోవద్దు

శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలతో

ముఖాముఖిలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 10, (మనం బ్యూరో): యువ అధికారులు ప్రజల కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. యూపీఎస్సీ తరహాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను తీర్చిదిద్దుతామని తెలిపారు. మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో టీఎస్పీఎస్సీ రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని, అవగాహన లేని వ్యక్తులను

...మిగతా 2లో

నిరుద్యోగులకు మరో శుభవార్త
వైద్యారోగ్య శాఖలో 2,929 పోస్టులు.. భర్తీకి రంగం సిద్ధం

996 పోస్టులకు ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం

మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నియామకాల ప్రక్రియ



హైదరాబాద్, నవంబర్ 10, మనం ప్రతినిధి: తెలంగాణ వైద్యారోగ్య శాఖలో మరో భారీ నియామక ప్రక్రియకు రంగం సిద్ధమవుతోంది. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 2,929 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. వీటిలో 996 పోస్టులకు ఆర్థిక శాఖ ఇప్పటికే అనుమతి ఇవ్వగా, మరో 1,933 పోస్టులకు ఆమోదం లభించాల్సి ఉంది. త్వరలోనే ఈ పోస్టుల

...మిగతా 2లో

సీఎంవో ముఖ్య కార్యదర్శి
శేషాద్రితో 'ట్రెసా' బృందం భేటీ

తహసీల్దార్ల పదోన్నతుల ఫైల్ వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి



3

విమర్శలు కాదు?..
వీరమరణం పొందిన కుటుంబాలను గౌరవించు

బస్తర్‌లో నక్సలైట్ల హింస, పుల్వామా దాడిని ఖండించే ధైర్యం ఉందా?

రాహుల్‌గాంధీపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు



హైదరాబాద్, నవంబర్ 10, మనం ప్రతినిధి: ఛత్తీస్‌గఢ్ బస్తర్ పర్యటనలో ప్రధాని మోడీ చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ సాయుధ దళాలు,

...మిగతా 2లో



బ్యాంకులు రైతులకు అండగా నిలవాలి

మౌలిక సదుపాయాల రంగాలకు రుణాల పెంపునకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు బ్యాంకులు ప్రత్యేక చొరవ చూపాలి..

కరువును జయించేందుకు రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించాలి

రైతులకు రుణాల పునర్వ్యవస్థీకరణతోపాటు రబీకి కొత్త రుణాలు అందించాలి

ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 10(మనం బ్యూరో): ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు రైతులకు అండగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. అర్హులైన రైతుల పంట రుణాలను ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం పునర్వ్యవస్థీకరించడం, రీషెడ్యూల్ చేయడంతో పాటు రబీ సీజన్కు అవసరమైన కొత్త రుణాలను సకాలంలో అందించాలని సూచించారు. రైతులకు రుణాల మంజూరులో జాప్యం చేయకుండా క్షేత్రస్థాయిలో బ్యాంకర్లు చొరవ చూపాలని స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్బీసీ) సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

...మిగతా 2లో

కీచక వీసీపై చర్యలేవి?

- అగ్రికల్చర్ వర్సిటీ వీసీపై చర్యలు తీసుకోండి
- తెలంగాణ గవర్నర్‌కు బాధిత ప్రొఫెసర్ ఫిర్యాదు
- సుమోటోగా కేసు నమోదు చేసిన మహిళా కమిషన్

హైదరాబాద్, నవంబర్ 10, మనం ప్రతినిధి: అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్యపై రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు బాధిత మహిళా ప్రొఫెసర్ లేఖ ద్వారా మంగళవారంనాడు ఫిర్యాదు చేశారు. లైంగిక వేధింపులకు సంబంధించి వీసీపై చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే డీజీపీకి, ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బాధితురాలు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్ చేపట్టిన ఆందోళనలకు మహిళా నేతలు మద్దతుపలికారు. వీసీకి వ్యతిరేకంగా మాట్లాడితే బదిలీలు చేస్తున్నారంటూ

...మిగతా 2లో



వెయ్యి గ్రామాల్లో పూర్తయిన భూ రీసర్వే

మంత్రి పొంగులేటి కీలక అప్ డేట్

నేడు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, నవంబర్ 10(మనం బ్యూరో): భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూ యజమానికి తన భూమిపై స్పష్టమైన హక్కులు, కచ్చితమైన సరిహద్దులు కల్పించడమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో భూ యజమానుల ప్రయోజనాలు, వారి అభిప్రాయాలు, మనోభావాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న

...మిగతా 2లో

మేనక చెప్పిన ఆ అబద్ధం
బాధించింది

తోడి కోడలితో బంధంపై సోనియా గాంధీ



ఢిల్లీ, నవంబర్ 10: దేశ రాజకీయాల్లో గాంధీ-నెహ్రూ కుటుంబానిది శక్తిమంతమైన స్థానం. ఆ ఇంటి చిన్న కోడలైన మేనకాగాంధీ కొన్ని దశాబ్దాలుగా ఆ కుటుంబానికి దూరంగా ఉన్నారు. ఇప్పుడు సోనియాగాంధీ తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో తోడికోడలు మేనకాగాంధీ గురించి పలు విషయాలు పంచుకున్నారు. నాటి కుటుంబ వివాదాలు, తదనంతర రాజకీయ పరిణామాలు 'రియాలిటీ షో'ను

...మిగతా 2లో

ఆశయం ఉండడం
నేరమా?

2

తొందరపాటు నిర్ణయాలు వద్దు

- గత ప్రభుత్వ తప్పులు పునరావృతం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి
- కాళేశ్వరం అదనపు టీఎంసీ విషయంలో బాధ్యతాయుతంగా ఉండాలి
- కృష్ణా జలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా సాధించాలి
- ఇరిగేషన్ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



2

మంచి వలసదారులను వేధించటం తప్పే!

వారి చట్టబద్ధతకు భవిష్యత్లో ఒప్పందం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, నవంబర్ 10: తన వలసవిధానంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. నిర్బంధాలు, బహిష్కరణలతో వలసదారుల పట్ల తమ ప్రభుత్వం అతి కఠినంగా వ్యవహరించిందని ఆయన అంగీకరించారు. మధ్యంతర ఎన్నికల్లో ఘోర ఓటమి నేపథ్యంలో ఆయన అమెరికా మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ''నా వలస విధానం మరీ అంత కఠినంగా ఉండి ఉండాల్సింది కాదు. నేరగాళ్లను దేశం నుంచి వెళ్లగొట్టినందుకు మంచి మార్కులే పడ్డాయి. కానీ.. మంచి ఉద్యోగాలు చేస్తూ, పన్నులు కడుతూ, చిన్న చిన్న నిబంధనలు ఉల్లంఘించిన సామాన్యులపై కూడా అధికారులు చర్యలు తీసుకోవడం వల్ల నష్టం జరిగిందని భావిస్తున్నాను.

యుద్ధం మొదలుపెడదామా..?

ట్రంప్‌నకు నెతన్యాహు ఫోన్

జరూసలెం, నవంబర్ 10: ఇరాన్‌పై దాడులు పునఃప్రారంభించకపోవచ్చని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం ప్రకటించారు. మరోవైపు నెతన్యాహు ప్రతిరోజూ ట్రంప్‌నకు ఫోన్ చేసి.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేద్దామా అని అడిగేవారని అమెరికా మీడియా ఓ కథనంలో వెల్లడించింది. రాజకీయ లబ్ధి కోసం నెతన్యాహు యత్నించినట్లు తెలిపింది. అమెరికా అధ్యక్షుడికి ఇరాన్‌తో ఒప్పందం చేసుకోవాలనే ఆసక్తి ఉండడంతో ఆయన అందుకు నిరాకరించినట్లు పేర్కొంది. అమెరికా



మధ్యంతర ఎన్నికల ఫలితం వెలువడిన వెంటనే ఇరాన్‌పై దాడి చేయాలని నెతన్యాహు ట్రంప్‌పై ఒత్తిడి తీసుకువచ్చారు.



ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే దిశలో మనమంతా భాగస్వాములమవుదాం. సామాజిక బాధ్యతను నిర్వర్తిద్దాం. ఎల్ నినో ఎందుకు వచ్చింది..? ఇందుకు కారకులెవరు..?? లాంటివి ఇప్పుడు అప్రస్తుతం. మన ముంగిటికి ఎల్ నినో రక్కసి వచ్చి చేరింది. ఈ సమయంలో వ్యక్తిగతంగా ప్రతి పౌరుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సామాజికంగా ఎలాంటి అడుగులు ముందుకు పడాలి ... ఇదే ఇప్పుడు అత్యవసరం. అలాగే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఎలా ఉండాలి వంటి అంశాలు ఎంతో ముఖ్యం. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇందుకు సన్నద్ధమయ్యాయి. పౌరులుగా మనమందరం కూడా ఇందుకు సిద్ధం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఎల్ నినోలాంటి విపత్తులను దిగ్విజయంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలు ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించాల్సిందే... ఎల్ నినో ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ సమీప భవిష్యత్తులో దాని విశ్వరూపాన్ని చూడాల్సిన పరిస్థితులు రావచ్చు.. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం మనకేం కొత్త కాకపోయినప్పటికీ పౌరులుగా మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే... ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు చేపట్టాల్సిందే. ఈ కోణంలోనే ఎలాంటి జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలి , ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాన్ని మీరు సూటిగా స్పష్టంగా తెలియజేయండి. ఈ విపత్కర పరిస్థితులకు కారకులు వీరంటూ, వారంటూ ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు.. అసలు ఆ జోలికే వెళ్ళకూడదు.. నిర్మాణాత్మకంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు వీటిపైనే మీ సూచనలు సలహాలు పంపాలి.. మీడియా సంస్థగా మనం తెలుగు దినపత్రిక ఈ అంశాన్ని తన బాధ్యతగా గుర్తించి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహా యజ్ఞంలో మీరూ పాలుపంచుకోండి. మీ ఆలోచనలను మాకు పంపించండి. వాటిని మీ పేరు, చిరునామా, ఫోటోతో పాటు ఈ శీర్షికలో రోజువారీగా ప్రచురిస్తాం. ఉత్తమ సూచనలకు గుర్తింపు కూడా ఇస్తాం మీ ఆలోచనలు, సలహాలు, సూచనలను పైన తెలిపిన వాట్సాప్ లేదా ఈ మెయిల్‌కు పంపించండి.

– ఎడిటర్

స్వామినారాయణ్ ఆలయంలో 1200 రకాల నైవేద్యం

వడదర, నవంబర్ 10: 'అన్నకూట్' మహోత్సవం, గుజరాతీ నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా వడోదరలోని స్వామినారాయణ్ ఆలయాన్ని భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. 1200 రకాల శాకాహార వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. ఏటా దీపావళి తర్వాత వచ్చే మొదటి పంటను ఆలయంలో నైవేద్యంగా (భోగ) సమర్పించిన తర్వాతే దాన్ని ఇంటికి తీసుకెళ్తారు. అలాగే శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని పూజించిన సందర్భంగా నేడు గోవర్ధన పూజ నిర్వహిస్తారు

వందేళ్ల తర్వాత.. భారత్‌కు రానున్న అవశేషాలు

లండన్, నవంబర్ 10: వందేళ్లకుపైగా తమ మ్యూజియంలో భద్రపరిచిన నాగా తెగలకు చెందిన 39 మంది పూర్వీకుల అవశేషాలను యూకేలోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం తిరిగి అప్పగించింది. పిట్ రివర్స్ మ్యూజియంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో 'ఫోరం ఫర్ నాగా రికన్సిలియేషన్', నాగా హోహో సంస్థలకు ఈ అవశేషాలను అధికారికంగా అందజేసింది. వాటిని నాగాలాండ్‌కు తరలిస్తున్నట్లు ఎఫ్ఎన్ఆర్ ఒక ప్రకటనలో తెలిపింది.ఈ అప్పగింతను ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి, నాగా ప్రజలకు మధ్య ఉన్న సంబంధాల్లో ఓ చరిత్రాత్మక ఘట్టంగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఐరీన్ ట్రేసీ పేర్కొన్నారు. బ్రిటిష్ వలస పాలనలో తన సొంత గ్రామాన్ని ఎలా తగలబెట్టారో ఎఫ్ఎన్ఆర్ ప్రతినిధి వైసియర్ సాన్యు గుర్తుచేసుకున్నారు. ఇదిలా ఉండగా.. నాగాలాండ్ రాజధాని కోహిమాలోని 'నాగా సాలిడారిటీ పార్కు'లో ఆ అవశేషాల ఖననం కోసం ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.

తొందరపాటు నిర్ణయాలు వద్దు



హైదరాబాద్, మనంబ్యూరో: కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులపై తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. గత ప్రభుత్వ తప్పులు పునరావృతం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. రెండు టీఎంసీల నీటినే తరలించలేని పరిస్థితి ఉందన్న ఆయన అదనపు టీఎంసీ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. సుప్రీంకోర్టులో పెండింగ్ కేసుల పురోగతి పరిశీలించి భూసేకరణ చేపట్టాలని సూచించారు. సీడబ్ల్యూసీ అనుమతులు పొందడంతో పాటు డీపీఆర్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఎంసీఆర్హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ఇరిగేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సుప్రీంకోర్టు లాయర్ వైద్యనాథన్ తదితరులు హాజరయ్యారు.

డిండి, అచ్చంపేట పనులు వేగవంతం...

కృష్ణా జలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా సాధించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సుప్రీంకోర్టులో సమర్థంగా వాదనలు వినిపించాలన్న ఆయన ఏపీతో వివాదం ఉన్న అన్ని అంశాలపై ఆధారాలు సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈనెల 18 తర్వాత సుప్రీంకోర్టులో కేసు విచారణ దృష్ట్యా న్యాయ నిపుణులతో చర్చించాలన్న ఆయన డిండి, అచ్చంపేట పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి, అచ్చంపేట పథకాలకు నీటిని అందించాలని, నార్లాపూర్ నుంచి ఏదుల వరకు 0.6 టీఎంసీలు తరలించేలా డీపీఆర్ చేయాలన్నారు.

యువ అధికారులు ప్రజల కోసం చిత్తశుద్ధితో పని చేయాలె





(మొదటి పేజీ తరువాయి)

బోర్డులో నియమించడం వల్లే నియామక ప్రక్రియలో గందరగోళం ఏర్పడిందని విమర్శించారు. నేను బాధ్యతలు స్వీకరించాక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి అనుభవం, చిత్తశుద్ధి కలిగిన వ్యక్తులను బోర్డులో నియమించానని తెలిపారు. గతంలో గ్రూప్-1 నియామకాల ప్రక్రియలో జరిగిన పరిణామాలను వివరించిన సీఎం ఉమ్మడి రాష్ట్రంలో 2011లో గ్రూప్-1 నియామకాలు జరిగాయని, ఆ తర్వాత దాదాపు 13 ఏళ్ల పాటు నియామక ప్రక్రియ ముందుకు సాగలేదని సీఎం గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్లు, ప్రవేశ పరీక్షల విషయంలో తీవ్ర గందరగోళం నెలకొందన్నారు. ఆనాటి ప్రభుత్వ నిర్ణయాలు, నిర్లక్ష్యం కారణంగా ఎంతోమంది అభ్యర్థులు నష్టపోయారని పేర్కొన్నారు. 563 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా 562 మంది ఉద్యోగాల్లో చేరారని వెల్లడించారు. గ్రూప్-1 నియామక ప్రక్రియపై కొందరు ఉద్దేశపూర్వకంగా వివాదాలు సృష్టించారని సీఎం ఆరోపించారు. తాము చేయని తప్పులను తమకు ఆపాదిస్తూ నియామకాలను అడ్డుకునేందుకు ప్రయత్నించారని, దీనివల్ల అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని పేర్కొన్నారు. ఈ అంశంపై న్యాయస్థానాల్లో ప్రభుత్వం బలంగా వాదనలు వినిపించిందని, సుప్రీంకోర్టు సైతం నియామక ప్రక్రియను సమర్థించిందని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన యువ అధికారులు తమ నేపథ్యాన్ని, ఏ లక్ష్యంతో ఈ స్థాయికి చేరుకున్నారో మర్చిపోవద్దని సీఎం సూచించారు. డీఎస్పీగా ఉద్యోగ సాధనతో మీ జీవితంలో రెండో అధ్యాయం ప్రారంభమవుతుందని అన్నారు. అధికారం ప్రజల కోసం వినియోగిస్తేనే ఎక్కువ కాలం గౌరవం నిలుస్తుందని, స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే ఆ అధికారం ఎక్కువ కాలం ఉండదని హితవు పలికారు. మనం వచ్చిన నేపథ్యం మరిచిపోతే మన హోదాకు న్యాయం చేయలేమని అన్నారు. ఏ హోదాకు వెళ్లినా గతాన్ని మర్చిపోవద్దని సూచించారు. '' రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లు ఎలా నడిపించాలో మీ చేతుల్లో ఉంది. మీ నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారుతాయి. పదిమంది డీఎస్పీలు అరాచకంగా వ్యవహరిస్తే రాష్ట్రంలో పరిపాలన బాగోలేదనే ఆరోపణలు వస్తాయి. శాంతిభద్రతలు క్షీణించి.. అవినీతి పెరిగిందనే ఆరోపణలు రావొచ్చు. పది మంది పోలీసులు సరిగా విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుంది. కొంతమంది పనిగట్టుకుని నియామకాల పట్ల అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణలు రాజకీయంగా మాకేం కొత్త కాదు.. మీకు మాత్రం కొత్త. నియామకాల వివాదంపై సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడితే ఉద్యోగాలు వచ్చాయి. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించడానికే ఈ చర్యలు. రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లు ఎలా నడిపించాలో మీ చేతుల్లో ఉంది. మీ నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారతాయి'' అని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

బ్యాంకులు రైతులకు అండగా నిలవాలి

(మొదటి పేజీ తరువాయి)

విద్యా రుణాల మంజూరులో బ్యాంకులు సానుకూలంగా ఉండి అర్హులైన విద్యార్థులకు గరిష్ఠ స్థాయిలో రుణాలు అందించాలని కోరారు. విద్యా రుణాల మంజూరుపై ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. వ్యక్తిగత గృహ నిర్మాణానికి రుణాలు అందించడంలోనూ బ్యాంకులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. గృహ నిర్మాణ సంస్థలకు రుణాలివ్వడానికే పరిమితం కాకుండా సామాన్య ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు వ్యక్తిగత గృహ రుణాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), మౌలిక సదుపాయాల రంగాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించేలా బ్యాంకులు చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్ద పరిశ్రమలతో పోలిస్తే ఎంఎస్ఎంఈ రంగం ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తోందని, ఈ రంగానికి రుణాల పెంపు ద్వారా ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తాయని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి సేవల రంగం వృద్ధికి కీలకమని, ఈ రంగానికి తగిన స్థాయిలో రుణాలు అందించాలని సూచించారు.

ఎల్‌నినో ప్రభావం కేవలం తెలంగాణకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేస్తోందన్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల పరిధిలో 365 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించామని, వీటిలో 111 మండలాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతుల పెట్టుబడులు, ఆదాయాలు దెబ్బతిన్నాయని, ఈ పరిస్థితుల్లో రైతులకు బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి తక్షణ సహకారం అవసరమని పేర్కొన్నారు. రైతులకు అందుబాటులో ఉన్న రుణ ఉపశమన చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్లు సమన్వయంతో పనిచేసి ఆర్బీఐ మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. గత రుణాల రీషెడ్యూలింగ్‌తోపాటు అర్హులైన రైతులకు కొత్త పంట రుణాలను సకాలంలో అందించాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడిన కుటుంబాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలు, పంటల మార్పిడి, సూక్ష్మ సేద్యం, నిల్వ, ప్రాసెసింగ్, రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ఆర్థిక సహకారం అందించాలని సూచించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా రుణాలు, మార్కెట్ మద్దతు కల్పించాల్సిన బాధ్యత బ్యాంకులపై ఉందన్నారు.

కరువు పరిస్థితుల్లో వ్యవసాయంపై మాత్రమే ఆధారపడకుండా రైతు కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించేందుకు బ్యాంకులు సహకరించాలని కోరారు. ఈ సీజన్లో కనీసం 10 నుంచి 15 శాతం కుటుంబాలకు అదనపు ఉపాధి అవకాశాలు కల్పించే అంశాన్ని పరిశీలించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నగదు చలామణి పెరిగేలా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని, ఇప్పటికే ఉన్న రుణ లక్ష్యాలకు అదనంగా ఒక్కో సంఘానికి మరో రూ.2 లక్షల వరకు రుణాలు అందించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం బ్యాంకులు ఉదారంగా రుణాలు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం కార్యక్రమాన్ని ఈ నెలలో అమలు చేసేందుకు చర్యలు చేపడుతోందని, ఈ నెల 19 నాటికి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేలా ఎస్ఎల్బీసీ కన్వీనర్ ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు.రాష్ట్రంలో అక్టోబర్ 16న విద్యుత్ డిమాండ్ 20,818 మెగావాట్లకు చేరడం చరిత్రలోనే అత్యధికమని తెలిపారు. వర్షాభావం కారణంగా భూగర్భ జలాలు, విద్యుత్ వ్యవస్థ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితితో పాటు రైతుల రుణ చెల్లింపు సామర్థ్యంపైనా ప్రభావం పడుతోందన్నారు.

సూపర్ ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని ఆదుకునేందుకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. సాధారణ బ్యాంకింగ్ కార్యకలాపాలకు భిన్నంగా ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులకు అండగా నిలవాలని సూచించారు. కరువు ప్రభావిత మండలాల్లో పంట రుణాలను ఆర్బీఐ నిబంధనల ప్రకారం వెంటనే రీషెడ్యూలింగ్, రీస్ట్రక్చరింగ్ చేయాలని, రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా బ్యాంకర్లే ముందుకు రావాలని స్పష్టం చేశారు.

మంగళవారం ప్రజాభవన్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఈ ఏడాది కృష్ణా, గోదావరి నదులకు వరదలు రాకపోవడంతో రిజర్వాయర్లలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. భూగర్భ జలాలు కూడా ఆశించిన స్థాయిలో రీచార్జి కాకపోవడంతో సుమారు 10 నుంచి 15 లక్షల బోరుబావుల్లో నీరు అందని పరిస్థితి నెలకొందన్నారు.

రబీ సీజన్‌కు బ్యాంకులు నిర్దేశించుకున్న రూ.38,268 కోట్ల పంట రుణాలను వెంటనే మంజూరు చేయాలని సూచించారు. 2026 సెప్టెంబర్ వరకు రూ.96,943 కోట్ల రుణ పంపిణీ లక్ష్యంలో 53 శాతం మాత్రమే సాధించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

కరువు ప్రభావిత ప్రాంతాల్లో పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని, రైతులకు అవసరమైన పెట్టుబడి రుణాలు అందించాలని కోరారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ సాగుకు విరివిగా రుణాలు ఇవ్వాలని, వాణిజ్య బ్యాంకులు కూడా వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.రాష్ట్రంలో ఇప్పటికే 3.5 లక్షల ఎకరాల్లో ఆయిల్పామ్ సాగు చేపట్టామని, ఈ విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు బ్యాంకులు సహకరించాలని మంత్రి కోరారు. రైతులు తిరిగి పంటలు సాగు చేసి ఆదాయం పొందే వరకు వడ్డీ భారం పడకుండా ఆర్బీఐ నిబంధనల ప్రకారం రుణాల రీషెడ్యూలింగ్, రీస్ట్రక్చరింగ్ చేపట్టాలని మంత్రి కోరారు.

వైద్యారోగ్య శాఖలో 2,929 పోస్టులు.. భర్తీకి రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

భర్తీకి నోటిఫికేషన్లు వెలువడే అవకాశం ఉంది. ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన 996 పోస్టుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (198), ఆయుష్ ఫార్మసిస్ట్ గ్రేడ్-2 (308), టెక్నీషియన్ (290) వంటి కీలకమైన పోస్టులు ఉన్నాయి. వీటితో పాటు బయోమెడికల్ ఇంజనీర్లు, ఫిజియోథెరపిస్టులు, రేడియోగ్రాఫర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎం పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. ఈ నియామకాలను తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ), ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ), ఆయుష్, ఎంఎన్జే వంటి పలు విభాగాల్లో చేపట్టనున్నారు. ప్రభుత్వం అనుమతి కోసం ఎదురుచూస్తున్న 1,933 పోస్టుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ (716), సివిల్ అసిస్టెంట్ సర్జన్ (మొత్తం 422), స్టాఫ్ నర్సు (194), ల్యాబ్ టెక్నీషియన్ (96) వంటి ముఖ్యమైన ఖాళీలు ఉన్నాయి. వీటికి కూడా ఆర్థిక శాఖ నుంచి ఆమోదం రాగానే నోటిఫికేషన్లు విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ నియామక ప్రక్రియను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంఆర్‌బీ) ద్వారా వేగవంతం చేయనుండగా, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను మాత్రం టీఎస్‌పీఎస్‌సీ భర్తీ చేయనుంది.

కాగా, ప్రస్తుతం ఎంఆర్‌బీ ఆధ్వర్యంలో 2,711 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో 1,931 ఎంపీహెచ్ఏ (మహిళ) పోస్టుల నియామకాలు దాదాపు పూర్తికాగా, త్వరలో తుది జాబితా రానుంది. మరోవైపు, 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు 4 వేలకు పైగా దరఖాస్తులు రావడంతో, వాటి పరిశీలనకు సమయం పడుతోందని అధికారులు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యశాఖలో ఇప్పటివరకు 13,401 పోస్టులను భర్తీ చేయడం గమనార్హం.

వెయ్యి గ్రామాల్లో పూర్తయిన భూ రీసర్వే

(మొదటి పేజీ తరువాయి)

భూ సర్వే పురోగతిపై మంగళవారం సచివాలయంలో రెవెన్యూ ఉన్నతాధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, రైతుల నుంచి వస్తున్న స్పందన, సాంకేతిక అంశాలు, సర్వేలో పాల్గొంటున్న సిబ్బందికి ఎదురవుతున్న పరిస్థితులపై సమగ్రంగా చర్చించారు.

సర్వే ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందితో స్వయంగా ఫోన్లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలు ఉండగా, తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి, నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు వెయ్యి గ్రామాల్లో రీ సర్వే మైలు రాయిని దాటగా, 416 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు.

సర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలి. సర్వేలో నమోదైన వివరాలను పరిశీలించుకునేందుకు, ఏవైనా అభ్యంతరాలు లేదా అభిప్రాయాలు ఉంటే తెలియజేసేందుకు వారికి తగిన అవకాశం కల్పించాలి, భూ యజమానుల అభ్యంతరాలను స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించాలి.

సర్వే కేవలం ప్రభుత్వ రికార్డుల నవీకరణకే పరిమితం కాకూడదని మంత్రి అన్నారు. ప్రతి భూ యజమానికి తన భూమిపై స్పష్టమైన హక్కులు, కచ్చితమైన హద్దులు కల్పించే ప్రక్రియగా ఉండాలి. రైతుల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను గౌరవిస్తూ వారికి పూర్తి సంతృప్తి కలిగేలా సర్వే నిర్వహించాలి. భూ యజమానులకు పూర్తి న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి.

భూ రీసర్వే పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, సర్వే నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూ యజమానులకు కల్పించాల్సిన అవకాశాలపై బుధవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని మంత్రి నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా వారీగా పురోగతిని సమీక్షించి, అధికారులకు తదుపరి కార్యాచరణపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనున్నారు.

ఓబీసీలకు రాజకీయ ప్రాధాన్యంపై రాహుల్‌తో చర్చించా

(మొదటి పేజీ తరువాయి)

చర్చించామని మహేశ్గౌడ్ తెలిపారు. ఈ నెల12, 13, 14 తేదీల్లో హైదరాబాద్లో జరిగే భారత్ సమ్మిట్కి రాహుల్ గాంధీ వస్తున్నారన్నారు. ఈసందర్భంగా గిగ్వర్కర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయమని ఆయన సూచించారని తెలిపారు. ఇటీవల మంత్రులు, ఎంపీల మధ్య తలెత్తిన విభేదాలు, ఢిల్లీలో జరిగిన పరిణామాలపై ఆయనతో చర్చించలేదని స్పష్టం చేశారు. నవంబర్ చివరి నాటికి తెలంగాణలో నామినేటెడ్ పోస్టులు భర్తీ అవుతాయన్నారు. సోనియా గాంధీ జీవిత విశేషాలతో వెలువడిన పుస్తకాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ ఆత్మకథ పుస్తకంపై తెలంగాణలో కూడా ప్రత్యేక కార్యక్రమం చేపడతామని వెల్లడించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న కార్యక్రమాలపై రాహుల్ గాంధీకి నివేదిక ఇచ్చాననీ, గిగ్ వర్కర్స్‌తో సమావేశం పెట్టాలని రాహుల్ గాంధీ సూచించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్స్ యాక్ట్‌ను అమలు చేస్తున్నదనీ, సంస్థాగతంగా రాష్ట్రంలో కాంగ్రెస్ బూత్ స్థాయినుంచి రాష్ట్ర స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాలు వివరించినట్లు ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. కాగా, హైటెక్స్ ప్రాంగణంలో భారత్ సమ్మిట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రపంచ దేశాలతో భారత్ సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కేంద్రం, తెలంగాణ ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా భారత్ సమ్మిట్‌ను నిర్వహించనున్నాయి.

విమర్శలు కాదు?.. వీరమరణం పొందిన కుటుంబాలను గౌరవించు

(మొదటి పేజీ తరువాయి)

పారామిలిటరీ బలగాలు, సైన్యాన్ని గౌరవించడంలో కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ వరుసగా విఫలమవుతూనే ఉన్నారని ఆయన విమర్శించారు. ఈ మేరకు మంగళవారంనాడు హైదరాబాద్ నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో రాంచందర్ రావు మాట్లాడుతూ.. బస్తర్ ప్రాంతంలో విధి నిర్వహణలో ఉన్న సీఆర్‌పీఎఫ్ జవాన్లతో కలిసి ప్రధాని దీపావళి వేడుకలు జరుపుకుని వారిలో నైతిక స్థైర్యాన్ని నింపారని పేర్కొన్నారు. బస్తర్‌లో నక్సలైట్ల హింసను గానీ, పుల్వామాలో జవాన్ల వీరమరణాన్ని గానీ, ఉగ్రవాద దాడులను గానీ ఖండించే ధైర్యం రాహుల్ గాంధీకి ఎన్నడూ లేదని దుయ్యబట్టారు.

ఇటీవల బస్తర్ పర్యటనలో ఆయుధాలు పట్టిన నక్సలిజం అంతమవుతున్నప్పటికీ, వివిధ సంస్థల్లో చొరబడిన 'మేధో నక్సల్స్' రూపంలో ఇంకా ముప్పు పొంచి ఉందని మోడీ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అయితే, దీనిపై 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ... విపక్షాలను ప్రధాని నక్సల్స్‌గా ముద్రవేస్తున్నారని ఆరోపిస్తూ, దేశద్రోహి ఎవరో చర్చించేందుకు రావాలన్న రాహుల్ గాంధీ సవాల్‌పై రామచందర్ రావు స్పందించారు.

మేనక చెప్పిన ఆ అబద్ధం బాధించింది

(మొదటి పేజీ తరువాయి)

తలపించాయని కాంగ్రెస్ అగ్రనాయకురాలు పేర్కొన్నారు.

అందమైన, చురుకైన అమ్మాయి..

''1973లో మేనక, సంజయ్ గాంధీకి మధ్య పరిచయం ఏర్పడింది. ఆమె ఒక అందమైన, చురుకైన అమ్మాయి. సంజయ్ కంటే పదేళ్లు చిన్నది. అప్పటికి ఇంకా మైనరే. ఒక ఏడాదిలో వారి పెళ్లి అయింది. 18 ఏళ్ల ఆ అమ్మాయి గాంధీ కుటుంబంలో భాగమైంది. ఉత్సాహంగా ఉండే తోడికోడలు రావడంతో మొదట్లో ఇల్లంతా ఆహ్లాదంగా అనిపించేది. రానురాను చికాకులు మొదలయ్యాయి. ఆమె ఎప్పుడైనా కఠినంగా మాట్లాడినా.. ఇంట్లో ప్రశాంతత పోకూడదని మౌనంగా ఉండేదాన్ని. కానీ ఆ మాటల స్థాయి దాటితే మాత్రం సూటిగా సమాధానం చెప్పేదాన్ని.

రాజీవ్ ఆ మాట అనడంతో..

ఇక, సంజయ్, మేనక మధ్య విభేదాలు త్వరలోనే కుటుంబ సభ్యులకు తెలిసిపోయాయి. రాజకీయ కార్యక్రమాలకు, వేడుకలకు సంజయ్‌తో పాటు వెళ్లడం మొదలుపెట్టాక ఆమె కాస్త కుదురుకున్నట్లు కనిపించింది. సంజయ్‌పై మేనక ప్రభావంతో.. సోదరుల మధ్య సంబంధాలు దెబ్బతింటూ వచ్చాయి. ఎంతో అన్యోన్యంగా ఉన్న రాజీవ్ గాంధీ, సంజయ్ మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి.

1978 ఎన్నికల్లో విపత్కర ఓటమికి సంజయ్ కూడా ఓ కారణమని రాజీవ్ చెప్పడంతో కుటుంబం పట్ల మేనకకు ద్వేషం పెరిగింది. 'అమ్మకు ఈ పరిస్థితి తీసుకువచ్చిన నిన్ను క్షమించలేను సంజయ్' అని కుటుంబ చర్చలో భాగంగా రాజీవ్ అన్నారు. దాంతో మేనకాగాంధీ జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించగా.. కాదని చెప్పగలవా అంటూ అత్తమ్మ గట్టిగా అడిగేసరికి ఆమె వెనక్కి తగ్గింది. ముఖ్యంగా నన్ను, రాజీవ్‌ను శత్రువులుగా చూసేది. తనకు టచ్లో ఉన్న కొందరు పాత్రికేయులతో మా గురించి అవాస్తవ ప్రచారం చేసేది. ఎన్నికల్లో ఓటమి తర్వాత రాజీవ్, నేను దేశం విడిచి పారిపోవాలని అనుకున్నామన్నది పచ్చి అబద్ధం ఆ వార్తే మమ్మల్ని ఎక్కువ బాధపెట్టింది.

1980 జూన్ 23న జరిగిన విమాన ప్రమాదంలో సంజయ్ మరణించిన తర్వాత కుటుంబంతో ఆమెతో సంబంధాలు మరింత క్షీణించాయి. మేనకకు ఏదైనా రాజకీయ పదవి ఇవ్వాలని ఆమె తల్లి సంజయ్ వర్గనేతలను అడిగినట్టు తెలిసింది. కానీ అప్పటికి మేనక వయసు 23.

ఆమెది చిన్నవయసు అని ఇందిర భావించారు. అంతేగాకుండా మూడునెలల పిల్లాడు కూడా ఉన్నాడు. తన రాజకీయ ఆకాంక్షలు నెరవేరడానికి తగిన సమయం ఉందని అనుకున్నారు. కానీ మేనక ఆలోచన వేరుగా ఉందని అర్థమైంది.

అన్ని పరిమితులు దాటిన మేనకాగాంధీ..

ఆమె కుమారుడు వరుణ్ గాంధీ తొలి పుట్టినరోజు విషయంలో ఆ విభేదాలు తీవ్రమయ్యాయి. ఆర్ఎస్ఎస్ మద్దతుదారు, తన ప్రత్యర్థి అయిన వసుంధరా రాజే ఇంట్లో తన మనవడి పుట్టినరోజు వేడుకలు జరిగాయని తర్వాత ఇందిరాగాంధీకి తెలిసింది. అంతేగాకుండా తన ఆధ్వర్యంలోని 'సూర్య' మ్యాగజైన్‌ను ఆర్ఎస్ఎస్ సభ్యుడు ఒకరికి విక్రయించింది. అందుకు రాజే సహకారం అందించారు.

ఈ చర్యలతో అన్ని పరిమితులు దాటేశారు. ఇందిరాగాంధీ లండన్‌లో అధికారిక పర్యటనలో ఉన్నప్పుడు మేనక తన సామాన్లను ఇంటినుంచి తీసుకెళ్లిన విషయం ఆమెకు తెలిసింది. దాంతో తిరిగి వచ్చిన తర్వాత ఆమెను మందలించారు. 'నువ్వు ఇక నిర్ణయం తీసుకోవాలి. ఈ పనులకు దూరంగా ఉండటమా లేక వేరే చోట నివసించడమా తేల్చుకోవాలి' అని స్పష్టంగా చెప్పారు. ఆ నింద అత్తమ్మ మీద మోపాలని ఆమె నిర్ణయించుకున్నట్లు వెల్లడైంది. అత్తమ్మతో పాటు రాజీవ్‌ను నన్ను నిందించింది. అదంతా జరిగిన తీరు ఒక రియాలిటీ షోను తలపించాయి. తర్వాత మనవడిని చూసే హక్కుల కోసం గాంధీ కుటుంబం న్యాయపరమైన పోరాటం చేసింది.

అదే ఇందిర చివరి సమాధానం..

ఆ కేసు జరుగుతున్నప్పుడే వరుణ్ నాలుగో పుట్టినరోజు వచ్చింది. అదే సమయంలో పంజాబ్‌లో కల్లోల పరిస్థితులను అత్తమ్మ ఎదుర్కొంటున్నారు. దాంతో వరుణ్‌కు బహుమతులు ఇవ్వమని నాకు చెప్పారు. కానీ తర్వాత రోజు వార్తాపత్రికల్లో కథనాలు ఆశ్చర్యపర్చాయి.

ఆ చిన్నారిని కిడ్నాప్ చేయడానికి యత్నించారని మేనక ఆరోపించింది. దాంతో వారి లాయర్కు ఏప్రిల్ 19,1984న అత్తమ్మ సమాధానం ఇచ్చారు. అదే చివరి సమాధానం. ఆపరేషన్ బ్లూస్టార్కు రెండు నెలల ముందు'' అని సోనియా రాసుకొచ్చారు.

1984 లోక్‌సభ ఎన్నికల్లో రాజీవ్ గాంధీపై ఆమె స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 1988లో ఆమె వీపీసింగ్ నేతృత్వంలోని జనతాదళ్‌లో 2004లో బీజేపీలో చేరారు.

''సంజయ్ వేగంగా నిర్ణయాలు తీసుకునే వ్యక్తి. ఎలాంటి రాజ్యాంగబద్ధమైన హోదా లేకపోయినా.. రాజకీయ వ్యవహారాల్లో ఆయన జోక్యం ఎక్కువగా ఉండేది. ఎమర్జెన్సీ (1975-1977) నిర్ణయం పట్ల ఇందిరకు పూర్తి సుముఖత లేకపోయినా అప్పటి ఒత్తిడుల వల్ల ఆమె బలవంతంగా అమలు చేయాల్సి వచ్చింది'' అని సోనియా గుర్తుచేసుకున్నారు.

ఆశయం ఉండడం నేరమా? సోనియా పుస్తకంపై ప్రణబ్ ముఖర్జీ కుమార్తె

ఢిల్లీ, నవంబర్ 10: దివంగత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఓసారి ప్రధాని కావాలని ఆశపడినట్లు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో తెలిపారు. ఈ విషయంపై ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ స్పందిస్తూ..సోనియాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి ప్రధాని కావాలనే ఆశయం ఉండడం నేరమా అని ప్రశ్నించారు.

తన తండ్రి ఎంతో కష్టపడి, సమర్థంగా పని చేసి పదవులు సంపాదించుకున్నారని.. వంశపారంపర్య హక్కులతో కాదన్నారు.

'అంతగా ఆశ్చర్యపోవడానికి ఏముంది? రాజకీయాలు, పరిపాలనలో దశాబ్దాల అనుభవం, కఠోర శ్రమ, అద్భుతమైన మేధస్సు ఉన్న వ్యక్తికి 'ఆశయం' ఉండటం నేరమా?. మీరు ప్రధానమంత్రి కావాలనుకుంటున్నారా?అని ఒకసారి నేను మా నాయనను అడిగాను. దానికి ఆయన స్పందిస్తూ.. ఏ రాజకీయ నాయకుడికైనా ఆ ఆశయం ఉంటుందని సమాధానమిచ్చారు. నా తండ్రి నిరుపేద కుటుంబం నుంచి వచ్చారు. ప్రతిభ, కఠోర శ్రమతోనే రాజకీయంగా ఎదిగారు. వంశపారంపర్య హక్కులను చూపించి.. పళ్లెంలో పదవులు పెట్టి ఇచ్చేవారు ఆయనకు ఎవరూ లేరు. అయినా ఒక సమర్థుడైన వ్యక్తికి ప్రధానమంత్రి కావాలనే ఆశ ఉంటే అందులో తప్పేముంది? గాంధీ-నెహ్రూ కుటుంబం కాకుండా ఇతరులు ప్రధాని పదవిని ఆశించినందుకు..ఆ విషయాన్ని స్వయంగా తనకే చెప్పినందుకు సోనియా ఆశ్చర్యపోయారా?' అని శర్మిష్ఠ ప్రశ్నించారు.

కీచక వీసీపై చర్యలేవి?

(మొదటి పేజీ తరువాయి)

మహిళా ప్రొఫెసర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఒక్క ఏడాదిన్నరలో 1150 మందిని వీసీ జానయ్య బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా బాధిత మహిళా ప్రొఫెసర్ మీడియాతో మాట్లాడుతూ.. అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జానయ్య లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నారని.. ఈ విషయంపై డీజీపీ, గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాను ఫిర్యాదు చేసిన దానిపై ఇప్పటి వరకు ఎలాంటి యాక్షన్ తీసుకోలేదన్నారు.

వీసీ జానయ్య.. తన ఛాంబర్‌లోకి పిలిచి అసభ్యంగా ప్రవర్తించారని.. తనతో పాటు ఢిల్లీకి రావాలని వేధింపులకు గురి చేశారని ఆరోపించారు. వైస్ ఛాన్సలర్ జానయ్యకు ఇక్కడ కొంతమంది ప్రొఫెసర్లు అండగా ఉన్నారని బాధితురాలు తెలిపారు. ఉమెన్ కమిషన్ ఈ వ్యవహారంపై సుమోటోగా కేసు నమోదు చేసిందని.. మహిళా కమిషన్‌కు తన వద్ద ఉన్న ఆధారాలన్నీ ఇస్తానని అన్నారు. వీసీ జానయ్యను ప్రభుత్వం వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. వాట్సాప్ కాల్స్, మెసేజ్‌లు చేస్తూ ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఇదిలాఉంటే, నా లాంటి మహిళలు చాలామంది అతని చేతిలో వేధింపులకు గురవుతున్నారని ఆమె ఆవేదన చెందారు. ఇలాంటి దుర్మార్గుడిపై ఖచ్చితంగా కఠిన తీసుకోవాలని, లేని పక్షంలో చాలా మందిని ఇబ్బంది పెట్టే అవకాశం ఉంటుందని మహిళా ప్రొఫెసర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కీచక వైస్ చాన్సలర్ మీద చర్యలు తీసుకోవాలి : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో మహిళా ప్రొఫెసర్లను వేధించిన కీచక వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్యపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళా ప్రొఫెసర్లను పరామర్శించి నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్లు, విద్యార్థులకు మద్దతు తెలిపారు.

సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో
'ట్రెసా' బృందం భేటీ
తహసీల్దార్ల పదోన్నతుల ఫైల్ వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి



హైదరాబాద్, నవంబర్ 10(మనం బ్యూరో): తహసీల్దార్ల నుంచి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులకు సంబంధించి సీఎంవోలో పెండింగ్‌లో ఉన్న ఫైల్‌ను వెంటనే పరిష్కరించాలని సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రికి 'ట్రెసా' విజ్ఞప్తి చేసింది. ఈమేరకు మంగళవారం 'ట్రెసా' రాష్ట్ర అధ్యక్షుడు కె.గౌతమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్.రమన్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర సచివాలయంలో శేషాద్రిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా సంబంధిత ఫైల్ పెండింగ్‌లో ఉన్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి వెంటనే ఆమోదం పొందేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. దీనిపై స్పందించిన శేషాద్రి ముందుగా రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న 25 పోస్టుల ఆమోదంపై సీఎం దృష్టికి తీసుకెళ్లి వేగవంతమైన చర్యలు చేపడతామనీ, ఇతర శాఖల్లోని ఖాళీలకు సంబంధించి మరోసారి సంబంధిత అధికారులతో చర్చించి సమగ్ర నివేదికలు తెప్పించుకుని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, తహసీల్దార్ల పదోన్నతుల సాధన దిశగా తమ ప్రయత్నాలను నిరంతరం కొనసాగిస్తామని 'ట్రెసా' ప్రతినిధులు స్పష్టం చేశారు.

మారుమోగేలా మహా పాదయాత్ర
ఈ నెల 18న లక్ష మందితో కరీంనగర్‌లో బీజేపీ మహా పాదయాత్ర
కేంద్ర మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో ఏర్పాట్లు
గాంధీ సర్కిల్ నుంచి కమాన్ వరకు యాత్ర
యాత్రలో పాల్గొననున్న నితిన్ నబీన్, రాంచందర్ రావు

హైదరాబాద్, నవంబర్ 10, మనం ప్రతినిధి : తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా బీజేపీ దూకుడు పెంచుతోంది. ఇందులో భాగంగా జాతీయ నాయకుల రాష్ట్ర పర్యటనలకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన ఖరారైంది. ఈ నెల 18న ఆయన నగరానికి రానున్నారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో లక్ష మందితో భారీ పాదయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇటీవల గత కొంత కాలంగా 'సర్' అంశంపై కాంగ్రెస్, ఇండీ కూటమి పార్టీలు రాజ్యాంగ సంస్థలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టి, ప్రజలకు వాస్తవాలు బహిర్గతం చేయడమే లక్ష్యంగా పాదయాత్ర చేపడుతున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. నితిన్ నబీన్ తొలిసారి కరీంనగర్‌కు వస్తుండటంతో కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించాలని బండి సంజయ్ నిర్ణయించారు.

అయితే, గాంధీ సర్కిల్, వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ వరకు పాదయాత్ర సాగనుంది. ఇందులో నితిన్ నబీన్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, బండి సంజయ్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి లక్ష మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు బండి సంజయ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా కరీంనగర్ పేరు మారుమోగేలా మహా పాదయాత్ర నిర్వహిస్తామని చెప్పారు. పాదయాత్ర ఏర్పాట్లపై చర్చించేందుకు బండి సంజయ్ కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ నేతలతో సమావేశమయ్యారు. బూత్ స్థాయి నుంచి మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను సమీకరించాలని సూచించారు. మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

ప్రభుత్వ ఖర్చుతో
బర్త్ డే వేడుకలా?
నిరంజన్ రెడ్డి ధ్వజం



హైదరాబాద్, మనం ప్రతినిధి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టిన రోజు వ్యక్తిగత కార్యక్రమాన్ని ప్రభుత్వ ఖర్చుతో జరుపుకోవడంపై బీఆర్ఎస్ భగ్గున మడిపడుతోంది. ఇక, ఈ విషయమై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఖర్చుతో పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న ముఖ్యమంత్రి బహుశా రేవంత్ రెడ్డి ఒక్కడే ఉంటాడేమోనన్నారు.

ఆయన పుట్టినరోజు జరుపుకోవడం ఎవరికేమి ఇబ్బంది లేదు?.. ఆలస్యంగా మేం కూడా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని,. కానీ, ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటైన వేదికల మీద తమ వేడుకలు చేసుకోవడం, రాజకీయాలు మాట్లాడటం, అది కూడా ప్రతిపక్ష పార్టీలను, ప్రతిపక్ష పార్టీ నాయకులను దూషించడం రేవంత్ రెడ్డికే చెల్లిందని ఆయన దుయ్యబట్టారు.

తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటాం: హరీశ్ రావు
సతీమణికి ఉద్యోగం, ఆ పిల్లల్ని చదివించే బాధ్యత నాదే: పల్లా రాజేశ్వర్ రెడ్డి భరోసా

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని ఎమ్మెల్యేలు హరీశ్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డిలు మంగళవారంనాడు పరామర్శించారు. జనగామ జిల్లా కొన్నె గ్రామంలో లక్ష్మణ్ గౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ తరఫున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అన్ని రకాలుగా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అతని సతీమణికి ఉద్యోగం ఇవ్వడంతో పాటు ఆ పిల్లల్ని చదివించే బాధ్యత కూడా తాను తీసుకుంటానని పల్లా రాజేశ్వర్ రెడ్డి భరోసానిచ్చారు.



ఓయూ వీసీ ప్రభుత్వానికి గులాంగిరి చేస్తుండ్రు?
ఓయూలో నాన్ టీచింగ్ ఉద్యోగుల మహాధర్నా
సిబ్బంది ఆందోళనకు అఖిల పక్ష పార్టీల మద్దతు
వర్సిటీకి ఇస్తానన్న రూ.1,000 కోట్ల నిధులు ఎవి? ఎక్కడ?
రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీసిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత
తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత మంగళవారం



హైదరాబాద్, నవంబర్ 10(మనం ప్రతినిధి): హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ భవనం ఎదుట నాన్‌టీచింగ్ ఉద్యోగులు మంగళవారంనాడు చేపట్టిన మహా ధర్నాకు పలు ప్రజా సంఘాలతో పాటు పలు పార్టీలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఈ మేరకు తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. నాన్‌టీచింగ్ ఉద్యోగులు న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కాంట్రాక్ట్ సిబ్బంది సర్వీసుల క్రమబద్ధీకరణతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు చేపట్టిన ఈ ఆందోళనకు బీఆర్ఎస్, బీజేపీ, టీజేఎస్, టీఆర్ఎస్, వామపక్ష పార్టీల నేతలు సైతం వారికి సంఘీభావంగా ధర్నాలో పాల్గొన్నారు. ఈ దర్నానుద్దేశించి ఎమ్మెల్సీ, విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళాతానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

ఓయూ ఉద్యోగుల ధర్నాకు విచ్చేసిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించిన కవిత... రాష్ట్ర ప్రభుత్వంపై, విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ)పై తీవ్ర విమర్శలు గుప్పించారు. విశ్వవిద్యాలయ పరిపాలన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ... ఉద్యోగులను ఓయూ వీసీ పట్టించుకోవడం లేదని, ఆయన ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దాదాపు ఏడాదిన్నర కాలంగా ఉద్యోగులు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని కవిత అన్నారు. సుమారు 35 ఏళ్లుగా ఉద్యోగులు వివిధ ప్రభుత్వాల హయాంలో దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. నాన్‌టీచింగ్ సిబ్బంది పోరాటానికి పర్మినెంట్ ఉద్యోగులు కూడా మద్దతు తెలపడాన్ని ఆమె ప్రశంసించారు. విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్ర గవర్నర్ వెంటనే ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని, నాన్‌టీచింగ్ సిబ్బంది న్యాయమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తానన్న రూ.వెయ్యి కోట్లు ఎక్కడ? అని ఆమె సూటిగా ప్రశ్నించారు. నిధులు మంజూరు చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని తప్పుబట్టారు.

లోన్ యాప్ వేధింపులు..
కానిస్టేబుల్ బలి
మీడియేటర్ల వేధింపులు తాళలేక కానిస్టేబుల్ ఆత్మహత్య
రూ. 40 వేల అప్పు కోసం తీవ్రంగా వేధించిన నిర్వాహకులు
నగ్న ఫోటోలు పంపుతామని బెదిరించడంతో మానసిక వేదన



హైదరాబాద్, నవంబర్ 10, మనం ప్రతినిధి : లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక ఓ పోలీస్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. తీసుకున్న రూ. 40,000 అప్పు చెల్లింపు ఆలస్యం కావడంతో, నిర్వాహకులు బెదిరింపులకు పాల్పడటంతో ఈ విషాదం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పూర్తి వివరాల్లోకి వెళితే.. కొండాపూర్ బెటాలియన్‌లో పనిచేస్తున్న శ్రీను, మహేశ్వరం మండలం, హర్షగూడలో నివసిస్తున్నారు. 4 నెలల క్రితం ఓ మొబైల్ లోన్ యాప్ ద్వారా శ్రీను రూ. 40,000 అప్పు తీసుకున్నారు. సకాలంలో అప్పు చెల్లించలేకపోవడంతో యాప్ ఏజెంట్లు ఆయనను వేధించడం మొదలుపెట్టారు. దీపావళి సెలవుల్లో కూడా గంటగంటకూ ఫోన్లు చేస్తూ తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. అప్పు వెంటనే చెల్లించకపోతే, శ్రీను, ఆయన భార్య నగ్న చిత్రాలను మార్ఫింగ్ చేసి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు పంపుతామని బెదిరించారు. ఈ బెదిరింపులతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన శ్రీను, పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. లోన్ యాప్ నిర్వాహకులు, రికవరీ ఏజెంట్ల పాత్రపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇన్‌స్టంట్ లోన్ యాప్‌ల దూకుడు వైఖరి, వ్యక్తిగత డేటాను అక్రమంగా వాడుకుంటూ రుణగ్రహీతలను వేధించే తీరుకు ఈ ఘటన మరోసారి అద్దం పడుతోంది.

ఎఫ్ఎంజీ వైద్య విద్యార్థుల ధర్నా
పోలీసుల దౌర్జన్యంపై మండిపడ్డ వైద్యులు
34 రోజుకి చేరిన ఎఫ్ఎంజీ వైద్య విద్యార్థుల నిరసన



హైదరాబాద్, మనం ప్రతినిధి : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం తమకు రూ.29 వేలు స్టైఫండ్ ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చినా తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ ఎఫ్ఎంజీ వైద్యులు నిరసన చేపడుతున్నారని తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం సుప్రీం ఆదేశాలను లెక్కచేయకుండా తమకు కేవలం రూ.5 వేలు మాత్రమే ఇస్తుందని ఎఫ్ఎంజీ వైద్యులు ఇప్పటికే కోఠి కార్యాలయం ఎదుట ఆందోళన చేయగా వారిని అదుపులోకి తీసుకున్నారని తెలిసిందే. ఎఫ్ఎంజీ డాక్టర్ల నిరసన 34వ రోజు చేరింది.

కోఠిలోని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఎదుట నిరసన తెలుపుతున్న ఊఖ వైద్య విద్యార్థుల పట్ల ఆర్మీ పోలీసులు కర్కశంగా ప్రవర్తించారు. తమ డిమాండ్‌ను అమలు చేయాలని నిరసన చేస్తున్న వైద్య విద్యార్థులను బలవంతంగా ఈడ్చుకెళ్లి వ్యాన్లలో ఎక్కించారు. ఈ దృశ్యాలు కాంగ్రెస్ సర్కార్ వ్యవహారశైలిని మరోసారి కండ్లకు కట్టినట్టు చూపిస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అందరిలానే తమకు నెలకు రూ.29,792 స్టైఫండ్‌తో పాటు జనవరి 2026 నుంచి పెండింగ్లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని ఎఫ్ఎంజీ వైద్య విద్యార్థులు 34 రోజులుగా నిరసన చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో
బాయిలర్ల నిర్వహణ
రేవంత్ ప్రభుత్వం కీలక నిర్ణయం
జీవో నంబర్ 465 జారీ

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో బాయిలర్ల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బాయిలర్ల సర్టిఫికెట్ల గడువు మరో మూడు నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం తెలంగాణ ప్రభుత్వం జీవో నంబర్ 465 జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం చూపిందని వివరించింది. దీంతో ఇంధన వినియోగాన్ని సమర్థంగా నిర్వహించేందుకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపింది. ఇదిలాఉంటే, 100 టన్నులు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న బాయిలర్లకు ఈ వెసులుబాటు వర్తిస్తుందని పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో విద్యుత్ కేంద్రాలు, చమురు, గ్యాస్ పరిశ్రమలకు ఊరట కలిగిస్తుంది. అలాగే పెట్రోలియం రిఫైనరీలు, పెట్రోకెమికల్స్‌పాటు ఎరువుల పరిశ్రమలకు వెసులుబాటు కల్పిస్తుంది. 2026, నవంబర్ 30వ తేదీ వరకు మాత్రమే గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ అమలు కానుంది. ఆరు నెలల్లో సర్టిఫికెట్ గడువు ముగిసే బాయిలర్లకు మూడు నెలల పొడిగింపు ఇచ్చింది. భద్రతా ప్రమాణాలు, సాంకేతిక తనిఖీలు మాత్రం తప్పనిసరి అని జారీ చేసిన జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది.

నా ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నం
తనపై ఆరోపణలు.. సమగ్ర విచారణ జరపండి? : ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య
వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బదిలీల వివాదం.. డీజీపీకి వీసీ ఫిర్యాదు
వాట్సాప్ చాట్స్, కాల్ హిస్టరీలు, డిజిటల్ ఆధారాలను పరిశీలించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, నవంబర్ 10, మనం ప్రతినిధి : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చోటుచేసుకున్న బదిలీల వ్యవహారం వివాదానికి దారితీసింది. తనపై ఓ మహిళా అధ్యాపకురాలు చేసిన ఆరోపణలను వీసీ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య ఖండించారు. ఈ వ్యవహారంపై నిష్పాక్షికంగా సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతూ రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు. విశ్వవిద్యాలయంలో గత రెండేళ్లుగా చేపడుతున్న పరిపాలనా సంస్కరణలు, బదిలీల నేపథ్యంలో కొందరు తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని జానయ్య తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ప్రకటనలో తెలిపారు.

సాధారణ బదిలీతోనే వివాదం ప్రారంభమైందా?

విశ్వవిద్యాలయ పరిపాలనా సర్దుబాట్లలో భాగంగా నిజామాబాద్ జిల్లా రూరూర్లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో పనిచేస్తున్న మహిళా అధ్యాపకురాలిని 2026 సెప్టెంబర్ 11న నిబంధనల ప్రకారం సాధారణ బదిలీపై హైదరాబాద్‌కు బదిలీ చేసినట్లు వీసీ వివరించారు. ఈ బదిలీని వ్యతిరేకిస్తూ తనపై ఆరోపణలు చేస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు.

ఆరోపణలపై విచారణ జరపాలి?..

నవంబర్ 7న సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో మహిళా అధ్యాపకురాలు చేసిన ఆరోపణలు నిరాధారమైనవని ప్రొఫెసర్ జానయ్య ఖండించారు. తన 35 ఏళ్ల అధ్యాపక, పరిశోధన, పరిపాలనా జీవితంలో మహిళా సహోద్యోగుల పట్ల ఎప్పుడూ గౌరవంగా వ్యవహరించానని పేర్కొన్నారు. తన వ్యక్తిగత ప్రతిష్టకు, వీసీ పదవి గౌరవానికి భంగం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.


డిజిటల్ ఆధారాలు పరిశీలించాలని విజ్ఞప్తి..

ఈ వ్యవహారంపై డీజీపీకి చేసిన ఫిర్యాదులో ప్రొఫెసర్ జానయ్య పలు అంశాలను ప్రస్తావించారు. 1. తనకు, సంబంధిత మహిళా అధ్యాపకురాలికి మధ్య జరిగిన వాట్సాప్ సంభాషణలు, కాల్ హిస్టరీలు తదితర డిజిటల్ ఆధారాలను పరిశీలించాలని కోరారు. 2. మహిళా అధ్యాపకురాలు చేసిన ఆరోపణల వెనుక ఇతరుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలోనూ విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. 3. అన్ని ఆధారాలను నిష్పాక్షికంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని కోరారు.

అయితే, ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలపై పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెల్లడికావాల్సి ఉంది. చట్టపరమైన విచారణ ద్వారా నిజానిజాలు తేల్చాలని వీసీ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య డీజీపీని కోరారు.

శ్రీ మఠంలో బలిపాడ్యమి వేడుకలు
మూల రాములకు మహా పంచామృతాభిషేకంతో పూజలు

మంత్రాలయం, నవంబర్ 10(మనం న్యూస్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో బలిపాడ్యమి వేడుకలు మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.



బలిపాడ్యమిని పురస్కరించుకుని పీఠాధిపతులు మూల రాములకు మహా పంచామృతాభిషేకంతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మూలరాములకు, దిగ్విజయరాములకు, జయరాములకు పవిత్ర గంధ లేపన చేశారు. ఈ కార్యక్రమానికి తిలకించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని , రాఘవేంద్రస్వామి ఘూల బృందావనాన్ని దర్శించుకున్నారు భక్తులకు పీఠాధిపతులు మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

కల్లం మోడ్రన్ రైస్ మిల్స్‌కు ఈడీ షాక్
రూ.18.33 కోట్ల ఆస్తులు అటాచ్

హైదరాబాద్, మనం ప్రతినిధి : కల్లం మోడ్రన్ రైస్ మిల్స్ కేసులో ఈడీ అధికారులు చర్యలు చేపట్టారు. కల్లం పేరిరెడ్డి, కుటుంబ సభ్యులు, అనుచరుల ఆస్తులపై కొరడా ఝుళిపించారు. రూ.18.33 కోట్ల విలువైన స్థిరాస్తులను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఆస్తులను జప్తు చేశారు. బ్యాంకు రుణాల మోసం కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద చర్యలు తీసుకున్నారు. 2010 - 2013 మధ్య ఎస్‌బీహెచ్ నుంచి రూ.24.57 కోట్ల రుణాలను ఈ గ్రూపు సంస్థలు పొందిన విషయం తెలిసిందే. నకిలీ, ఫోర్జరీ ఆస్తిపత్రాలను తనఖాగా కల్లం మోడ్రన్ రైస్ మిల్స్ పెట్టి రుణాలు పొందినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. బ్యాంకుకు రూ.18.33 కోట్ల నష్టం కలిగించినట్లు కల్లం మోడ్రన్ రైస్ మిల్స్‌పై ఆరోపణలు ఉన్నాయి. కల్లం మోడ్రన్ రైస్ మిల్స్, శ్రీ రామబ్రహ్మ మోడ్రన్ రైస్ మిల్స్, శ్రీవినాయక ట్రేడర్స్ పేరుతో రుణాలు తీసుకున్నట్లు ఈడీ అధికారుల దర్యాప్తులో తేలింది. బంధువులు, ఉద్యోగులు, అనుచరుల పేర్లతో సుమారు 26 సంస్థలను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. మూడు సంస్థల క్యాష్ క్రెడిట్ ఖాతాల నుంచి రూ.23.81 కోట్ల నగదును ఉపసంహరించినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. కార్మికులు, అకౌంటెంట్లు, కల్లం పేరిరెడ్డి పేర్లతో నగదు విత్డ్రా చేసినట్లు గుర్తించారు. రుణాల సొమ్ముతోనే పలు స్థిరాస్తులను కొనుగోళ్లు చేసినట్లు దర్యాప్తులో ఈడీ అధికారులు వెల్లడించారు. బంధువులు, అనుచరుల పేర్లకు ఎలాంటి నగదు చెల్లించకుండానే ఆస్తులను బదిలీ చేసినట్లు తెలిపారు. నామమాత్రపు యజమానులుగా బంధువులు.. అసలు లబ్ధిదారుగా కల్లం పేరిరెడ్డి ఉన్నట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు.

ఈడీ అటాచ్ చేసిన ఆస్తుల వివరాలిలా..

మొత్తం 50 స్థిరాస్తుల విలువ రూ.16.88 కోట్లు. 5 ఫ్లాట్ల విలువ రూ.1.45 కోట్లు. మొత్తం అటాచ్ చేసిన ఆస్తుల విలువ రూ.18.33 కోట్లు. చెన్నై సీబీఐ ఈఓడబ్ల్యూ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు దర్యాప్తు చేశారు.

సురక్షితంగా విమానాలు ల్యాండింగ్, టేకాఫ్
- **దారి మళ్లింపులు, సర్వీసుల ఆలస్యానికి చెక్**
- **శంషాబాద్ ఎయిర్‌పోర్టులో క్యాట్-3 సదుపాయం**

హైదరాబాద్,నవంబర్ 10, మనం ప్రతినిధి : హైదరాబాద్లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం మరో కీలక మైలురాయిని చేరుకుంది. ఎయిర్‌పోర్టులో ప్రధాన రన్వే 09ఆర్‌ను అత్యంత అధునాతన క్యాట్-111 ఆపరేషన్లకు అనుగుణంగా విజయవంతంగా అప్గ్రేడ్ చేసినట్లు జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ అధికారికంగా ప్రకటించింది. ఈ ఆధునికీకరణ ద్వారా ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ విమానాల రాకపోకలను నిరంతరాయంగా కొనసాగించే వెసులుబాటు లభించింది. ముఖ్యంగా శీతాకాలంలో ఎదురయ్యే దట్టమైన పొగమంచు, వర్షాలు లేదా అత్యంత తక్కువ దృశ్యమానత ఉన్న సమయాల్లో కూడా విమానాలు సురక్షితంగా ల్యాండింగ్, టేకాఫ్ కావడానికి ఈ క్యాట్-111 వ్యవస్థ అత్యంత కీలకంగా వ్యవహరిస్తుంది. గతంలో తక్కువ విజిబిలిటీ కారణంగా విమానాలను ఇతర నగరాలకు మళ్లించడం లేదా గంటల తరబడి ఆలస్యంగా నడపడం వంటి సమస్యలు తలెత్తేవి. ఈ అప్‌గ్రేడ్‌తో అలాంటి సమస్యలకు చెక్ పడటమే కాకుండా, ప్రయాణికులకు మరింత సమర్థవంతమైన, నమ్మదగిన సేవలు అందుబాటులోకి వస్తాయని ఎయిర్‌పోర్ట్ వర్గాలు తెలిపాయి. ఈ ఆధునీకరణ ప్రాజెక్టులో భాగంగా రన్ వేపై అత్యాధునిక క్యాట్-09 ఆర్ 3 కంప్లైంట్ లైటింగ్ సిస్టమ్తో పాటు స్టాండ్ మానూవ్రింగ్ గైడెన్స్ లైట్స్, అధునాతన మానిటరింగ్ వ్యవస్థలను అమర్చారు. వీటికితోడు, ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్ సెంటర్ నుంచి రన్వే లైటింగ్ నెట్వర్క్ను నిరంతరం పర్యవేక్షించేందుకు, నియంత్రించేందుకు వీలుగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన పీఎల్వీ- స్మార్ట్ ఆధారిత కేంద్రీకృత వ్యవస్థను కూడా విజయవంతంగా ప్రవేశపెట్టారు.

లోమంచు...

శీతాకాలం
ఆకుల మీద రాలిన మంచు బిందువులన్నీ
ఆకాశం నవ్వినపుడు రాలిన తుంపురులే
తెల్లారి బిందువుల్లోని చమక్కంతా
రాతిరి వెన్నెలా సూర్యుడితో కలయికప్పుడు
ఒట్టేపించుకున్న ఫలితమే

చేతితో ఒక్కో చుక్కను తాకుతుంటే
నీరంటి ఇగురొచ్చిన మొలకలా
నీ తలపులు మనసులో మెదిలి
హృదయం మెత్తబడుతుంది
పదనుకు నీ జ్ఞాపకాల చెట్టు
ఇగురు తొడుగుతుంది

వెలుగును పొగమంచు కమ్ముకుంటున్నపుడు
నాలోని చీకట్లను చీల్చుతూ
ఉచ్ఛ్వాస నిశ్వాసల ధూళిలో
అద్దం మీది నా మొఖంలో కనిపిస్తున్న
కన్నీటి చారికల మధ్యన లీలగా
మంచు మీద అస్పష్ట నీ రూపం మెరుస్తుంది

వెలుగు పరుచుకుంటున్న కొద్దీ
మంచు కరిగి లోకమంతా తేటనవుతుంటే
నాలో చీకటి అలుముకుంటుంది
నీ తలపులు
నా హృదయపు తలుపులను మూసివేస్తున్నవి

లోకంలో వెలుగులు విరజిమ్ముతున్నపుడు
హృదయాన్ని కృష్ణ బిలం చేయగలగడం
సృష్టి అంతా చీకట్లో చిక్కుకున్నపుడు
మనసును కాంతి పుంజం చేయగలగడం
ప్రేమా ...
నీకు మాత్రమే సాధ్యమయ్యే
మరొక సృష్టి చర్యని
ఇప్పుడిప్పుడే అర్థమవుతుంది.

- దిలీప్.వి
8464030808

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్

విద్య పరిరక్షణ అందరి బాధ్యత



నవంబర్ 11వ తేదీ భారతదేశంలో విద్యా రంగానికి చెందిన ఒక విశేష దినం. స్వతంత్ర భారతానికి మొదటి విద్యా మంత్రిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తింపు పొందిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినాన్ని స్మరిస్తూ ఈ రోజును జాతీయ విద్యా దినోత్సవంగా పాటిస్తున్నారు. మన దేశానికి మొదటి విద్యాశాఖ మంత్రిగా 1947 నుంచి 1958 వరకు తన బాధ్యతల్ని సమర్థంగా నిర్వహించారు. భారతదేశానికి మొదటి ఉప రాష్ట్రపతిగా కూడా ఆయన సేవలందించారు. విద్య ఒక వ్యక్తి జీవితాన్ని మార్చడమే కాదు; ఒక దేశానికి కొత్త దిశను ఇవ్వగలదనే దూరదృష్టిని ఆయన జీవితంలో నిరూ పించారు.

అబుల్ కలాం ఆజాద్ 1888 నవంబర్ 11న జన్మించారు. చిన్న వయసులోనే భాషలు, సాహిత్యం, మతసిద్ధాంతాలపై ఆసక్తి చూపిన ఆయన తర్వాత పత్రికా రచయితగా, వక్తగా, కవిగా, రాజకీయ నాయకుడిగా దేశ ప్రజలకు సుపరిచితుడయ్యారు. అబుల్ కలాం అంటే మాటల యజమాని అని, ఆజాద్ అంటే స్వేచ్ఛాయుతుడు అని అర్థం. ఈ రెండు పదాలూ ఆయన జీవితానికి సరిపోయే విధంగా ఉన్నాయి.

స్వాతంత్ర్య ఉద్యమంలో ఆజాద్ కేవలం ఒక నాయకుడిగా నిలవలేదు. జాతీయ ఏకతను, మత సామరస్యాన్ని, సహనాన్ని ప్రజల మనసుల్లో నింపడానికి కృషి చేశారు. దేశ విభజన సమయంలో ఎదురైన దారుణ పరిస్థితులను చూసినప్పటికీ, అన్ని మతాల ప్రజలు ఒకే దేశ పౌరులుగా కలిసి నిలవాలని ఆయన నమ్మారు.


1947 ఆగస్టు 15 నుంచి 1958 ఫిబ్రవరి 2 వరకు ఆజాద్ స్వతంత్ర భారతానికి మొదటి విద్యా మంత్రిగా పనిచేశారు. ఆ కాలంలో దేశంలో సాక్షరత చాలా తక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు తక్కువ. బాలికల విద్యకు అడ్డంకులు ఎక్కువ. ఉన్నత విద్యకు సరైన సంస్థాగత నిర్మాణం లేదు. ఇటువంటి పరిస్థితిలో ఆయన విద్యను ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు.

ఆయన కాలంలో దేశ విద్యారంగానికి శాశ్వతమైన సంస్థలు ఏర్పడ్డాయి. 1951లో మొదటి భారతీయ సాంకేతిక విద్యాసంస్థ ఖరగ్‌పూర్‌లో స్థాపించబడింది. తర్వాత 1953లో విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటైంది. ఉన్నత విద్యా నాణ్యతను పరిరక్షిం చడానికి, విశ్వవిద్యాలయాలకు నిధులు అందించడానికి ఈ సంస్థ ఉపయోగ పడింది. అలాగే సాంకేతిక విద్యకు ప్రాధాన్యం ఇస్తూ అఖిల భారత సాంకేతిక విద్యా మండలిని బలోపేతం చేశారు. విద్య అంటే కేవలం విజ్ఞానం మాత్రమే కాదని ఆజాద్ గట్టిగా నమ్మారు. కళ, సాహిత్యం, సంగీతం, నాటకం వంటి రంగాలు కూడా దేశ ఆత్మ గౌరవాన్ని నిర్మించడంలో ముఖ్యమని ఆయన భావించారు. అందుకే ఆయన కాలంలో సంగీత నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ, సాహిత్య అకాడమీ వంటి సంస్థల స్థాపనకు దారితీసిన కృషి జరిగింది. భాషల సంరక్షణ, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, సృజనా త్మక ఆలోచన పెంపకం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

బాలికల విద్యపై ఆయనకు ప్రత్యేక నిబద్ధత ఉంది. ఆనాటి సమాజంలో అమ్మాయిలకు విద్య అందించడం అనేది అనేక ఇళ్లలో సాధారణ విషయం కాదు. అయినా ఆజాద్ బాలికల విద్యను దేశ ప్రగతికి తప్పనిసరి అంశంగా భావించారు. ఒక కుటుంబంలో అమ్మాయికి విద్య లభిస్తే తరతరాలకు ఆ వెలుగు విస్తరిస్తుందని ఆయన నమ్మారు. ఈ భావన నేటికీ అంతే స్పష్టంగా ఉంది. 2008లో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ నవం బర్ 11ను జాతీయ విద్యా దినోత్సవంగా ప్రకటించింది. ఇది ప్రభుత్వ సెలవు దినం కాదు. దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో చర్చలు, వ్యాస రచనలు, వక్తృత్వాలు, సెమినార్లు, ర్యాలీలు నిర్వహించడం ద్వారా విద్యా ప్రాముఖ్యతను తెలియజేయడమే ఉద్దేశం. ఈ రోజు కేవలం గతాన్ని స్మరించడానికి పరిమితం కాదు. నేటి విద్యావ్యవస్థలో మనం ఎక్కడికి చేరామో, ఎక్కడ మరింత మెరుగు పడాలో ఆలోచించడానికి ఇది ఒక అవకాశం. ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలి. పేదరికం, ప్రాంతీయ వ్యత్యాసం, భాషా అడ్డంకులు విద్యకు అడ్డంకులు కాకూడదు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య పెరగాలి. గ్రంథాలయాలు బలపడాలి. డిజిటల్ పరిజ్ఞానం అందరికీ అందాలి. అలాగే విద్యార్థుల్లో విమర్శాత్మక ఆలోచన, సృజనాత్మకత, పర్యావరణ ప్రజ్ఞ, మానవీయ విలువలు పెంపొందాలి. ఇవన్నీ కలిస్తేనే విద్య నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది. దేశాన్ని నిర్మించడంలో ఆయుధాలు మాత్రమే కాదు. పుస్తకాలు, ఉపాధ్యాయులు, తరగతి గదులు, ఆలోచనలు కూడా ముఖ్యమైన పాత్ర వహిస్తాయి. విద్య ఒక వ్యక్తిని స్వావలంబిగా మాత్రమే కాదు, సమాజానికి సేవ చేసే పౌరుడిగా కూడా మలుస్తుంది. ఈ దినోత్సవం ప్రతి ఇంట్లో ఒక ప్రశ్న వేయిస్తుంది-మన పిల్లలకు మనం కేవలం మార్కుల కోసమే విద్యను చూస్తున్నామా, లేక వారి ఆలోచనలో, పదజాలంలో, ప్రవర్తనలో మానవీయతను పెంచుతున్నామా? ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవడమే జాతీయ విద్యా దినోత్సవపు నిజమైన అర్థం. విద్య అనేది ఒక దీపం. అది ఒక్కరి జీవితాన్ని వెలిగించడమే కాదు. చుట్టూ ఉన్న అనేక జీవితాలకు కూడా వెలుగు అందిస్తుంది. మౌలానా అబుల్ కలాం ఆజాద్ అలాంటి దీపాన్ని దేశానికి అందించిన మహనీయుడు. ఆయన స్మృతిని గౌరవించడం అంటే కేవలం ప్రసం గాలు చేయడం కాదు. ప్రతి పిల్లాడికి విద్య అందుబాటులో ఉండేలా కృషి చేయడం. అప్పుడే ఆయన కలలు నిజమవుతాయి.

నేడు జాతీయ విద్యా దినోత్సవం
- చిటికెన కిరణ్ కుమార్
9490841284



...బాధ్యత అధికార, ప్రతిపక్షాలదే



ప్రజాస్వామ్యం అంటే చర్చలు, సంప్రదింపులు, పరస్పర గౌరవంతో పాలన సాగించడం. భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసుకునే స్వేచ్ఛ, ప్రజా సమస్యలపై చర్చించే అవకాశం, అధికార పక్షాన్ని ప్రశ్నించే హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణం. కానీ నేటి భారత రాజకీయాల్లో ఈ విలువలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ప్రజల సమస్యలపై చర్చించాల్సిన పార్లమెంటు రాజకీయ ఆధిపత్య పోరుకు వేదికగా మారుతోంది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం, సభా కార్యక్రమాలను అడ్డుకోవడం, చర్చలకు దూరంగా ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆందోళనకర పరిణామంగా మారింది.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో రాజకీయ సంస్కృతి వేగంగా మారుతోంది. ఒకప్పుడు రాజకీయ ప్రత్యర్థుల మధ్య తీవ్ర విభేదాలున్నప్పటికీ వ్యక్తిగత గౌరవం, సంప్రదింపులు కొనసాగేవి. దేశ ప్రయోజనాల విషయంలో అధికార, ప్రతిపక్షాలు ఒకే వేదికపైకి వచ్చి చర్చించేవి. కానీ ఇప్పుడు రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా చూసే పరిస్థితి ఏర్పడింది. విమర్శలకు ప్రతివిమర్శలు, ఆరోపణలకు ప్రత్యారోపణలే తప్ప సమస్యల పరిష్కారానికి మార్గాలు అన్వేషించే ప్రయత్నాలు కనిపించడం లేదు.

ఇటీవల దేశ రాజకీయాల్లో చోటుచేసుకున్న పరిణామాలు ఈ పరిస్థితిని మరింత స్పష్టం చేస్తున్నాయి. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ, ఓటు చోరీ ఆరోపణలు, ఎన్నికల నిర్వహణలో పారదర్శకత వంటి అంశాలపై అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్నాయి. ఇరుపక్షాలు చర్చలకు సిద్ధమని చెబుతున్నప్పటికీ, చర్చలు జరగాల్సిన వేదిక, విధానంపై ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఫలితంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన చర్చల ప్రక్రియ బలహీనపడుతోంది.

పార్లమెంటు సమావేశాల పనితీరును పరిశీలిస్తే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. పీఆర్ఎస్ శాసన పరిశోధనా సంస్థ గణాంకాల ప్రకారం 2026 వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ తన నిర్ణీత సమయాల్లో కేవలం 15 శాతం మాత్రమే పనిచేసింది. ప్రశ్నోత్తరాల సమయానికి కేవలం తొమ్మిది నిమిషాలు మాత్రమే కేటాయించగలిగారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన 11 బిల్లులు సరైన చర్చ లేకుండానే ఆమోదం పొందడం ప్రజాస్వామ్య సంప్రదాయాలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. గత సమావేశాల్లోనూ వాయిదాల కారణంగా గంటల తరబడి విలువైన సమయం వృథా అయింది.

ప్రజల పన్నులతో నడిచే పార్లమెంటులో ప్రజా సమస్యలపై చర్చ జరగకపోవడం బాధాకరం. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల



కష్టాలు, వ్యవసాయ సంక్షోభం, విద్య, వైద్యం వంటి కీలక అంశాలకు ప్రాధాన్యం దక్కాల్సి ఉంది. కానీ రాజకీయ వివాదాల కారణంగా ఈ సమస్యలు వెనుకబడుతున్నాయి. అధికార పక్షం తన మెజారిటీని ఉపయోగించి బిల్లులను ఆమోదించుకోవడానికే ప్రాధాన్యం ఇస్తోందనే విమర్శలు వస్తుండగా, ప్రతిపక్షాలు నిరసనల పేరుతో సభను స్తంభింపజేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రెండు ధోరణులూ ప్రజాస్వామ్యానికి మేలు చేయవు. భారత రాజకీయ చరిత్రలో విభేదాలున్నప్పటికీ దేశ ప్రయో జనాల కోసం నాయకులు కలిసికట్టుగా పనిచేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అటల్ బిహారీ వాజ్‌పేయికి విదేశాల్లో వైద్య చికిత్స అవసరమైనప్పుడు రాజీవ్ గాంధీ సహకరించారు. 1994లో కశ్మీర్ అంశంపై అంతర్జాతీయ వేదికపై భారత వాదనను వినిపించేందుకు అప్పటి ప్రతిపక్ష నాయకుడైన వాజ్‌పేయిని జెనీవాకు పంపించడంలో పీవీ నరసింహారావు కీలక పాత్ర పోషించారు.

ఆ కాలంలో రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ దేశ ప్రయోజనాల విషయంలో పరస్పర గౌరవం ఉండేది. ప్రణబ్ ముఖర్జీ, ప్రమోద్ మహాజన్, జస్వంత్ సింగ్, శరద్ పవార్ వంటి అనుభవజ్ఞులైన నాయకులు సంక్షోభ సమయాల్లో చర్చలు, సంప్రదింపుల ద్వారా ప్రతిష్టంభనలను తొలగించేవారు. రాజకీయాల్లో రాజీ పడటం బలహీనతగా కాకుండా ప్రజాస్వామ్య పరిపక్వతకు చిహ్నంగా భావించేవారు. ఇప్పుడు ఆ సంప్రదాయం కనుమరుగవుతున్నట్లు కనిపిస్తోంది.

ప్రజాస్వామ్యంలో అధికార పక్షానికి పాలించే హక్కు ఎంత ముఖ్యమో, ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు కూడా అంతే ముఖ్యం. ప్రజలు ఇచ్చిన మెజారిటీ పాలన సాగించడానికి మాత్రమే కానీ ప్రతిపక్ష గొంతును అణచివేయడానికి కాదు. ప్రభుత్వ విధానాల్లో తప్పులుంటే ఆధారాలతో ప్రశ్నించాలి. ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించాలి. చర్చల ద్వారా ప్రభుత్వాన్ని సమాధానం చెప్పేలా చేయాలి.

ప్రజాస్వామ్యానికి సంబంధించిన కీలక నిర్ణయాలు చట్టసభల్లోనే చర్చించబడాలి. అక్కడే ప్రజల సమస్యలకు పరిష్కారాలు వెతకాలి. సభలో చర్చ జరగకుండా బయట రాజకీయ విమర్శలు చేసుకోవడం వల్ల ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. ప్రభుత్వం ప్రతిపక్షానికి తగిన సమయం, అవకాశం కల్పించాలి.

ప్రజా సమస్యలపై చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలి. డిప్యూటీ స్పీకర్ వంటి రాజ్యాంగబద్ధమైన పదవుల భర్తీ విషయంలోనూ సంప్రదింపులు జరపాలి. ప్రతిపక్ష నేతను రాజకీయ ప్రత్యర్థిగా మాత్రమే కాకుండా రాజ్యాంగ వ్యవస్థలో కీలక బాధ్యత కలిగిన వ్యక్తిగా గౌరవించాలి.

రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ఎన్నికల్లో ఒక పార్టీ గెలవవచ్చు, మరొక పార్టీ ఓడిపోవచ్చు. కానీ ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడితే నష్టపోయేది దేశ ప్రజలే. అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ పోరు కొనసాగవచ్చు. అయితే ప్రజల సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగత ప్రతిష్ట కోసం పోరాడటం బాధ్యతాయుతమైన రాజకీయాలకు నిదర్శనం కాదు. చరిత్రలో ఎవరు ఎక్కువ నినాదాలు చేశారో, ఎవరు ఎక్కువసేపు సభను అడ్డుకున్నారో గుర్తుండదు. ప్రజాస్వామ్య సంస్థలను ఎవరు గౌరవించారు? ప్రజల సమస్యల పరిష్కారానికి ఎవరు కృషి చేశారు? భిన్నాభిప్రాయాలను గౌరవిస్తూ దేశ ప్రయోజనాలకు ఎవరు ప్రాధాన్యం ఇచ్చారు? అన్నదే చరిత్రలో నిలిచిపోతుంది.

పార్లమెంటు అనేది రాజకీయ నాయకుల అహంకారాలను ప్రదర్శించే వేదిక కాదు. కోట్లాది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమైన ప్రజాస్వామ్య దేవాలయం. అక్కడ చర్చలు ఆగిపోతే ప్రజాస్వామ్యానికి జీవం ఉండదు. అందుకే అధికార పక్షం, ప్రతిపక్షం తమ రాజకీయ అహంకారాలను పక్కనపెట్టి చర్చలు, సంప్రదింపులు, పరస్పర గౌరవానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజల గొంతుకగా నిలవాల్సిన పార్లమెంటును రాజకీయ కలహాల వేదికగా మార్చకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి. ప్రజాస్వామ్య దేవాలయానికి మళ్లీ పునర్జీవం పోయాల్సిన బాధ్యత అధికార, ప్రతిపక్షాలిద్దరిపైనా ఉంది.

- వెంక గారి భూమయ్య
9848559863

అకాల మృత్యు హరుడు... ధర్మపురి యముడు


'భూ'షణవికాస శ్రీధర్మపుర నివాస దుష్టసంహార నరసింహ దురితదూర' అనే మకుటంతో భక్త గ్రేసరులు శేషప్ప రాసిన నరసింహ శతక పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని, తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టు కొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు నెలవుగా హైందవ ధర్మ ప్రచారం కేంద్ర బిందువుగా విరాజిల్లుతున్నది గోదావరి తీరస్థ తీర్థమైన ప్రాచీన ధర్మపురి క్షేత్రం. బ్రహ్మాండ, స్కందాది పురాణాలలో, ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం నిక్షిప్తమై ఉంది. ఈ క్షేత్ర దేవస్థాన అంతర్గతంగా ఉన్న యమధర్మరాజు మందిరం, విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. భారతావనిలోనే అరుదుగా, అపురూపంగా, క్షేత్రంలో వెలసిన 'యమధర్మరాజును దర్శిస్తే', 'యమపురి' ఉండబోదని ప్రతీతి. ఉగ్ర నరసింహ స్వామిని శాంతింప చేసేందుకు, బ్రహ్మాది దేవతలు పుణ్యతీర్థం, పవిత్రక్షేత్రము అయిన ధర్మపురిలో తపో, యజ్ఞ, ధ్యానం ఆది సత్కర్మలను ఒనరించి నట్లు స్థల పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. స్కాంద పురాణాంతర్గత 'ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం' ఆధారంగా నైమిశారణ్యంలో సూత పౌరాణికుడు, శౌనకాది మహర్షులకు వివరించినట్లు నారదుడు పృథు మహారాజుకు క్షేత్ర మహిమను తెలిపినట్లు వివరించ బడింది. యమధర్మరాజు నరసింహుని మందిరానికి ఏగి, చేసిన పూజలకు ప్రసన్నుడైన నరసింహుడు, యమధర్మరాజును తన సన్నిధిలో నివసించమని తెలిపెనని పురాణాల ఆధారం. యముడు గోదావరిలో స్నానమాచరించిన స్థలమునకు 'యమ కుండము' అని పేరు కలిగినట్లు, అచట స్నానమాచరించి, నరసింహుని పూజించు వారికి యమ లోక బాధలు కలుగకుండా ఉండు న్నట్లు, సర్వ పాప విముక్తి కలుగునట్లు, నరసింహుడు వరం ఇచ్చినట్లు, యమ ధర్మరాజు తన అంశ రూపమును, నరసింహ మందిర పురో భాగమున నిలిపెనని, పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. దేవస్థానంలో యోగానంద నరసింహ ప్రధానాలయం ముందు భాగాన, ఉంది యమ ధర్మ రాజ మందిరం. కోరలతో, యమ దండాన్ని ధరించిన భీకరాకార ఆరు అడుగుల భారీ విగ్రహం ఇందుంది. 'దక్షిణాదిభి ముఖీ గంగా, యత్ర దేవో నృకేసరి, తత్ర శ్రీర్విజయోర్భూతి: కాశ్య యశ్వత గుణం భవేత్', అని అని దక్షిణ అభి ముఖియై ప్రవహిస్తున్న గోదావరి తీరస్థమైన, ధర్మపురి క్షేత్రం విశిష్టతను కలిగి ఉన్నది.



వేరే ఎక్కడ కాన రాని విధంగా, ధర్మపురి క్షేత్రం వద్ద గోదావరి దక్షిణ వాహినిగా ప్రవహిస్తు న్నది. అష్టదిక్పాలకులలో ఒకరైన యముడు, దక్షిణ దిశకు అధిపతి. అంతేకాక గ్రహాల దృష్ట్యా, కుజుడు దక్షిణ దిశకు అధిపతి. కుజ గ్రహానికి మూలాధిపతి నరసింహుడు అని పరాశరుడు బృహత్ పరాశర హోరా శాస్త్రం నందు నుడివి ఉన్నాడు. కనుక ధర్మపురిలో దక్షిణ వాహినిగా ఉన్న గౌతమి యందు దక్షిణాభిముఖులై, స్నానాలు ఆచరిస్తే నరసింహుని దర్శిస్తే, నరక బాధలు ఉండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ధర్మపురిలో వెలసిన యమ ధర్మరాజును దర్శించే భక్తుల సంఖ్య, నానాటికీ అధికమ వుతున్నది. ఇటీవల సంభవిస్తున్న అనూహ్య ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా, అకాల మృత్యు నివారణకై అధర్వణ వేదంలో పేర్కొనబడిన 'ఆయుష్య సూక్తం' ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే భరణి నక్షత్రం, చతుర్దశి తదితర ప్రత్యేక దినాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. బుధ వారం యమ ద్వితీయ సంధర్భంగా, అభిషేకం, ఆయుష్య సూక్తం, యమ సూక్త మంత్రం, పురుష సూక్తం, శ్రీసూక్తం, జ్వర హర స్తోత్ర పఠనాలు, రోగ నివారణ సూక్తాలు పూజలు, యమాష్టకాది నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

తెలంగాణ వైతాళికుడు మాడపాటి



హైదరాబాద్ సంస్థానంలో నిజాం నవాబు నిరంకుశ పాలన, అణచివేత నిర్బంధాల నడుమ నలిగి పోతున్న తెలంగాణ సమాజంలో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక చైతన్య రథాన్ని ముందుండి నడిపించిన యుగపురుషుడు 'ఆంధ్రపితామహుడు' మాడపాటి హనుమంతరావు గారు. తెలంగాణ ప్రజలను దాస్య శృంఖలాల నుంచి విముక్తులను చేయడానికి, మాతృభాష ప్రాభవాన్ని పునరుద్ధరించడానికి ఆయన తన జీవితాన్ని ధారపోశారు.ఆయన వర్ధంతి సందర్భంగా, నవతెలంగాణ నిర్మాణానికి ఆయన వేసిన బలమైన పునాదులను, ఆయన బహుముఖ ప్రజ్ఞను స్మరించుకోవడం మనందరి బాధ్యత.

మాడపాటి హనుమంతరావు గారు 1885 జనవరి 22న కృష్ణా జిల్లాలోని నందిగామ తాలూకా పొక్కూరు గ్రామంలో లక్ష్మమ్మ, వెంకటరామయ్య దంపతులకు జన్మించారు. ఆయన ప్రాథమిక విద్య గుంటూరు జిల్లా పరిధిలో సాగగా, ఉన్నత విద్యాభ్యాసాన్ని హైదరాబాద్‌లోని మెథడిస్ట్ మిషన్ హైస్కూల్లో పూర్తి చేశారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను, వసతుల లేమిని ఎదుర్కొన్నప్పటికీ, పట్టుదలతో చదువును కొనసాగించారు. అనంతరం స్వయంకృషితో హనుమంతరావు గారు హైకోర్టు ప్లీడర్‌షిప్ పరీక్షలో ఉత్తీర్ణులై, నాటి హైదరాబాద్ సంస్థానంలో సమర్థుడైన న్యాయవాదిగా పేరుప్రతిష్ఠలు సంపాదించారు. ఆరంభం నుంచే మాతృభాష అయిన తెలుగుపై ఉన్న అమితమైన అభిమానం, బాల్యంలో అనుభవించిన శ్రమ ఆయనను సమాజ సేవ వైపు, తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనం వైపు నడిపించాయి.

మాడపాటి హనుమంతరావు గారి పేరు వినగానే మొదటగా గుర్తుకువచ్చేది భాషాసేవ మరియు గ్రంథాలయోద్యమం. నిజాం పాలనలో తెలుగు భాష నిర్బంధానికి గురై, పాఠశాలల్లో బోధనకు నోచుకోని కాలంలో ఆయన మాతృభాషా పరిరక్షణకు కంకణం కట్టుకున్నారు. కంభంపాడు, నల్గొండ వంటి ప్రాంతాల్లో గ్రంథాలయాల స్థాపనకు ఊపిరిపోశారు.

1901లో స్థాపించిన శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, ఊరూరా గ్రంథాలయాలను నెలకొల్పి ప్రజల్లో పఠనాభిలాషను, విజ్ఞానాన్ని పెంపొందించారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిలయాలు కావు, అవి విప్లవ చైతన్య కేంద్రాలని ఆయన నిరూపించారు.

నిజాం రాజ్యంలోని తెలుగు ప్రజల హక్కుల సాధన కోసం 1930లో రూపుదిద్దుకున్న 'హైదరాబాద్ రాష్ట్ర ఆంధ్ర మహాసభ'కు మాడపాటి హనుమంతరావు గారే ప్రధాన సూత్రధారి. మెదక్ జిల్లా జోగిపేటలో జరిగిన మొదటి ఆంధ్ర మహాసభకు అధ్యక్ష వహించి, నాటి సామాజిక చైతన్యానికి బలమైన పునాది వేశారు. తెలంగాణలో ఊరురా శాఖలు ఏర్పాటు చేసి వెట్టిచాకిరీ నిర్మూలన, బాల్యవివాహాల రద్దు, స్త్రీ విద్య విస్తరణ, రైతాంగ సమస్యల పరిష్కారం వంటి అనేక సామాజిక అంశాలపై ప్రజలను చైతన్యపరిచారు. ఈ వేదిక ద్వారానే తదనంతర కాలంలో తెలంగాణ సాయుధ పోరాటానికి మరియు నిజాం వ్యతిరేక ఉద్యమానికి అవసరమైన నాయకత్వం ఉద్భవించింది.

సమాజ పురోగతి స్త్రీ విద్యపైనే ఆధారపడి ఉందనేది మాడపాటి గారిదృఢమైన నమ్మకం. నాటి సంప్రదాయ సమాజంలో బాలికా విద్య తీవ్ర ప్రతిఘటనలను ఎదుర్కొంటున్న సమయంలో, 1928లో నారాయణగూడలో 'మాడపాటి హనుమంతరావు బాలికల ఉన్నత పాఠశాల'ను స్థాపించారు. నిజాం ప్రభుత్వం నుండి ఎలాంటి ఆర్థిక సహాయం లేకపోయినా, చందాలు సేకరించి తెలుగు మాధ్యమంలో బాలికలకు విద్యాబుద్ధులు నేర్పించారు. ఆయన చూపిన ఈ చొరవ తెలంగాణలో స్త్రీ సాధికారతకు మొదటి మెట్టుగా నిలిచింది.

మాడపాటి గారు కేవలం ఉద్యమకారుడే కాక, అద్భుతమైన పరిపాలనా దక్షుడు, న్యాయవాది మరియు రచయిత. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత 1958 నుండి 1964 వరకు రాష్ట్ర శాసనమండలి మొదటి చైర్మన్గా వ్యవహరించి, సభా సంప్రదాయాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగర మేయర్గా కూడా సేవలందించి నగర అభివృద్ధికి కృషి చేశారు. ఆయన సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం ఆయనను 'పద్మభూషణ్' బిరుదుతో సత్కరించింది.

తెలంగాణ సమాజ పునర్నిర్మాణానికి, భాషా వికాసానికి జీవితాంతం నిరంతరం శ్రమించిన మాడపాటి హనుమంతరావు గారు 1970 నవంబర్ 11న తమ 85వ ఏట తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, తెలంగాణ నేలపై ఆయన రగిలించిన విద్యా, సాంస్కృతిక చైతన్య జ్వాలలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి.మాడపాటి హనుమంతరావు గారు కేవలం ఒక వ్యక్తి కారు, తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి మూలస్తంభంగా నిలిచిన ఒక చారిత్రక శకం. స్వయంకృషి, నిరాడంబరత, ప్రజాసేవే పరమావధిగా జీవించిన ఆయన మూర్తీభవించిన త్యాగనిరతికి ప్రతీక. నిజాం నిర్బంధ పాలనలో తెలుగు భాషకు, సంస్కృతికి ఊపిరిపోసి, ప్రజాస్వామ్య పునాదులు వేసిన 'ఆంధ్రపితామహ' ఆశయాలను కాపాడుకోవడం, ఆయన చూపిన విద్యా వికాస మార్గంలో పయనించడమే మనమందరం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి.

నవంబర్ 11 మాడపాటి హనుమంతరావు వర్ధంతి
- సుధాకర్.ఏ.వి
9000674747



గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లకు
పక్కా ప్రణాళిక రూపొందించాలి

- జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్

జగిత్యాల, నవంబర్ 10 (మనం ప్రతినిధి): గోదావరి పుష్కరాలు -2027 ను దృష్టిలో ఉంచుకొని ధర్మపురి, ఇతర ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్ల కోసం పక్కా ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో ఎస్పీ అశోక్ కుమార్తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కరాల కోసం ఈ.వై. కన్సల్టెన్సీ, ఏజెన్సీ హైదరాబాద్ వారు రూపొందించిన ప్రాథమిక ప్రణాళికను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు,ఈ.వై. కన్సల్టెన్సీ, ఏజెన్సీ ప్రతినిధులు వివరించారు. జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ,

పుష్కరాలకు ఇంకా ఆరు నెలల సమయం మాత్రమే ఉన్నందున ప్రతి శాఖ తన పరిధిలో చేపట్టాల్సిన పనుల పై ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏజెన్సీ రూపొందించిన ప్రాథమిక ప్రణాళికను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన మార్పులు, చేర్పులు చేయాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి, పుష్కరాల సమయంలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించాలని, ఈ.వై. కన్సల్టెన్సీ ఏజెన్సీ ప్రతిపాదించిన అంశాలతో పాటు అదనంగా అవసరమైన సదుపాయాలు, పనులను కూడా ప్రతిపాదించాలని తెలిపారు.

గోదావరి పుష్కరాలు జరిగే ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తిస్థాయి ప్రణాళిక, ఖచ్చితమైన అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. వివిధ శాఖలకు సంబంధించిన పనుల ఎస్టిమేషన్లను మూడు రోజుల్లోగా నిర్ణీత నమూనా ఫారంలో సమర్పించాలని ఆదేశించారు.

పుష్కరాల ఏర్పాట్లకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి పంపే ప్రతిపాదనలు, అంచనాలు కచ్చితంగా ఉండాలని, ఏదైనా అవసరమైన పనికి నిధుల ప్రతిపాదనలో లోపం జరిగితే పుష్కరాల నిర్వహణ మొత్తం ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.

భక్తులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి ధర్మపురి గోదావరి తీరంలో స్నాన ఘాట్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదులు, దుస్తులు మార్చుకునే గదులు, మంచినీటి ట్యాపులు, పారిశుద్ధ్య సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో గుర్తించాలని సూచించారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా తాత్కాలిక పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి, అక్కడి నుంచి స్నాన ఘాట్లు, ఆలయానికి చేరుకునేందుకు షటిల్ బస స్ల నిర్వహణపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలన్నారు. వాహనాల రాకపోకలు, పార్కింగ్, బస్సుల రాకపోకలు, భక్తుల నడక మార్గాలు పరస్పరం ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ మేనేజ్మెంట్ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. 1,331.84 హెక్టార్లలో 9 జోన్లు, 20 సెక్టార్లుగా (వివిధ శాఖల) ప్రణాళిక ఈ.వై. కన్సల్టెన్సీ ఏజెన్సీ రూపొందించిన లేఅవుట్ ప్రణాళిక ప్రకారం ధర్మపురిలో మొత్తం 1,331.84 హెక్టార్ల పరిధిలో పుష్కరాల ఏర్పాట్లను ప్రతి పాదించారు. ఇందులో 9 కార్యాచరణ జోన్లు, 20 సెక్టార్లుగా విభజించి వివిధ శాఖలకు బాధ్యతలు కేటాయించేలా ప్రణాళిక రూపొందించారు. వసతి, బస్సులు, బస్టాండ్, అత్యవసర సేవలు, ఘాట్లు, మాస్టర్ కంట్రోల్ రూమ్, భక్తుల నడక మార్గాలు, ఆలయం, వీఐపీ, వీవీఐపీ ఏర్పాట్ల కోసం ప్రత్యేక జోన్లను ప్రతిపాదించారు.

తాత్కాలిక ఏర్పాట్లలో భాగంగా సుమారు 161 హెక్టార్లలో పార్కింగ్, 33 హెక్టార్లలో టెంట్ సిటీ, 10 హెక్టార్లలో హోల్డింగ్ ప్రాంతాలు, 4 హెక్టార్లలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రాంగణాలు, 2.5 హెక్టార్లలో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా ప్రతిపాదించారు.

ధర్మపురిలో సుమారు 800 మీటర్ల మేర గోదావరి ఘాట్ల అభివృద్ధి, దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు, కేశఖండన కేంద్రాలు, ఘాట్ల సుందరీకరణ, బ్రహ్మ పుష్కర కుండ అభివృద్ధి, జీవవైవిధ్య పార్కు, చెరువుల పునరుజ్జీవనం, ప్రధాన కూడళ్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, మార్కెట్ వీధుల అభివృద్ధి, బస్టాండ్ ఆధునీకరణ, ఆలయ పరిసరాల్లో భక్తులకు అనుకూలమైన వసతుల కల్పన వంటి ప్రతిపాదనలను ఏజెన్సీ వివరించింది.

ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, పుష్కరాల సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ ప్రాంతాల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.

భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షించేందుకు అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, కీలక కూడళ్లు, ఘాట్లు, ఆలయ పరిసరాల్లో పోలీసు సిబ్బందిని నియమించడం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తూ పుష్కరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఎస్పీ ఆదేశించారు.

ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసూనాంబ, ఈ.వై. కన్సల్టెన్సీ ఏజెన్సీ, ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



జగిత్యాల, నవంబర్ 10 (మనం న్యూస్): జగిత్యాల ముస్లిం సెంట్రల్ కమిటీ అధ్యక్షులు బారీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు 75 వేల రూపాయల స్కాలర్ షిప్ ను మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బారీ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల చదువుకు అండగా నిలువాలనే ఉద్దేశ్యంతో జగిత్యాల సెంట్రల్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన 75 మంది నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ ఇమ్రాన్, అజీమ్ రాహి, పట్వారి సాజీద్, పట్వారి ముజాహిద్, ఇర్ఫాన్, నసీం, ఆసిమ్, ఇర్షాద్, రెహాన్, షేన్నా, షజ్జీ ఫెరోజ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న పంటల సాగుతో నెలకు రూ.50 వేల ఆదాయం



- ఎకరం 20 గుంటల్లో పది రకాల ఆకుకూరలు, కూరగాయల సాగు
- ఆదర్శ రైతు గుర్రాల సత్యారెడ్డి
- క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల, నవంబర్ 10 (మనం ప్రతినిధి): సిరిసిల్ల జిల్లాలో విభిన్న రకాల ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తూ నెలకు రూ.50 వేల వరకు ఆదాయం పొందుతున్న గొల్లపల్లి గ్రామ రైతు గుర్రాల సత్యారెడ్డి ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎకరం 20 గుంటల విస్తీర్ణంలో తోటకూర, పాలకూర, చుక్కకూర, కొత్తిమీర, పుదీనా, వంకాయ, సొరకాయ, పచ్చిమిర్చి, బీట్రూట్ తదితర పంటలు సాగు చేస్తున్నారు. వారాని కోసారి పంట ఉత్పత్తులు చేతికి రావడంతో నిరంతర ఆదాయం పొందుతున్నారు. పంటల రక్షణకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారు.

రైతు సాగు విధానాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అభినందించారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్న సత్యారెడ్డిని ఇతర రైతులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అప్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ దివ్య, ఎంపీడీవో సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను గడువు లోపు పూర్తి చేయాలి

కొత్తపల్లి - హుస్నాబాద్ ఫోర్ లేన్ రోడ్డు పనులను పరిశీలించిన మంత్రి పొన్నం




చిగురు మామిడి నవంబర్ 10 (మనం న్యూస్): కొత్తపల్లి - హుస్నాబాద్ మధ్య కొనసాగుతున్న నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులను రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పనులు జరుగుతున్న తీరును, కల్వర్టుల నిర్మాణం, రహదారి విస్తరణ తదితర అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. రహదారి నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతం చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను మంత్రి ఆదేశించారు. ఇప్పటికే కల్వర్టుల నిర్మాణ పనులను పూర్తి చేసి, ఒకవైపు రహదారి నిర్మాణం పూర్తవుతున్న నేపథ్యంలో ఆ మార్గాన్ని వీలైనంత త్వరగా వాహనదారులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. తద్వారా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తగ్గించడంతో పాటు, రెండో వైపు రహదారి నిర్మాణ పనులను మరింత ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ పనులకు నిర్దిష్ట లక్ష్యాలను (డైలీ టార్గెట్స్) నిర్దేశించుకొని ఆ లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. పనుల పురోగతిని రోజువారీగా సమీక్షిస్తూ, అవసరమైన యంత్రాలు, సిబ్బంది, నిర్మాణ సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ప్రజలకు, వాహనదారులకు ప్రయాణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, నిర్మాణ పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నాలుగు లైన్ల రహదారి అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు ప్రయాణ సమయం కలుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

వైభవంగా ఆకాశ దీపోత్సవం

దీపకాంతుల్లో వెలిగిపోయిన సుందరగిరి

గోవింద నామస్మరణతో మారుమోగిన సుందరగిరి ఆలయం





చిగురుమామిడి, నవంబర్ 10 (మనం న్యూస్): మండలంలోని శివకేశవ ఆలయాల్లో వైభవంగా ఆకాశ దీపోత్సవం ఘనంగా దేవాలయాల్లో అర్చకులు నిర్వహించారు. మండలంలోని సుందరగిరి గ్రామంలో కొలువై ఉన్న, ప్రసిద్ధిగాంచిన కొంగు ముడి బంగారం అని భక్తులచే పూజలందుకుంటున్న సుందరగిరి శ్రీ కోరమీసాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆకాశ దీపోత్సవం వైభవంగా జరిగింది. కార్తీక మాసం ప్రారంభం నుంచి ముగిసే వరకు ఆలయాల్లోనూ, ఇళ్ల వద్ద కూడా ఆకాశ దీపం వెలిగిస్తారు. ఆకాశ దీపోత్సవం ఈ నెల నవంబర్ 10 నుంచి, డిసెంబర్ 8 వరకు నెల రోజుల పాటు జరుగుతుంది. కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమి 24 నవంబర్ నాడు అత్యంత వైభవంగా దీపోత్సవం నిర్వహిస్తారు. కార్తీక మాసం... పుణ్య మాసం... దీపాల మాసం... ఈ పుణ్య మాసం రాగానే సుందరగిరి గ్రామమంతా ఒక్కసారిగా భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. ఆలయం దీపకాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోయి, చూసే వారికి కనుల పండుగగా నిలిచింది. భక్తితో పులకించిన సుందరగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం

ఈ సందర్భంగా అర్చకులు శేషం నవీన్ కుమార్ ఆచార్యులు మాట్లాడుతూ కార్తీక మాస విశిష్టతను, ఆకాశ దీపం వెనుక ఉన్న పరమార్థాన్ని భక్తులకు వివరించారు. కార్తీక మాసం శివుడికి, విష్ణువుకు ఇద్దరికీ అత్యంత ప్రీతికరమైన మాసం. ఈ మాసంలో వెలిగించే ప్రతి దీపం కోటి దీపాలతో సమానం. ఆకాశ దీపం అంటే ఎత్తైన ప్రదేశంలో, ఆలయ గోపురంపై, తులసి కోట వద్ద వెలిగించే దీపం. ఆ దీపం కాంతి పితృదేవతలకు, దేవతలకు మార్గం చూపుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఆలయంలో ధ్వజస్తంభం ముందు దీపస్తంభం ఉంటుంది. ధ్వజస్తంభం అంటే స్వామివారి పతాకం ఎగురవేసే కొడిమరం. దీపస్తంభం అంటే ఆ ధ్వజస్తంభం ముందు దీపం పెట్టడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పవిత్ర స్తంభం. భగవంతుని కరుణ, దయ అందరిపై ప్రసరించాలని, మనుషులే కాదు మూగజీవాలు, దారి తప్పిన బాటసారులు కూడా ఆ వెలుగులో దారి కనుక్కోవాలని ఆ దీపస్తంభంపై దీపం వెలిగిస్తారు. ఆ దీపం వెలుగు నాలుగు దిక్కులకు వ్యాపించి గ్రామానికి రక్షణ కవచంలా నిలుస్తుందని, గ్రామంలో రోగాలు, అరిష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. అనంతరం భక్తులందరూ సామూహికంగా కార్తీక దీపాలను వెలిగించి, ఆకాశ దీపాన్ని దర్శించుకుని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, సుందరగిరి కోరమీసాల వేంకటరమణ గోవిందా అంటూ నామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా మారుమోగిపోయింది. ఈ కార్యక్రమంలో , గ్రామ సర్పంచ్ జంగ శిరీష రమణ రెడ్డి, కంది తిరుపతి రెడ్డి మాధవిరెడ్డి, చిగురుమామిడి సింగిల్ విండో మాజీ అధ్యక్షులు జంగా వెంకటరమణారెడ్డి,ఆలయ జూనియర్ అసిస్టెంట్ బూట్ల కవిత, బొల్ల బత్తిని వరలక్ష్మి, కొలిపాక రాజవ్వ, రాజమ్మ, బెజగం వీరేశం సరిత వేదశ్రీ, మాడిశెట్టి స్వరాజలక్ష్మి, జ్యోతి, శ్వేత,మహిళలు అధిక సంఖ్యలో, పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుతో అధిక ఆదాయం పొందాలి

- వరి సాగుకు స్వస్తి పలికి ఆయిల్ఫాం, కూరగాయలు, పప్పుధాన్యాలు సాగు చేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



సిరిసిల్ల, నవంబర్ 10 (మనం ప్రతినిధి): సిరిసిల్ల జిల్లాలో సూపర్ ఎల్నినో ప్రభావం నేపథ్యంలో రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. గంభీరావుపేట మండలం రాజేశ్వరావునగర్లో మంగళవారం నిర్వహించిన కేతు బచావో అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని పలువురు ఉత్తమ రైతులను సన్మానించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..... నీటి, విద్యుత్ వినియోగం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా ఆయిల్ఫామ్, నువ్వులు, వేరుశనగ, కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు సాగు చేయాలని సూచించారు. ఆయిల్ఫామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ సదుపాయం కల్పిస్తుందని తెలిపారు.

గంభీరావుపేట మండలంలో భూగర్భ జలాలు గత ఏడాది 5.96 మీటర్ల లోతులో ఉండగా, ఈ ఏడాది 8.39 మీటర్లకు పడిపోయాయని, విద్యుత్ వినియోగం కూడా 25 శాతం పెరిగిందని వెల్లడించారు. గత సీజన్లో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహనతో జిల్లాలో 40 వేల ఎకరాల వరి సాగు తగ్గిందని, 700 ఎకరాలకు పైగా ఆయిల్ఫామ్ సాగు విస్తరించిందని తెలిపారు. నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు, వ్యవసాయ క్షేత్రాల్లో పామ్పాండ్లు నిర్మించుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అప్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్బాబు, తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎంపీడీవో రాజేందర్, సర్పంచ్ పిట్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోషకాహారంతో పిల్లలకు ఎంతో మేలు

సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల, నవంబర్ 10 (మనం ప్రతినిధి): సిరిసిల్ల జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. గంభీరావుపేట మండలం గజసింగవరంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన 10 నిమిషాల కార్యక్రమంలో ఆమె పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. పిల్లల ఎత్తు, బరువు పరిశీలించి ఆరోగ్య కార్డుల్లో వివరాల నమోదు, వైద్య శిబిరం, పోషకాహార పదార్థాల ప్రదర్శనను పరిశీలించారు. ఆరేళ్లలోపు పిల్లలను ప్రతినెలా అంగన్వాడీ కేంద్రాలకు తీసుకెళ్లి ఎత్తు, బరువు నమోదు చేయించాలని, సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. బాలామృతం, బాలామృతం ప్లస్ వంటి పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎదుగుదల లోపాలు, రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలున్న చిన్నారులకు బాల భరోసా, ఆర్బీఎస్కే ద్వారా అవసరమైన వైద్య పరీక్షలు, మెరుగైన చికిత్స అందిస్తామని వెల్లడించారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలతో కూడిన పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి హనుమంతు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎంపీడీవో రాజేందర్, సర్పంచ్ ఉమ్మారెడ్డి విమల తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతుళ్ల మరణం తట్టుకోలేనిది

వారి పార్థివ దేహాలకు నివాళులర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్

బాధిత కుటుంబాన్ని పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి

ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా



చిగురుమామిడి, నవంబర్ 10 (మనం న్యూస్): హుస్నాబాద్ ప్రధాన రహదారిపై హుస్నాబాద్ మండలం పందిళ్ల శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది.ఈ ప్రమాదంలో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పైడిపల్లి శ్రీకాంత్ (33), ఆయన తొమ్మిదేళ్ల కుమార్తె మహాన్వి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.మంగళవారం మృతుల స్వగ్రామమైన కొండాపూర్కు చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్, శ్రీకాంత్, మహాన్వీల పార్థివ దేహాలకు పూలమాలలు వేసి అశ్రునయనాలతో నివాళులర్పించారు.ఒకే కుటుంబంలో యాజమానితో పాటు చిన్నారి కూతురు కూడా రోడ్డు ప్రమాద మహమ్మారికి బలికావడం అత్యంత హృదయవిదారకమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం మృతుల కుటుంబ సభ్యులను, బంధువులను కలిసి మంత్రి ఓదార్చారు.వారిని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.గుండెకోతతో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని,అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్,సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్ గౌడ్,నాయకులు వంగర మల్లేశం,ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, బింగి రాజేంద్రప్రసాద్,స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులుగ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మృతులకు నివాళులర్పించారు.

నేర నియంత్రణపై ప్రత్యేక నిఘా పెట్టాలి



- ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలి
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- సిరిసిల్ల జిల్లాలో పోలీస్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీ

సిరిసిల్ల, నవంబర్ 10 (మనం ప్రతినిధి): సిరిసిల్ల జిల్లాలో నేర నియంత్రణకు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇల్లంతకుంట, బోయినపల్లి పోలీస్ స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, స్టేషన్ నిర్వహణ, సిబ్బంది విధులను సమీక్షించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... రౌడీషీటర్లు, పాత నేరస్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, రాత్రి గస్తీ, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. హెల్మెట్, సీట్బెల్ట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులు, రిజిస్టర్లను క్రమబద్ధంగా నిర్వహిస్తూ ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు నాగేశ్వరరావు, శ్రీనివాస్, ఎస్ఐలు ఉపేంద్రచారి, లక్పతి, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రెండు, మూడు రోజుల్లో చెరుకు మద్దతు ధర ప్రకటించాలి

- చక్కెర ఫ్యాక్టరీల ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, చెరుకు రైతులతో సమీక్ష
- అదనపు కలెక్టర్ సంగీత



సంగారెడ్డి, నవంబర్ 10 మనం ప్రతినిధి : చెరుకు రైతులకు గిట్టుబాటు అయ్యేలా ఫ్యాక్టరీ యాజమాన్యాలు మద్దతు ధర నిర్ణయించి చెల్లించాలని జిల్లా అదనపు కలెక్టర్ సంగీత సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో చక్కెర ఫ్యాక్టరీల ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు చెరుకు రైతులు , చక్కెర శాఖ అధికారులతో చెరుకు ధర నిర్ణయంపై ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ , పరిశ్రమల అభివృద్ధి, రైతుల సంక్షేమం రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ఫ్యాక్టరీ యాజమాన్యాలు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పరిశ్రమలు, వ్యవసాయం సమాంతరంగా అభివృద్ధి చెందేలా సహకరించాలన్నారు. రైతులు, చక్కెర ఫ్యాక్టరీల యాజమాన్యాలు నష్టపోకుండా, రైతులకు గిట్టుబాటు అయ్యే విధంగా సహేతుకమైన ధర నిర్ణయించాలని పేర్కొన్నారు. రైతుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని రెండు, మూడు రోజుల్లోగా చెరుకు మద్దతు ధరతో పాటు రవాణా చార్జీలను నిర్ణయించి ప్రకటించాలని ఫ్యాక్టరీ ప్రతినిధులకు సూచించారు. నిర్ణయించిన ధర వివరాలను జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని ఆదేశించారు. ఎల్నినో ప్రభావంతో నీటి వినియోగం అధికంగా ఉండే వరి సాగును తగ్గించి, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

సమావేశంలో రైతులు మాట్లాడుతూ, ఎల్నినో ప్రభావంతో చెరుకు దిగుబడులు తగ్గి, సాగు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఫ్యాక్టరీలు సాధారణంగా చెల్లించే నిర్ణీత ధర కంటే ఎక్కువ ధర చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. చెరుకు టన్నుకు కనీసం ఐదు వేల రూపాయలు మద్దతు ధర చెల్లించేలా ఫ్యాక్టరీ యాజమాన్యాలు నిర్ణయం తీసుకోవాలని కోరారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల్లో చెరుకుకు మెరుగైన ధర లభిస్తోందని, అక్కడి ఫ్యాక్టరీలకు చెరుకు సరఫరా చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. చెరుకు సాగుకు పెరిగిన పెట్టుబడి ఖర్చులు, ఎరువులు, డీజిల్ ధరలు, చెరుకు నరికే కూలీల ఖర్చులు, రవాణా చార్జీల పెరుగుదలను పరిగణనలోకి తీసుకోవాలని, ఏడాది పొడవునా శ్రమించి చెరుకు పంట సాగు చేస్తున్న రైతులకు వారి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా ఫ్యాక్టరీ యాజమాన్యాలు ధర నిర్ణయించాలని కోరారు. చెరకు నరికే కూలీల ఖర్చులు, రవాణా వ్యయాలను దృష్టిలో ఉంచుకుని రైతులకు న్యాయం జరిగేలా ధర ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో సీడీసీ సంగారెడ్డి చైర్మన్, రాష్ట్ర చెరుకు పరిశ్రమల పునరుద్ధరణ కమిటీ సభ్యుడు జి. రాంరెడ్డి, సీడీసీ రాయికోడ్ చైర్మన్ ఎం.డి. మోబిన్, రైతు ప్రతినిధులు నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాధవరెడ్డి, నాజర్, మల్లారెడ్డి, చందర్ తదితరులు, ఫ్యాక్టరీ ప్రతినిధులు, చక్కెర శాఖ అధికారులు రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి విశ్రాంతి కార్మికులకు
డీఎల్సీ ఉచిత జీవన ప్రమాన్



హనుమకొండ, నవంబర్ 11 మనంన్యూస్ : సింగరేణి విశ్రాంతి ఉద్యోగులు హనుమకొండ పబ్లిక్ గార్డెన్ లో సమావేశం నిర్వహించారు. జీవన్ ప్రమాన్ డీఎల్సీ 35 మందికి చేయడముజరిగినది.ఈనెల 1వ తేదీ నుంచి ఇప్పటివరకు వరకు 250 మంది వరకు జీవన ప్రమన్ చేశారు. కాజంపురం దామోదర్ విశ్రాంతి ఉపాధ్యాయుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కుటుంబ వ్యవస్థ గురించి మాట్లాడారు. పిల్లలతో ఎలా మాట్లాడాలి వారి బాగోగుల గురించి వారి ఆరోగ్యము మరియు వారికి ప్రవర్తన గురించి వివరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కడారి ప్రకాష్ చారి మాట్లాడుతూ పెన్షన్ ప్రతినెల 1వ తారీఖున చెల్లించాలని ఒకవేళ ఒకటవ తేదీ రోజు సెలవు వస్తే ఒకరోజు ముందే అన్ని బ్యాంకుల లో జమ చేయాలని రిమాండ్ చేశారు చిదరాల సత్యనారాయణ మాట్లాడుతూ సిఎంపీఫ్ ఆఫీసులో జరుగుతున్న ఫండ్ నకు సంబంధించిన అక్రమాలు సిబిఐ తో విచారణ జరిపించాలని దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.కార్మికులు చెమటోడ్చి సంపాదించి న పండులో జమ చేసినా డబ్బు దుర్వినియోగము చేసిన బోర్డు మెంబర్లు మీద మరియు చైర్మన్ మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నలబాల దామోదర్ ఎస్ కే హాసన్, ఎస్. ఎస్. శాస్త్రి డీఎల్సీ నిర్వహించారు.

చాకరిమెట్ల ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి



- కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం, నవంబర్ 10 (మనం న్యూస్) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయ స్వామి వారిని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన వారికి ప్రధాన అర్చకులు శ్రీ ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ మేరకు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి, కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్సీ అంజిరెడ్డి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ...చాకరి మెట్ల ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు వర్ధిల్లాలని, రైతులు సమృద్ధిగా పంటలు పండించాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘువీర్ రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ పోలీస్ క్వార్టర్స్‌లో మహిళా హోంగార్డు దారుణ హత్య

పిల్లలు స్కూల్ వెళ్లగానే భార్యాభర్తల మధ్య గొడవ, తల నేలకేసి కొట్టిన భర్త

15 ఏళ్ల ప్రేమ బంధం రక్తసిక్తం, మెహబూబ్ బి హత్య కేసులో భర్త పరారీ



నల్గొండ, నవంబర్ 10 (మనం ప్రతినిధి): నల్గొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రూరల్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పోలీస్ క్వార్టర్స్ లో మహిళా హోంగార్డు మెహబూబ్ బి (43) దారుణ హత్యకు గురయ్యారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో విధులు నిర్వర్తిస్తున్న ఆమెను భర్త సతీష్ (38) గొంతు నులిమి, తలను నేలకేసి కొట్టి హత్య చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు పోలీసులు తెలిపారు. వీరిద్దరూ పోలీస్ శాఖలోనే హోంగార్డులుగా పనిచేస్తూ పరిచయం పెంచుకుని మతాలు వేరైనా పెద్దలను ఎదిరించి 2012లో ప్రేమ వివాహం చేసుకున్నారని, వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని సమాచారం. ఏడేళ్ల క్రితం సతీష్ హోంగార్డు ఉద్యోగం నుంచి సస్పెండ్ కావడంతో కుటుంబ భారం మొత్తం మెహబూబ్ బి పైనే పడిందని, ఆర్థిక ఇబ్బందులు, మద్యానికి బానిస కావడం, భార్యపై అనుమానంతో కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. మంగళవారం ఉదయం పిల్లలు పాఠశాలకు వెళ్లగానే ఇంట్లో భార్యాభర్తలు ఇద్దరే ఉన్న సమయంలో మళ్లీ గొడవ మొదలై వాగ్వాదం తీవ్రరూపం దాల్చిందని, ఈ క్రమంలోనే ఈ దారుణం జరిగిందని పోలీసులు తెలిపారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో హత్య కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, నిందితుడు పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, హత్యకు గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పొగమంచులో ప్రయాణం ప్రమాదకరం

- రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ
- అత్యవసరమైతే తప్ప పొగమంచు సమయంలో ప్రయాణాలు చేయవద్దు
- ప్రయాణంలో తొందరపాటు వద్దు.. మీ భద్రతే మీ కుటుంబానికి భరోసా
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి , నవంబర్ 10 మనం ప్రతినిధి : చలికాలంలో పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, జిల్లా ప్రజలు వీలైనంత వరకు పొగమంచు సమయంలో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకూడదని ఎస్పీ సూచించారు. పరిమిత వేగంతో ప్రయాణించడం ద్వారా ప్రమాదాలను నివారించుకోవచ్చని అన్నారు. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో రహదారులపై దట్టమైన పొగమంచు కమ్ముకుంటుందని, ఎదురుగా వచ్చే వాహనాలు సైతం స్పష్టంగా కనిపించని పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున నుంచి ఉదయం 8 గంటల వరకు పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనాల లైట్లు వేసినప్పటికీ కొంత దూరంలో ఉన్న వాహనాలు స్పష్టంగా కనిపించవని, ఈ పరిస్థితుల్లో అధిక వేగంతో ప్రయాణించడం ప్రమాదాలకు దారితీయవచ్చు అన్నారు. పొగమంచులో అకస్మాత్తుగా బ్రేకులు వేయడం వల్ల వాహనాలు అదుపుతప్పి బోల్తా పడటం, ముందు వెళ్తున్న లేదా ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొట్టడం వంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాహనదారులు వేగాన్ని తగ్గించి, ముందు వెళ్తున్న వాహనానికి తగినంత దూరం పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. చలికాలంలో వాహనాలు నడిపేటప్పుడు వాహనాల హెడ్లైట్లు, ఇండికేటర్లు వినియోగించాలని, పొగమంచు సమయంలో లో బీమ్ లైట్లు ఉపయోగించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు మరియు ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు.

ఉద్యాన విశ్వవిద్యాలయం ఫైల్లో సంస్థల మధ్య చారిత్రాత్మక అవగాహన ఒప్పందం





ములుగు, నవంబర్ 10(మనంన్యూస్): ఉద్యాన పంటల్లో చీడపీడల ఉధృతిని ముందుగానే గుర్తించి, రైతులకు సకాలంలో శాస్త్రీయ సలహాలు అందించేందుకు శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఫైల్లో సంస్థకు చెందిన అగ్రిహాక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి మాట్లాడుతూ, ఉద్యాన రైతులు చీడపీడల నివారణకు అవసరానికి మించి పురుగుమందులు వినియోగించకుండా, శాస్త్రీయ ఆధారాలతో కూడిన సమయోచిత నిర్ణయాలు తీసుకునేందుకు ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ నూతన వ్యవస్థలో స్మార్ట్ పెస్ట్ ట్రాప్, ఆటోమేటిక్ వెదర్ స్టేషన్, నిర్ణయ సహాయక వ్యవస్థలను సమన్వయం చేయడం ద్వారా పంటల స్థాయిలో చీడపీడల ఉనికిని గుర్తించి, వాటి తీవ్రతను ముందుగానే అంచనా వేస్తారని ఉపకులపతి వివరించారు. పొలాల్లో ఏర్పాటు చేసే స్మార్ట్ పెస్ట్ ట్రాప్లకు అమర్చిన ఆకర్షణీయమైన ల్యూర్ ద్వారా కీటకాలను సేకరించి, అందులోని కెమెరా మరియు ఇమేజ్ ఆధారిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో వాటిని గుర్తించి సంఖ్యను ఆటోమేటిక్గా లెక్కిస్తారు. ఈ వివరాలను ఆర్థిక నష్ట పరిమితి తో పోల్చి, చీడపీడల ఉధృతి పరిమితిని దాటినప్పుడు మాత్రమే పురుగుమందుల పిచికారీకి సంబంధించి రైతులకు సలహాలు అందిస్తారు. అదేవిధంగా, ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ ద్వారా ఉష్ణోగ్రత, గాలిలో తేమ, వర్షపాతం తదితర వాతావరణ వివరాలను నిరంతరం నమోదు చేస్తూ, ప్రాంతీయ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తారు. ఈ సాంకేతిక వ్యవస్థ అమలుతో పురుగుమందుల అనవసర వినియోగం తగ్గి, సాగు ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, మిత్ర పురుగుల సంరక్షణ మరియు నాణ్యమైన ఉద్యాన ఉత్పత్తుల సాధనకు అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఖచ్చితమైన సమయంలో, అవసరమైన మేరకే సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా పంట నష్టాలను తగ్గించి, రైతుల ఆదాయాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ఉద్యాన రంగంలో ప్రెసిషన్ ఫ్లాంట్ ప్రొటెక్షన్, సుస్థిర వ్యవసాయం మరియు డిజిటల్ సాగు దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ. భగవాన్, ఫైల్లో సంస్థ సలహాదారు మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్. డి. శిఖామణి, డీన్ ఆఫ్ హార్టికల్చర్ స్టూడెంట్స్ అఫైర్స్ చీనా, పరిశోధనా విభాగం సంచాలకులు డాక్టర్ డి. లక్ష్మీనారాయణ, విస్తరణ విభాగం సంచాలకులు డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ టి. సురేష్ కుమార్, యూనివర్సిటీ కన్సల్టెంట్లు డాక్టర్ కె. వీరాంజనేయులు, డాక్టర్ జి. పి. సునందిని, ప్రణాళిక మరియు పర్యవేక్షణ విభాగం డైరెక్టర్ డాక్టర్ డి. అనితాకుమారి మరియు డాక్టర్ జి. సతీష్ తదితరులు పాల్గొన్నారు.


కుటుంబాలకు భద్రత ప్రమాద బీమా



- అటవీ శాఖలో పని చెయ్... ప్రమాద భీమాను పట్టేయ్
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రమాద బీమా రూ. 10 లక్షలు
- బీమా మీ కుటుంబాలకు భరోసా అంటున్న
- డిఎఫ్ఓ రేవంత్ చంద్ర

ఉమ్మడి మహబూబ్ నగర్ నవంబర్ 10 (మనం బ్యూరో):అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి నవ రక్షణ సేవ సమితి అచ్చంపేట ఆధ్వర్యంలో ప్రమాద బీమా సౌకర్యం ఆ కుటుంబాలకు కల్పించడం ఎంతో అభినందనీయం అని నాగర్ కర్నూల్ జిల్లా డీఎఫ్ఓ రేవంత్ చంద్ర అన్నారు. అటవీ శాఖలో ఔట్సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే వారి కుటుంబానికి రూ. పది లక్షల బీమా పరిహారం తక్షణమే అందించనున్నారని తెలిపారు. అదేవిధంగా విధి నిర్వహణలో ఉండి ప్రమాదవశాత్తు ఏదైనా గాయాలైన వారికి వైద్య చికిత్స కోసం రూ. మూడు లక్షల వరకు వైద్య ఖర్చుల భీమా సౌకర్యం కల్పించనున్నారని తెలిపారు. అటవీ శాఖలో నిరంతరం విధులు నిర్వహిస్తూ అంకిత భావంతో సేవలందిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల భద్రతకు అదే విధంగా వారి కుటుంబాల సంక్షేమానికి నవ రక్షణ సేవా సమితి తీసుకున్న ఈ గొప్ప నిర్ణయం ప్రశంసనీయంగా ఉందని పేర్కొన్నారు. ప్రమాద బీమా వారి కుటుంబాలకు మరింత భద్రత కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్రతో పాటు ఐఎఫ్ఎస్ అధికారి చంద్రశేఖర్, వన సంరక్షణ సమితి మేనేజర్ సలీం లతోపాటు అట విశాఖ ట్రైలర్ ట్రాక్టర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనసు గెలిచిన పోలీస్ అధికారి



- ఎస్ఐ చెన్నకేశవులకు ఘన సత్కారం
- బదిలీపై తరిగొప్పులకు వెళ్తున్న అధికారికి పట్టణ ప్రముఖుల ఆత్మీయ వీడ్కోలు

జనగామ, నవంబర్ 10: (మనం ప్రతినిధి): విధి నిర్వహణలో నిబద్ధత.. ప్రజల సమస్యల పట్ల స్పందన.. శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావం.. ఇవే ఒక పోలీస్ అధికారికి ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తాయి. జనగామ పట్టణ పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా పనిచేసిన చెన్నకేశవులు తన సేవలతో పట్టణ ప్రజల మన్ననలు పొందారు. బదిలీపై తరిగొప్పుల పోలీస్ స్టేషన్కు వెళ్తున్న ఆయనకు పట్టణ ప్రముఖులు ఆత్మీయంగా ఘన సత్కారం నిర్వహించారు. జనగామ పట్టణంలో విధులు నిర్వర్తించిన సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, నేరాల నియంత్రణలో చురుకైన పాత్ర పోషించారు. సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు అందుబాటులో ఉంటూ, వారి ఇబ్బందులను ఓపికగా విని చట్టపరిధిలో పరిష్కారానికి కృషి చేశారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ పోలీస్ శాఖపై నమ్మకాన్ని పెంపొందించడంలో తనదైన ముద్ర వేశారు. పదవి నిర్వహణకే పరిమితం కాకుండా ప్రజలతో మమేకమై పనిచేసిన తీరు ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టిందని పట్టణ ప్రముఖులు పేర్కొన్నారు. ఆయన బదిలీపై వెళ్తుండటంతో విధి నిర్వహణలో చూపిన సేవలను గుర్తుచేసుకుంటూ శాలువాతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జనగామలో చెన్నకేశవులు అందించిన సేవలు అభినందనీయమని, ప్రజలతో మమేకమై పనిచేసిన ఆయన తీరు ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. తరిగొప్పులలోనూ ఇదే అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాసారపు కరుణాకర్, కట్కూరి రామకృష్ణ, అబ్దుల్ గఫ్ఫార్, భాస్కర్, మచ్చ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్ఐ చెన్నకేశవులు మాట్లాడుతూ.. జనగామ పట్టణ ప్రజలు తనపై చూపిన ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. సహకారం, పోలీస్ సిబ్బంది తోడ్పాటుతోనే విధులను సమర్థవంతంగా నిర్వహించగలిగానని, ఎక్కడ విధులు నిర్వహించినా ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు.

ఎల్నినో ప్రభావం విద్యుత్ డిమాండ్‌కు సిద్ధమైన సింగరేణి

తెలంగాణ జెన్కోకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు సరఫరా

యాదాద్రి విద్యుత్ కేంద్రానికి నైనీ గని నుంచి బొగ్గు తరలింపునకు ఏర్పాట్లు



మంచిర్యాల ,నవంబర్ 10 (మనం ప్రతినిధి) రానున్న రోజుల్లో ఎల్నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి విద్యుత్ వినియోగం మరింత అధికమయ్యే అవకాశం ఉండటంతో తెలంగాణలో విద్యుత్ అవసరాలను తీర్చేందుకు సింగరేణి సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టింది. తెలంగాణ జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు సరఫరా చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి రోజుకు కనీసం 16 వేల టన్నుల బొగ్గు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మంగళవారం హైదరాబాద్లోని సింగరేణి భవన్లో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, తెలంగాణ జెన్కో సీఎండీ డాక్టర్ హరీష్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ జెన్కోకు బొగ్గు సరఫరాను మరింత పెంచాలని నిర్ణయించారు. తెలంగాణ జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు రవాణాలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ తర్వాతే ఇతర రాష్ట్రాల విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయాలని సింగరేణి సీఎండీ సంస్థ డైరెక్టర్లు, ఏరియా జనరల్ మేనేజర్లకు సూచించారు. గత మూడు, నాలుగేళ్లతో పోలిస్తే ఈ ఏడాది తెలంగాణ జెన్కోకు అధిక మొత్తంలో బొగ్గు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు మరింత పెరిగితే సింగరేణి తన ఉత్పత్తి సామర్థ్యం మేరకు అదనంగా బొగ్గు అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఒడిశాలోని నైనీ బొగ్గు గనిలో ప్రస్తుతం రోజుకు సుమారు 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని, గనిలో ఇప్పటికే మూడు లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని సింగరేణి సీఎండీ వివరించారు. స్థానికంగా రవాణా సమస్యల కారణంగా బొగ్గు తరలింపులో కొంత జాప్యం జరుగుతోందని తెలంగాణ జెన్కో సీఎండీ డాక్టర్ హరీష్ తెలిపారు. ఈ నెలాఖరు నుంచి రోజుకు 16 వేల టన్నుల బొగ్గును యాదాద్రి విద్యుత్ కేంద్రానికి తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. గని నుంచి సమీపంలోని రైల్వే సైడింగ్ వరకు రోడ్డు మార్గంలో జరుగుతున్న బొగ్గు రవాణాను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత సమావేశాల అనంతరం బొగ్గు రవాణా పెరగడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. నైనీ గనిలో ఉత్పత్తి అవుతున్న బొగ్గు కోసం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల విద్యుత్ సంస్థలతో పాటు పలు ప్రైవేటు సంస్థలు కూడా విజ్ఞప్తి చేస్తున్నాయని నైనీ జనరల్ మేనేజర్ సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై స్పందించిన సింగరేణి సీఎండీ.. నైనీ గనిలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో తెలంగాణ జెన్కోకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, మిగిలిన బొగ్గును ఇతర సంస్థల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా సరఫరా చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

ప్రతిరోజూ నైనీ బొగ్గు రవాణా విషయంలో తెలంగాణ జెన్కో అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, తిరుమలరావు, ఈడీ (కోల్ మూవ్మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి. శ్రీనివాస్ పాల్గొన్నారు. తెలంగాణ జెన్కో డైరెక్టర్ (కోల్ అండ్ లాజిస్టిక్స్) నాగ్యతో పాటు రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల చీఫ్ ఇంజినీర్లు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ప్రకటనలు సరే... సహాయమేది?



- కరువుపై చిత్తశుద్ధి లేని పాలకులు
- సత్వర సహాయానికి చర్యలు చేపట్టండి
- సిపిఐ నేత బాగం హేమంతరావు
- కరువు నేపథ్య చర్యలపై కలెక్టరేట్ ఎదుట సిపిఐ ధర్నా

ఖమ్మం, నవంబర్ 10(మనం న్యూస్)ః ఎలినినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర కరువు పరిస్థితులలో ఆదుకోవాల్సిన ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం అవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. గడిచిన మూడు నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలినినోకు సంబంధించి ప్రకటనలు చేస్తున్నాయి తప్ప చర్యలు చేపట్టడం లేదని ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లాను పూర్తి కరువు జిల్లాగా ప్రకటించాలని రైతులు, వ్యవసాయ కార్మికులను ఆదుకునేందుకు తక్షణం ఆర్థిక సాయం అందించాలని రైతు రుణాల వడ్డీ మాఫీ చేయాలని, మురసు బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో సిపిఐ కార్యకర్తలు కలెక్టరేట్ వద్దకు చేరుకుని గేటు వద్ద బైఠాయించారు. కరువు జిల్లాగా ప్రకటించాలని తక్షణ సాయం అందించాలని నినదించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన ఆందోళన కార్యక్రమంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ కేంద్రాన్ని రూ. 25వేల కోట్లు అడిగిన రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులు వచ్చేంత వరకు ఆగకుండా తక్షణం పనులు ప్రారంభించాలన్నారు. రైతులను ఆదుకునేందుకు పంట రుణాల వడ్డీలు మాఫీ చేసి నూతనంగా రుణాలు ఇవ్వాలని ఆయన కోరారు. కరువు వల్ల పంటలు సాగు చేయని, సాగు చేసి నష్టపోయిన పంటలకు వరికి ఎకరాకు రూ.30వేలు, వాణిజ్య పంటలకు రూ. 50వేల చొప్పున -పరిహారం ఇవ్వాలన్నారు. వ్యవసాయ రంగం కరువు కారణంగా సంక్షోభంలో పడడంతో గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదని వివిజీ రాంజీ పథకం క్రింద తక్షణ పనులు ప్రారంభించాలని, పని దినాల సంఖ్యను పెంచడంతో పాటు కూలీ రేట్లను పెంచాలని హేమంతరావు డిమాండ్ చేశారు. కరువు నేపథ్యంలో ధరలను విపరీతంగా పెంచి పేద, సామాన్య ప్రజలను లూటీ చేస్తున్నారని -ఆయన ధ్వజమెత్తారు. నిత్యావసర వస్తువులను బ్లాక్ మార్కెట్కు తరలించారని ప్రభుత్వం బ్లాక్ మార్కెట్ చర్యలు తీసుకోకపోతే తామే బ్లాక్ మార్కెట్ గోదాములపై దాడులు చేస్తామని హేమంతరావు హెచ్చరించారు. మూడు నెలల క్రితం రూ.40లు ఉన్న బియ్యం ధర ఇప్పుడు రూ.100కు ఇంతలోనే ఎలా చేరిందని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువులను చౌక దుకాణాల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు అందించాలని మొత్తం ఖమ్మం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలన్నారు. మురసు తుఫాన్ కారణంగా ఖమ్మం జిల్లాలో 40వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని నేటికీ ప్రభుత్వం కనీస అంచనాలు రూపొందించలేదని ఒక ప్రత్యేక యాప్ ద్వారా అంచనాలు వేసి తక్షణ పరిహారం అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మురసు తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, కుంటలకు మరమ్మతులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్స్ కూడిన వినతి పత్రాన్ని జిల్లా అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డిరాష్ట్ర సమితి సభ్యులు ఎస్కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, దొండపాటి రమేష్, తోట రామాంజనేయులు, సిహెచ్ సీతామహలక్ష్మి, మిడికంటి చిన్నవెంకటరెడ్డి, బెజవాడ రవి, మందడపు రాణి, ఏనుగు గాంధీ, కూచిపూడి రవి, యానాల సాంబశివారెడ్డి, యంగల ఆనందరావు, యువజన విద్యార్థి సంఘాల నాయకులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, చింతల రమేష్, మడుపల్లి లక్ష్మణ్, మనోజ్ పాల్గొన్నారు.

వెలుగుమట్లలో పేదల ముసుగులో భూమాఫియా రాజ్యం!



నిరుపేదలకు నిలువునా మోసం చేసిన అక్రమార్కులు

అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం..

మిగిలిన దరఖాస్తులనూ పరిశీలించి స్థలాలు కేటాయిస్తాం: మంత్రి తుమ్మల

వాస్తవాలు తెలుసుకుని ఆవేదన వ్యక్తం చేసిన జస్టిస్ చంద్రకుమార్

ఖమ్మం, నవంబర్ 10(మనం బ్యూరో): వెలుగుమట్ల భూదాన్ భూముల వ్యవహారంలో పేదల ముసుగులో కొందరు అక్రమార్కులు భూమాఫియాగా ఏర్పడి, సమాంతర పాలన సాగించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా వెల్లడించారు. నిరుపేదల ఇళ్ల స్థలాల ఆశలను ఆసరాగా చేసుకుని వారి నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ, భయానక వాతావరణాన్ని సృష్టించారని తెలిపారు. అర్హులైన పేదలకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల భూదాన్ భూముల వ్యవహారంలో మిగిలిన అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. ఈ సందర్భంగా వెలుగుమట్లలో చోటుచేసుకున్న పరిణామాలు, భూముల ఆక్రమణలు, ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన చర్యలు, అధికారిక రికార్డుల్లోని వాస్తవాలను మంత్రి ఆయనకు వివరించారు.

పోలీసులు వెళ్లలేని పరిస్థితి.. సూడోరాజ్యం!

వెలుగుమట్లలోని సర్వే నంబర్లు 147, 148, 149లో ఉన్న భూములకు సంబంధించి గతంలో భారీగా అక్రమ ఆక్రమణలు చోటుచేసుకున్నాయని మంత్రి వివరించారు. కొందరు వ్యక్తులు పేదల పేరుతో అక్రమ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని, నిరుపేదల నుంచి డబ్బులు వసూలు చేస్తూ సొంతంగా సూడోరాజ్యాన్ని నడిపారని తెలిపారు. చివరకు పోలీసులు సైతం అక్కడికి వెళ్లలేని విధంగా భయానక పరిస్థితులు సృష్టించారని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామంటూ అమాయకులను నమ్మించి, వారి నుంచి డబ్బులు దండుకుని మోసాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హైకోర్టు, సీసీఎల్ఏ ఆదేశాల మేరకే తొలగింపులు

భూదాన్ భూముల్లో జరిగిన అక్రమ ఆక్రమణలపై హైకోర్టు, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) 2023లో జారీ చేసిన ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం చట్టబద్ధంగా తొలగింపు చర్యలు చేపట్టిందని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ చర్యలు నిరుపేదలకు వ్యతిరేకం కాదని, పేదల పేరుతో అక్రమాలకు పాల్పడిన భూమాఫియా నుంచి ప్రభుత్వ భూములను కాపాడేందుకేనని వివరించారు.

నన్ను తప్పుదోవ పట్టించారు: జస్టిస్ చంద్రకుమార్

మంత్రి తుమ్మల అధికారిక రికార్డులు, ఆధారాలతో సహా పూర్తి వివరాలను వెల్లడించడంతో జస్టిస్ చంద్రకుమార్ విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వెలుగుమట్ల వ్యవహారం వెనుక ఇంతటి అక్రమాలు, భూమాఫియా కార్యకలాపాలు ఉన్నాయన్న వాస్తవాలు తనకు తెలియకుండా చేశారని, కొందరు వ్యక్తులు తప్పుడు సమాచారం ఇచ్చి తనను తప్పుదోవ పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు.

అర్హులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యం : తుమ్మల

నిజమైన నిరుపేదలకు అన్యాయం జరగనివ్వబోమని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయి విచారణలో అర్హులుగా గుర్తించిన వారికి ఇప్పటికే నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడంతోపాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న దరఖాస్తులను సైతం సమగ్రంగా పరిశీలించి, నిజంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పేదల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత అని, వారి ఆశలను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని మంత్రి తేల్చిచెప్పారు.

కొత్త పింఛన్ల మంజూరుపై హర్షం

సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

రాష్ట్రవ్యాప్తంగా 4.29 లక్షల మందికి పింఛన్లు మంజూరు

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



ఖమ్మం, నవంబర్ 10(మనం న్యూస్)ః రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్లను మంజూరు చేయడంపై జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం, ఆరు గ్యారంటీలలో భాగంగా వికలాంగులు, ఒంటరి మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా 4.29 లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేయించినందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంత్రివర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం ధనిక తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందని, ప్రభుత్వ ఉద్యోగులకు 7వ, 10వ తేదీల్లో జీతాలు ఇచ్చే పరిస్థితి ఉండేదని ఆయన గుర్తుచేశారు. ఆ పరిస్థితిని అధిగమించి, 2024 జనవరి 1 నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీనే జీతాలు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 5వ తేదీన, సంక్షేమ ఉద్యోగులకు 10వ తేదీన జీతాలు ఇస్తూ, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, గత ప్రభుత్వం చేసిన అప్పులకు అసలు, వడ్డీ కలిపి ఈ 34 నెలల్లో రూ. 2 లక్షల కోట్లకు పైగా చెల్లించి, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ప్రభుత్వానికి కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. బడుగు, బలహీన, అన్ని వర్గాల ప్రజాక్షేమాన్ని కోరే కాంగ్రెస్ ప్రభుత్వానికి అందరూ అండగా ఉండాలని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను పూర్తి చేయాలి

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందించాలి
- రెండు పడక గదుల ఇళ్ల ను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కలెక్టర్ దివాకర టి ఎస్



ఖమ్మం, నవంబర్ 10(మనం న్యూస్)ః ఖమ్మం జిల్లాలో వివిధ దశల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన రెండు పడక గదుల ఇళ్ల ను యథాస్థితిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందజేతకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం క్షేత్రస్థాయిలో పలు మండలాల్లోని రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామంలో 30, సింగిరెడ్డిపాలెం గ్రామంలో 48, శంకరగిరి తండా గ్రామంలో 30, కూసుమంచి మండలం మల్లెపల్లి గ్రామంలో 16, ఖమ్మం అర్బన్ మండలం దంసలాపురంలో 192 అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాలను ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో అదే స్థాయి నుంచి పూర్తి చేసుకునేందుకు అంగీకారంతో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి వారికి కేటాయించవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఇళ్ల సముదాయాల వద్ద విద్యుత్, శానిటరీ, తాగునీటి సరఫరా తదితర మౌళిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, తహశీల్దార్ లు రాంప్రసాద్, సైదులు, విజయేందర్ రెడ్డి, జయచంద్ర, హౌజింగ్ డీఈ కె. జగ్రామ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలి: ఎస్పీ రోహిత్ రాజు

పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్ పంపిణీ



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 10 (మనంప్రతినిధి): పోలీస్ శాఖ మరియు సింగరేణి సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల ఉచిత శిక్షణ తరగతులకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హాజరై అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ ఉద్యోగాల సాధనకు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని, అధ్యాపకులు అందించే సూచనలు పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా చదవాలని అభ్యర్థులకు సూచించారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు సమయపాలనతో పాటు నిరంతర సాధన అలవర్చుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకొని కష్టపడి చదివి పోలీస్ ఉద్యోగాన్ని సాధించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖ, సింగరేణి సంస్థ సంయుక్తంగా అందిస్తున్న ఈ శిక్షణ ద్వారా అభ్యర్థులు మంచి ఫలితాలు సాధించి పోలీస్ శాఖలో ఉద్యోగాలు పొందాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఇన్స్ట్రక్టర్ ఇ. శ్రీనివాస్, ఆర్ఐ ఆపరేషన్స్ బి. రవి, ఆర్ఐ వెల్ఫేర్ కృష్ణారావు, అధ్యాపక బృందం, పోలీస్ అధికారులు, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

పోటీలలో ప్రతిభ చూపండి

బహుమతులను కైవసం చేసుకోండి

కొత్తగూడెం ఏరియాకు మంచి పేరు తీసుకురండి

సింగరేణి కొత్తగూడెం ఏరియా డివైపిఎం జి.హరీష్



కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 10(మనం న్యూస్): క్రీడాకారులు మంచి మంచి బహుమతులు సాధించి సింగరేణి కొత్తగూడెం ఏరియాకు మంచి పేరు తీసుకురావాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా డివైపిఎం జి.హరీష్ సూచించారు. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సిహెచ్ వెంకటరమణ ఆదేశాల మేరకు కొత్తగూడెం ఏరియాలో డబల్యూపిఎస్ అండ్ జిఏ వర్క్ పీపుల్ స్పోరట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కల్చరల్ మీట్ డిపార్ట్మెంటల్ పోటీలు కొత్తగూడెం రుద్రంపూర్ ఆర్ సిఓఏ క్లబ్ నందు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ముఖ్యఅతిథిలుగా పాల్గొన్న డివైపిఎం జి.హరీష్(హోనరరీ సెక్రటరీ), ఎఐటియూసి బ్రాంచ్ సెక్రెటరీ జె.గట్టయ్య, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా డివైపిఎం జి.హరీష్ మాట్లాడుతూ కల్చరల్ మీట్ సంస్కృతి కళల ద్వారా సమాజం అనేక మార్పులకు అలాగే ప్రతి ఒక్కరి వ్యక్తిగత వికాసానికి తోడ్పడుతుందని అన్నారు. క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని కంపెనీ లెవెల్ కోల్ ఇండియాలో పాల్గొన్ని అధిక సంఖ్యలో బహుమతులు గెలిచి కొత్తగూడెం ఏరియా ప్రతిభ చూపాలని సూచించారు. యూనియన్ ప్రతినిధులు కల్చరల్ మీట్ లో ఆడేందుకు వచ్చిన క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివైపిఎం జి.హరీష్తో పాటు ఎఐటియూసి బ్రాంచ్ సెక్రెటరీ జే.గట్టయ్య, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, స్పోరట్స్ సూపర్వైజర్ పాస్పోట్ స్పోరట్స్ కో-ఆర్డినేటర్ సందబోయిన శ్రీనివాస్, జనరల్ కాప్టెన్ రాజశేఖర్ క్రీడాకారులు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పశుసంపద సంరక్షణకు కలెక్టర్ అంకిత్ ప్రత్యేక కార్యాచరణ

కరువు ప్రభావాన్ని ఎదుర్కొందాం

పశుగ్రాస సాగుకు రైతులకు వందశాతం ప్రభుత్వ ఆర్థిక సహాయం

తాగునీటి కొరత లేకుండా నీటి తొట్ల నిర్మాణానికి అవకాశం



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 10 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే వర్షాభావ, కరువు పరిస్థితులను ముందుగానే అంచనా వేస్తూ పశుసంపద సంరక్షణకు జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారు. కరువు పరిస్థితుల్లో పశువులకు పచ్చిమేత, తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు పశుపోషణపై ఆధారపడిన రైతులకు ఆర్థిక భారం తగ్గించేలా ప్రభుత్వం అందిస్తున్న ఆ-ఎ ఖఅఉ ఎ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. పశుసంపదను కాపాడటం ద్వారా రైతుల జీవనోపాధికి భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద ఇంటెన్సివ్ ఫోడర్ డెవలప్మెంట్ కార్యక్రమం ద్వారా రైతుల వ్యక్తిగత వ్యవసాయ భూముల్లో, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో పశుగ్రాసం సాగు చేసేందుకు ప్రభుత్వం పూర్తి ఆర్థిక సహాయం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. వ్యక్తిగతంగా పశుగ్రాసం సాగు చేసుకోవాలనుకునే రైతులకు ఐదు ఎకరాల లోపు వ్యవసాయ భూమి ఉండాలని, సాగు భూమికి బోరు, కాలువ, చెరువు లేదా ఇతర మార్గాల ద్వారా నీటి సౌకర్యం అందుబాటులో ఉండాలని, పశుగ్రాసం సాగు చేయడానికి ఆసక్తి కలిగి ఉండాలని సూచించారు. పశుగ్రాస సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సామగ్రి, కూలీ ఖర్చులతో సహా మొత్తం వ్యయాన్ని ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఒక ఎకరంలో పశుగ్రాసం సాగు చేసేందుకు రూ.18,882 అంచనా వ్యయంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ పథకం కింద ఎర్రచెంగలి, నక్కతోక గడ్డి, నీడ గడ్డి, ఉప్పు గడ్డి, ఈటె గడ్డి వంటి పశుగ్రాస పంటలను సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పశువులు నీరు తాగేందుకు 5 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, 0.6 మీటర్ల ఎత్తుతో నీటి తొట్ల నిర్మాణానికి రూ.34,707 అంచనా వ్యయాన్ని నిర్ణయించినట్లు తెలిపారు . అలాగే గొర్రెలు, మేకలకు నీటి సౌకర్యం కల్పించేందుకు 10 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, 0.3 మీటర్ల ఎత్తుతో నీటి తొట్ల నిర్మాణానికి రూ.43,000 అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పశుసంపదకు అవసరమైన పచ్చిమేత, తాగునీటి సౌకర్యాలను ముందుగానే కల్పించుకోవడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ సూచించారు. నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పశుగ్రాస సాగుకు అనువైన భూములను, నీటి తొట్ల నిర్మాణానికి అనువైన ప్రదేశాలను గుర్తించి ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. రైతులు, పశుపోషకులు ప్రభుత్వ సహకారాన్ని వినియోగించుకొని పశుసంపదను సంరక్షించుకోవాలని కోరారు. ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు, దరఖాస్తుల సమర్పణ కోసం సంబంధిత మండల పరిషత్ కార్యాలయాలు లేదా గ్రామపంచాయతీ కార్యాలయాలను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు.

తెలంగాణ జెన్కోకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు

- సింగరేణి-జెన్ కో సమన్వయ సమావేశంలో
- సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి



కొత్తగూడెం సింగరేణి, నవంబరు 10(మనం న్యూస్): రానున్న రోజుల్లో ఎల్నినో ప్రభావంతో విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున తెలంగాణ జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు సరఫరా చేయాలని సింగరేణి నిర్ణయించింది. ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి రోజుకు కనీసం 16 వేల టన్నుల బొగ్గు రవాణా జరిపేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం సింగరేణి భవన్ నుంచి సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, తెలంగాణ జెన్కో సీఎండీ డాక్టర్ హరీష్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఉన్నతస్థాయి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు తెలంగాణ జెన్కో కేంద్రాలకు బొగ్గు సరఫరాపై సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమావేశంలో తెలంగాణ జెన్కో కు జరుగుతున్న సరఫరాను మరింత పెంచాలని నిర్ణయించారు. జెన్కో థర్మల్ కేంద్రాలకు బొగ్గు రవాణాలో ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఆ తర్వాతే ఇతర రాష్ట్రాల విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సంస్థ డైరెక్టర్లు, ఏరియా జనరల్ మేనేజర్లకు సూచించారు. గత మూడు నాలుగేళ్లతో పోల్చి చూసినా సరే ఈ ఏడాది తెలంగాణ జెన్కోకు ఎక్కువ బొగ్గు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరిగితే సింగరేణి తన సామర్థ్యం మేరకు మరింత బొగ్గు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. నైనీ గనిలో ప్రస్తుతం రోజుకు సుమారు 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి ని లక్ష్యంగా పెట్టుకున్నామని అయితే ప్రస్తుతం 3 లక్షల టన్నుల బొగ్గు నిల్వ ఉందని సీఎండీ తెలిపారు.

ఈ నేపథ్యంలో యాదాద్రికి బొగ్గు రవాణాను పెంచడానికి చర్యలు తీసుకోవాలని జెన్ కోకు సూచించారు. ఒడిశాలో స్థానికంగా రవాణా సమస్యల వల్ల బొగ్గు రవాణాలో కొంత జాప్యం జరుగుతోందని ఈ నెలాకరు నుంచి 16 వేల టన్నులను తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జెన్ కో సీఎండీ డాక్టర్ హరీష్ వివరించారు. గని నుంచి సమీప రైల్వే సైడింగ్ వరకు రోడ్డు మార్గంలో జరుగుతున్న బొగ్గు రవాణాను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. గత సమావేశాల తర్వాత బొగ్గు రవాణా పెరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు జెన్ కోలతో సహా స్థానికంగా ఉండే పలు ప్రైవేట్ సంస్థలు కూడా నైనీ బొగ్గు కోసం విజ్ఞప్తి చేస్తున్న విషయాన్ని నైనీ జీఎం ప్రస్తావించారు. నైనీలో ఉత్పత్తి అవుతున్న బొగ్గులో మొదటి ప్రాధాన్యంగా తెలంగాణ జెన్ కోకు సరఫరా చేయాలని మిగిలిన బొగ్గును కూడా ఇతర సంస్థల అవసరాల కోసం రవాణా చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతీ రోజు నైనీ బొగ్గు రవాణా విషయంలో తెలంగాణ జెన్ కో అధికారులతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, తిరుమలరావు, ఈడీ(కోల్ మూవ్మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్(కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్)టి.శ్రీనివాస్, తెలంగాణ జెన్కో డైరెక్టర్(కోల్ అండ్ లాజిస్టిక్స్)నాగ్యతో పాటు రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల చీఫ్ ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మనం Manam Mahabubnagar
మహబూబ్ నగర్

ఓటు వేయడం తెలుసు.. బ్యాలెట్‌పై అవగాహన ఏదీ...?

- జడ్పీటీసీ ఎన్నికల్లో 23,180 ఓట్లు వృథా!
- 32 మండలాల్లో 5,884 నోటా.. 17,292 చెల్లని ఓట్లు
- పంచాయతీ ఎన్నికల వేళ ఓటర్లకు అవగాహన కల్పించాలి
- ప్రజా సంఘాలు



ధర్మవరం నవంబర్ 10, మనం న్యూస్: ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనది. ఐదేళ్లపాటు గ్రామాల భవిష్యత్తును నిర్ణయించే ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశం ఓటర్లకు లభిస్తుంది. అయితే ఓటు హక్కుపై సరైన అవగాహన లేకపోవడం, బ్యాలెట్ పత్రంపై ఓటు వేసే విధానం తెలియకపోవడంతో విలువైన ఓట్లు వృథా అవుతున్నాయి. ఇటీవల శ్రీ సత్యసాయి జిల్లాలో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల ఫలితాల గణాంకాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

జిల్లాలోని 32 మండలాల పరిధిలో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో 5,884 మంది ఓటర్లు నోటాకు ఓటు వేయగా, మరో 17,292 ఓట్లు చెల్లనివిగా నమోదైనట్లు ఎన్నికల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మొత్తంగా 23,180 ఓట్లు అభ్యర్థుల విజయావకాశాలకు ఉపయోగపడకుండా పోయాయి. బ్యాలెట్ పత్రంపై ఓటు వేసే విధానంపై సరైన అవగాహన లేకపోవడం, ఓటు నమోదు చేసే క్రమంలో జరిగిన పొరపాట్లు ఇందుకు కారణమవుతున్నాయని ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

స్వల్ప మెజార్టీలతో గెలుపు.. నోటా ఓట్లతో చర్చ!

కొన్ని ప్రాంతాల్లో అభ్యర్థులు స్వల్ప మెజార్టీతో విజయం సాధించిన నేపథ్యంలో నోటా, చెల్లని ఓట్ల సంఖ్య రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒక్కో ఓటు కూడా అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే పరిస్థితుల్లో వేల సంఖ్యలో ఓట్లు నిరుపయోగం కావడం ఆందోళన కలిగిస్తోంది. ఓటర్లు తమ ఓటును ఎలా వినియోగించుకోవాలో ముందుగానే తెలుసుకుంటే ఇలాంటి పరిస్థితులను నివారించవచ్చని పలువురు సూచిస్తున్నారు.

పంచాయతీ ఎన్నికల వేళ అధికారులకు పరీక్ష!

త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఏర్పడింది. ధర్మవరం మండల పరిధిలోని 20 గ్రామపంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల కోసం నామినేషన్ ప్రక్రియ నిర్వహణకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లకు బ్యాలెట్ పత్రంపై ఓటు వేసే విధానాన్ని వివరించాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉందని ప్రజా సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి..

బ్యాలెట్ పత్రంలో అభ్యర్థికి ఓటు ఎలా వేయాలి? నోటా అంటే ఏమిటి? ఎలాంటి సందర్భాల్లో ఓటు చెల్లకుండా పోతుంది? వంటి అంశాలపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతున్నారు. ముఖ్యంగా కొత్తగా ఓటు హక్కు పొందిన యువతతో పాటు వృద్ధులు, గ్రామీణ ప్రాంత ఓటర్లకు ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, దానిని సక్రమంగా వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని ప్రజా సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఎన్నికల అధికారులు ఇప్పటి నుంచే గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు.ఓటు హక్కు ఉండటమే కాదు.. దానిని సక్రమంగా వినియోగించుకోవడమూ ముఖ్యమే. వేలాది ఓట్లు వృథా కాకుండా రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనైనా ఓటర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారా? అన్నది వేచి చూడాలి.



పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- ఎల్‌ఆర్‌ఎస్ అనుమతుల్లో జాప్యం చేయొద్దు
- అధికారుల ఆదేశం

రాయదుర్గం, నవంబరు 10 మనం న్యూస్: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో అనంతపురం ప్రాంతీయ పట్టణ ప్రణాళిక ఉపసంచాలకులు, మున్సిపల్ కమిషనర్ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల క్రమబద్ధీకరణ పథకం అమలు, భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులపై సమీక్ష చేపట్టారు. ఆన్లైన్లో లోటు రుసుము చెల్లించిన ఇద్దరు దరఖాస్తుదారులకు ఎల్‌ఆర్‌ఎస్ అనుమతి పత్రాలను అందజేశారు. పెండింగ్లో ఉన్న అన్ని భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని వార్డు ప్రణాళిక కార్యదర్శులను ఆదేశించారు. 2020 భూముల క్రమబద్ధీకరణ పథకం కింద ప్రాథమిక లేఅవుట్ అనుమతులకు సంబంధించిన ప్రతిపాదనలను నిర్ణీత గడువులోగా సిద్ధం చేయాలని సూచించారు.అలాగే భవన నిర్మాణ అనుమతులను సకాలంలో మంజూరు చేయాలని, ప్రజలకు ఎలాంటి జాప్యం లేకుండా సేవలు అందించాలని స్పష్టం చేశారు. ప్రకటనల పన్ను బకాయిల వసూలుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, పట్టణ ప్రణాళిక పర్యవేక్షకుడు మురళీ మోహన్, జే1, సహాయ పట్టణ ప్రణాళిక కార్యదర్శులు అజయ్, మధు, షఫీతో పాటు ప్రాంతీయ పట్టణ ప్రణాళిక ఉపసంచాలకుల కార్యాలయానికి చెందిన సాంకేతిక సహాయకుడు రాజు పాల్గొన్నారు.

జనగణన సర్వేను కచ్చితత్వంతో, ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు, నవంబర్ 10 (మనం న్యూస్): జనగణన సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి కచ్చితత్వంతో, ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులకు అధికారులకు సూచించారు.

మంగళవారం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో జిల్లా సెన్సెస్ అధికారులు, మండల స్థాయి చార్జ్ ఆఫీసర్లు, మదనపు ఛార్జ్ ఆఫీసర్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు జనాభా గణన 2027 పై నిర్వహించిన జనగణన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన ప్రశ్నావళిలోని 1 నుంచి 40 ప్రశ్నలపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని, ప్రతి ప్రశ్నకు ఒకే ప్రామాణిక విధానంలో సమాధానాలు నమోదు చేయాలని తెలిపారు. ప్రశ్నల నమోదులో వ్యక్తిగత విచక్షణకు తావులేకుండా, ఎలాంటి సందేహాలున్నా శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు.

సెల్ఫ్ ఎన్యుమరేషన్, ఇంటింటి సర్వే, రివిజనల్ రౌండ్లను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలన్నారు. మొదటి రోజు నుంచే ప్రతి ఎన్యుమరేటర్ రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని విధులు నిర్వహించాలని, చివరి రోజుల్లో హడావుడి పడకుండా నిరంతరం పురోగతిని పర్యవేక్షించాలన్నారు. రోజుకు సగటున నాలుగు నుంచి పది ఇళ్ల వివరాలను నమోదు చేయడం ద్వారా నిర్ణీత సమయంలో సర్వేను పూర్తి చేయవచ్చని తెలిపారు. 2027 జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్ లో వివరాల నమోదు, 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు హౌస్ టు హౌస్ ఫీల్ ఎన్యుమరేషన్ ప్రక్రియలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు.

సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలు, టిడ్కో గృహ సముదాయాలపై ప్రత్యేక దృష్టి సారించి క్లస్టర్ల వారీగా ప్రచారం నిర్వహించి ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రస్తుత జనగణన డిజిటల్ విధానంలో జరుగుతున్నందున వివరాలను నమోదు చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఒకసారి వివరాలను నమోదు చేసి సమర్పించిన తర్వాత సవరణలకు అవకాశం ఉండదని గుర్తుచేశారు. సేకరించిన సమాచారం ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, భవిష్యత్ విధానపరమైన నిర్ణయాలు రూపుదిద్దుకుంటాయని పేర్కొన్నారు. డేటా నమోదు కచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు ప్రతి కార్యాలయంలో ప్రత్యేక డేటా వెరిఫికేషన్ సెల్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



కుల, మత వివరాల నమోదులో ప్రభుత్వ నిబంధనలు, గెజిట్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వివరాలు నమోదు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే తహసీల్దార్లు, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు.

సర్వే విధులకు కేటాయించిన సిబ్బంది అందరూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా పర్యవేక్షక అధికారులు చర్యలు తీసుకోవాలని, మొదటి రెండు మూడు రోజుల్లోనే ప్రతి ఎన్యుమరేటర్ సర్వే ప్రారంభించేలా నిర్ధారించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయ్ కుమార్, అదనపు కమిషనర్ హిమబిందు, సిపిఓ లక్ష్మీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పులతో క్లోమగ్రంథిపై పంజా..

- తొలి దశలో గుర్తిస్తేనే ప్రాణాలకు భరోసా!
- అవగాహన సదస్సులో హైదరాబాద్ యశోద వైద్యశాల జీర్ణకోశ వ్యాధుల నిపుణుడు శ్రీకాంత్ వెల్లడి

కాకినాడ నవంబర్ 10(మనం న్యూస్): మారుతున్న కాలానుగుణంగా ప్రజల దైనందిన జీవనశైలి, ఆహారపు అలవాట్లలో వస్తున్న విపరీత మార్పుల వల్ల శరీరంలో అత్యంత కీలకమైన క్లోమగ్రంథి వ్యాధులు వేగంగా విస్తరిస్తున్నాయని, వీటి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ యశోద



వైద్యశాల ప్రముఖ జీర్ణకోశ వైద్య నిపుణుడు శ్రీకాంత్ సూచించారు. కాకినాడలోని ఒక ప్రముఖ సభా వేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు క్లోమగ్రంథి వ్యాధుల తీవ్రత, అత్యాధునిక వైద్య విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఆహారాన్ని జీర్ణం చేయడంలోనూ, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలోనూ ఈ గ్రంథి ప్రధాన భూమిక పోషిస్తుందని, ఇది దెబ్బతింటే తీవ్ర పోషకాహార లోపం, ఆకస్మికంగా బరువు తగ్గడం, మధుమేహం వంటి దీర్ఘకాలిక రుగ్మతలు చుట్టుముడతాయని వివరించారు.

అయితే క్లోమగ్రంథి వాపు, ప్రాణాంతక కణితి రెండూ వేర్వేరు సమస్యలని, వీటి పట్ల ప్రజలు అనవసర భయాందోళనలకు గురికావాల్సిన పనిలేదని శ్రీకాంత్ స్పష్టం చేశారు. ఆకస్మికంగా గ్రంథి వాపు ఏర్పడినప్పుడు కడుపు పైభాగంలో తీవ్రమైన నొప్పి మొదలై వీపు వైపు పాకుతుందని, విపరీతమైన వాంతులు అవుతాయని తెలిపారు. ఇలాంటి లక్షణాలను సాధారణ వాయువు లేదా ఆమ్లత్వ సమస్యగా పొరబడి మందుల దుకాణాల్లో సొంత వైద్యం చేసుకోవడం ప్రాణాలకే ముప్పు తెస్తుందని హెచ్చరించారు. మద్యపానం మాత్రమే కాకుండా పిత్తాశయంలో రాళ్లు, రక్తంలో అధిక కొవ్వు నిల్వల వల్ల కూడా ఈ వ్యాధి సోకుతుందని, మద్యం ముట్టని వారిలోనూ ఈ సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున బాధితులను సమాజం తప్పుగా చూడకూడదని హితవు పలికారు. సకాలంలో అందించే ఔషధాలు, నరాల ద్వారా ఎక్కించే ద్రవాలు, సరైన పోషకాహారంతోనే అత్యధిక శాతం మంది రోగులు సులభంగా కోలుకుంటారని తెలిపారు. ప్రతి సమస్యకూ శస్త్రచికిత్స అవసరం లేదని, శరీరంపై ఎలాంటి పెద్ద కోత లేకుండానే అత్యాధునిక అంతర్దర్శిని, ప్రత్యేక గొట్టాల సహాయంతో అవయవంలో చేరిన చీము, ద్రవాలను సురక్షితంగా తొలగించవచ్చని పేర్కొన్నారు. పిత్తాశయ రాళ్లను సకాలంలో తొలగించుకుంటే ఈ ముప్పు నుంచి శాశ్వత విముక్తి లభిస్తుందని, దీర్ఘకాలిక వాపుతో బాధపడేవారికి నాళాల్లో అడ్డంకులు తొలగించే ప్రత్యేక చికిత్సల ద్వారా పూర్తి స్వస్థత చేకూరుస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వాణిజ్య విభాగ నిర్వాహకుడు కె. సతీష్, ఉన్నత కార్యనిర్వాహకుడు సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో భక్తులకు మెరుగైన వ్రత సేవలు అందించాలి

వ్రత పురోహితులకు ఈవో నల్లం సూర్యచక్రధరరావు సూచనలు

అన్నవరం, నవంబర్ 10, మనం న్యూస్ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న సత్యనారాయణ స్వామి వ్రతాలపై దేవస్థానం కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు వ్రత పురోహితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్తీక మాసంలో స్వామివారి దర్శనానికి, వ్రతాలు ఆచరించేందుకు వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా పురోహితులకు సూచించారు. ఈవో మాట్లాడుతూ వ్రతాల నిర్వహణలో భక్తుల పట్ల ఎలాంటి వివక్ష, పెద్దచిన్న తారతమ్యాలు చూపకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించాలని స్పష్టం చేశారు. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వ్రతాలను నిర్ణీత విధివిధానాల ప్రకారం త్వరితగతిన పూర్తి చేసి భక్తులను సంతృప్తిగా పంపించాలని ఆదేశించారు.



వ్రతాల నిర్వహణలో ఎక్కడైనా లోటుపాట్లు, సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అదేవిధంగా వ్రత పురోహితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈవో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పురోహితులు ప్రస్తావించిన వివిధ అంశాలపై సానుకూలంగా స్పందిస్తూ, పరిష్కరించదగిన సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార మార్గాలను సూచించారు. అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్తీక మాసంలో అన్నవరం క్షేత్రానికి విచ్చేసే ప్రతి భక్తుడికి ఆధ్యాత్మిక ప్రశాంతతతో కూడిన దివ్యమైన వ్రతానుభూతిని అందించడమే దేవస్థానం ప్రధాన లక్ష్యమని ఈవో పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో పురోహితులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో వ్రతాల విభాగం ఏఈఓ అనకాపల్లి ప్రసాద్, సూపరింటెండెంట్ యనమల అప్పారావు, గుమస్తా వెంకటేశ్వరరావు, వ్రత పురోహితుల సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానం హుండీల ఆదాయం రూ.1.63 కోట్లు

అన్నవరం, నవంబర్ 10 (మనం న్యూస్): కాకినాడ జిల్లా అన్నవరం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో మంగళవారం హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. కొండపై స్వామివారి శాశ్వత కల్యాణ వేదిక వద్ద దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది హుండీలను తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు.



ఆలయ పరిసర ప్రాంతాలతో పాటు వివిధ ఉపాలయాల వద్ద ఏర్పాటు చేసిన హుండీలలోని నగదు, బంగారం, వెండి, విదేశీ కరెన్సీని లెక్కించి వివరాలను నమోదు చేశారు. గత అక్టోబర్ 1వ తేదీన హుండీలను తెరిచి లెక్కించగా, మంగళవారం నవంబర్ 10వ తేదీన తిరిగి లెక్కింపు చేపట్టారు. మొత్తం 40 రోజుల వ్యవధిలో భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకల ద్వారా రూ.1,63,25,461 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు.

హుండీల ఆదాయం వివరాలు ఇలా ఉన్నాయి:

భారతీయ కరెన్సీ నోట్లు: రూ.1,54,16,599, భారతీయ నాణేలు: రూ.9,08,862, మొత్తం నగదు: రూ.1,63,25,461, బంగారం: 38 గ్రాముల 700 మిల్లీగ్రాములు, వెండి: 467 గ్రాముల 650 మిల్లీగ్రాములు, ఈ 40 రోజుల వ్యవధిలో రోజుకు సగటున రూ.4,08,136 ఆదాయం లభించింది.


విదేశీ కరెన్సీ కూడా సమర్పణ

వివిధ దేశాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామివారికి విదేశీ కరెన్సీని కూడా కానుకలుగా సమర్పించారు. ఇందులో కెనడా డాలర్లు 130, అమెరికా డాలర్లు 62, ఇంగ్లాండ్ పౌండ్లు 25, కువైట్ దినార్ 1, సింగపూర్ డాలర్లు 12, యూఏఈ దిర్హామ్లు 15, మలేషియా రింగిట్లు 5, నేపాల్ రూపాయలు 30, ఖతార్ రియాల్స్ 1 ఉన్నాయి.స్వామివారిపై భక్తులకు ఉన్న అపారమైన విశ్వాసం, భక్తిప్రపత్తులకు ఈ హుండీ ఆదాయం నిదర్శనంగా నిలుస్తోంది. దేశ విదేశాల నుంచి తరలివచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కుబడులను హుండీల ద్వారా చెల్లించుకుంటున్నారు. దేవస్థానం అధికారులు, సిబ్బంది సమక్షంలో హుండీల లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు.

అన్నవరం సత్యదేవుని గిరిప్రదక్షిణపై గజల్ గీతం ఆవిష్కరణ

- స్వయంగా రచించి, స్వరపరిచి ఆలపించిన ప్రముఖ గజల్ గాయకుడు డా. గజల్ శ్రీనివాస్
- ఈవో నల్లం సూర్యచక్రధరరావు చేతుల మీదుగా భక్తి గీతం ఆవిష్కరణ

అన్నవరం , నవంబర్ 10, మనం న్యూస్: కాకినాడ జిల్లా అన్నవరం ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలోని శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి గిరిప్రదక్షిణ విశిష్టతను చాటిచెప్పే నూతన భక్తి గీతం ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ గజల్ గాయకులు, సప్తవిధ



గజల్ చక్రవర్తిగా పేరొందిన డాక్టర్ గజల్ శ్రీనివాస్ స్వయంగా రచించి, సంగీతం సమకూర్చి, ఆలపించిన ఈ ప్రత్యేక భక్తి గీతాన్ని సత్యదేవునికి అంకితం చేశారు.

సత్యదేవునిపై తనకున్న అపారమైన భక్తిని చాటుకుంటూ గజల్ శ్రీనివాస్ ఈ గీతాన్ని ప్రత్యేకంగా రూపొందించి, రికార్డు చేసి దేవస్థానానికి పంపించారు. స్వామివారి గిరిప్రదక్షిణ ఆధ్యాత్మిక విశిష్టత, భక్తులలో కలిగించే భక్తిభావాన్ని ప్రతిబింబించేలా ఈ గీతాన్ని రూపొందించడం విశేషం.

అన్నవరం దేవస్థానం వైదిక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) శ్రీ నల్లం సూర్యచక్రధరరావు గారు నూతన భక్తి గీతాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సత్యదేవునిపై అపారమైన భక్తితో స్వయంగా గీతాన్ని రచించి, సంగీతం సమకూర్చి, ఆలపించి స్వామివారికి అంకితం చేసిన డాక్టర్ గజల్ శ్రీనివాస్కు దేవస్థానం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. ఈ గీతం ద్వారా సత్యదేవుని గిరిప్రదక్షిణ మహిమ, ఆధ్యాత్మిక విశిష్టత మరింత మంది భక్తులకు చేరువవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన వైదిక కమిటీ సభ్యులు చిట్టి శివరామశర్మ, వేదన సూర్యనారాయణశర్మ, చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభిరామ్మూర్తి, నాగపట్ల రవిశర్మ, పర్యవేక్షణ అధికారి రమేష్, అర్చకులు, పురోహితులు, ఇతర దేవస్థాన అధికారులు పాల్గొన్నారు. భక్తి భావాన్ని పెంపొందించే ఈ గీత ఆవిష్కరణ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది.

శుభ్రతలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

కర్నూల్ కార్పొరేషన్ (మనం న్యూస్): నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా, క్షేత్రస్థాయిలో మెరుగైన ఫలితాలు కనిపించేలా శ్రద్ధ చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పారిశుద్ధ్య పర్యవేక్షక యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులను ఆయన పరిశీలించారు.పాతబస్తీలోని నెహ్రూ రోడ్డు అపరిశుభ్రంగా ఉండటంపై పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జమ్మిచెట్టు సమీపంలోని హంద్రీ నది పరివాహక ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా జొహరాపురంలో పుష్కార్లో చెత్త వదిలేసి ఉండటాన్ని గమనించిన కమిషనర్, సంబంధిత శానిటరీ ఇన్స్పెక్టర్, సెక్రటరీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాక్టర్ను పారిశుద్ధ్య సిబ్బంది వినియోగించుకుని, కేసీ కెనాల్ పరివాహక ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం



కలెక్టరేట్లోని అన్న క్యాంటీన్ను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ బాధ్యతగా నిర్వహించాలని, పారిశుద్ధ్య కార్మికులు విధులకు సక్రమంగా హాజరవుతున్నారా లేదా అనే విషయాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వీధులు, ప్రధాన రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపాలు కనిపిస్తే సంబంధిత సిబ్బందిని బాధ్యులుగా చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్యంలో మార్పు కనిపించకపోతే నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు అనిల్ కుమార్, మల్లికార్జున, వలి, రాజు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి చేరిన వైసిపి ముఖ్య నాయకుడు షాకీర్ దొర

మంత్రాలయం ,నవంబర్ 10(మనం న్యూస్): మంత్రాలయం మండల పరిధిలో వగరూరు గ్రామానికి చెందిన వైసిపి ముఖ్య నాయకుడు షాకీర్ దొర , మాజీ సర్పంచ్ నరసింహులు , మాజీ ఎంపీటీసీ తిక్కన్న , డీలర్ రఫీక్, హుసేని బుజ్జప్ప, మహమ్మద్ హుసేని, హేదర్,దాదా, షబ్బీర్ మరియు



వెంకటరాముడు మరో 50 కుటుంబాలు టీడీపీ లోకి చేరారు. మంగళవారం మాధవరం గ్రామంలోని తెదేపా కార్యాలయంలో కల్లుదేవకుంట సొసైటీ చైర్మన్ రాధమ్మ , టీడీపీ నాయకులు షబిర దొర నేపథ్యంలో మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి , మంచాల సొసైటీ చైర్మన్ రామకృష్ణ రెడ్డి , మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి సమక్షంలో వారికి టీడీపీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కుటుంబ సభ్యుడిగా భావిస్తూ వారి కష్టసుఖాల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతమే నా ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం చూసి , మంత్రాలయం నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుండడంతో అభివృద్ధికి ఆకర్షితులై పార్టీ లో చేరడం జరిగిందన్నారు మంత్రాలయం నియోజకవర్గం ప్రజలు మార్పును కోరుకుంటున్నారన్నారు. ఇటీవల జరిగిన పరిషత్ పోరులో మంత్రాలయం మండలంలో తెదేపా 11 ఎంపీటీసీలు గెలుపొందడం హర్షించదగ్గ విషయం అన్నారు. త్వరలో జరిగే పల్లెపోరులో కూడా టిడిపి జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. అందరూ ఉంది కలిసికట్టుగా ఉండి మంత్రాలయం మండలంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం షాకీర్ దొర మాట్లాడుతూ రాఘవేంద్ర రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో,ఆయన చేస్తున్న ప్రజా సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని తెలిపారు. పార్టీ అభివృద్ధికి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా జనరల్ సెక్రటరీ మద్దిలేటి,పవన్ కుమార్ ,గోపాల్,వీరారెడ్డి, లింగప్ప మరియు టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అవంతి ఫ్యాక్టరీలో కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

ఏలేశ్వరం,నవంబర్ 10(మనం న్యూస్): మండలంలోని ఎర్రవరం గ్రామ పరిధిలో ఉన్న అవంతి సి ఫుడ్ ఫ్యాక్టరీ లో కార్మికులకు జే అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యులు బి జయరాం ఆధ్వర్యంలో వివిధ రకాలైన



వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఫ్యాక్టరీ సీనియర్ మేనేజర్ బి శంకర్,డిప్యూటీ మేనేజర్ ఆదివిష్ణు మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఇందులో భాగంగా కార్మికులకు వైద్య పరీక్షలతో పాటు మందులు అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఫ్యాక్టరీలో ప్రతి మంగళవారం కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.వైద్యులు బి జయరాం మాట్లాడుతూ ఫ్యాక్టరీలో ఉన్న ప్రతి కార్మికులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఫ్యాక్టరీలో ఉన్న కార్మికుల అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పెద్దాపురం సబ్ యూనిట్ అధికారి ఎన్ వి సత్యనారాయణ మాట్లాడుతూ ఫ్యాక్టరీ పరిసరాల్లో నీటిని నిల్వలు లేకుండా చూసుకున్నట్లయితే కార్మికులకు ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుంది అన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎమ్ ఎల్ హెచ్ పిలు జి విజయశ్రీ, కే రజిని,ఏఎన్ఎంలు బి లక్ష్మీ, జి సూర్యకళ, హెల్త్ అసిస్టెంట్ డి రాజు, ఆశాలు టి రత్నవల్లి, కే అరుణ కుమారి, ఫ్యాక్టరీ సిబ్బంది, బిందు, ఫణీంద్ర, భవాని, ఎన్ రామలక్ష్మి, ఏ ఉష తదితరులు ఉన్నారు.

అప్పుడు అత్తమ్మ కోపం చూసి వణికిపోయా

● సోనియా గాంధీ



ఢిల్లీ, నవంబర్ 10 : ప్రధాని నరేంద్రమోడీతో తనకు సైద్ధాంతిక వైరుధ్యాలే గానీ.. వ్యక్తిగత విభేదాలు లేవన్నారు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ. ఆమె రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్ ' మంగళవారం విడుదలైన సంగతి తెలిసిందే. అందులో సోనియా వ్యక్తిగత, రాజకీయాలకు సంబంధించి పలు కీలక అంశాలను ప్రస్తావించారు.

మోదీ పోరాటం అది.. నా పోరాటం ఇది..

''మోడీజీ 12 ఏళ్లుగా ప్రధాని పదవిలో ఉన్నారు. అయినప్పటికీ అధికారిక సమావేశాల్లోనే అప్పుడప్పుడు ఎదురుపడ్డాం. ఆ సమయంలో మోడీ పెద్దగా మాట్లాడరు. కేవలం నమస్తే అని పలకరించుకున్నాం. ఒకసారి నేను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత 'ఎలా ఉన్నారు' అని అడిగారు. మోడీ ఈ దేశం కోసం ఆయన దృక్కోణంలో పోరాడుతుంటే.. నేను నా సిద్ధాంతాల పరంగా పోరాడుతున్నా. నా కుటుంబసభ్యుల సేవ, త్యాగం, సంప్రదాయాలు, స్వేచ్ఛ, సమానత్వం వంటి అంశాల నుంచి నేను నా సిద్ధాంతాలను ఏర్పరుచుకున్నా. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్తల ఆలోచనలు, ఆయన పెరిగిన పరిస్థితులు, ఎదురైన అనుభవాల నుంచి మోదీ తన దృక్కోణాన్ని ఏర్పరుచుకున్నారు. ఇందులో ఎలాంటి వ్యక్తిగతం లేదు'' అని సోనియా వివరించారు.

ప్రణబ్ ప్రధాని కావాలనుకున్నారు..

ఈ సందర్భంగా యూపీఏ హయాంలో తన పాత్ర గురించి కూడా సోనియా ప్రస్తావించారు. ప్రభుత్వాన్ని తాను వెనకుండి నడిపించానంటూ వచ్చిన విమర్శలను ఆమె తోసిపుచ్చారు. అంతేకాదు.. దివంగత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఓసారి ప్రధాని కావాలని ఆశపడినట్లు తెలిపారు. ''యూపీఏ పాలనలో ఆర్థికమంత్రిగా ఉన్న చిదంబరంతో ప్రణబ్ ముఖర్జీకి ఓ సారి విభేదాలు తలెత్తాయి. 2010లో దాని గురించి ఆయన నావద్ద అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నాయకత్వాన్ని మార్చే సమయం వచ్చిందేమో అని ప్రణబ్ అన్నప్పుడు నేను ఆశ్చర్యపోయా. బహుశా ప్రధాని కావాలన్న ఆయన ఆశను అలా బయటపెట్టి ఉంటారని అర్థమైంది. కానీ నేను ఆ మాటలను పొడిగించలేదు'' అని సోనియా వెల్లడించారు.

అత్తమ్మ కోపం చూసి వణికిపోయా..

తన అత్తమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో ఉన్న అనుబంధం గురించి సోనియా ఇందులో పంచుకున్నారు. ఆమెకు చాలా త్వరగా కోపం వస్తుందని, మొదట్లో తాను ఎంతగానో భయపడిపోయినట్లు రాసుకొచ్చారు. ''ఓసారి సిబ్బంది ఒకరు ముఖ్యమైన అపాయింట్మెంట్ గురించి చెప్పడం మర్చిపోవడంతో అత్తమ్మ ఆగ్రహించారు. ఆ వ్యక్తిని గదిలో మూలన నిలబెట్టారు. మరోసారి డైనింగ్ టేబుల్‌పై ప్లేట్ విసిరేశారు. అది చూసి నేను కూర్చున్న చోటే వణికిపోయా. రాజీవ్, సంజయ్ మాత్రం మౌనంగా చూస్తూ ఉన్నారు. 'భయపడకు.. అమ్మ కోపం క్షణకాలం' అని అప్పుడు రాజీవ్ నాతో అన్నారు. అత్తమ్మ గురించి పూర్తిగా తెలుసుకున్నాక.. ఆమె ఏంటో నాకు అర్థమైంది. ఆమెకు చీరలంటే చాలా ఇష్టం'' అని సోనియా వివరించారు.



ఢిల్లీలో దడపుట్టిస్తున్న వాయు నాణ్యత సూచీ

ఢిల్లీ, నవంబర్ 10 : దేశరాజధాని ఢిలీని దీపావళి తర్వాత కాలుష్యం మరింత కమ్మేసింది. పండగ నేపథ్యంలో అధికార యంత్రాంగం చేపట్టిన చర్యలు, సుప్రీంకోర్టు ఆదేశాలు ఏమాత్రం పనిచేయలేదు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం అక్టోబర్ 9న వాయు నాణ్యత సూచీ 483గా రికార్డు కాగా, మరో 15 వాయు పర్యవేక్షణ కేంద్రాల్లో 400కు పైగా నమోదైంది.



భారత్‌పై విష ప్రచారం..

చైనా వ్లాగర్ల తీరుపై కేంద్రం సీరియస్

ఢిల్లీ, నవంబర్ 10 : భారత్‌కు వ్యతిరేకంగా కొంతమంది చైనీస్ వ్లాగర్లు సామాజిక మాధ్యమాల వేదికగా విష ప్రచారం చేయడం ఇటీవల తీవ్ర వివాదాస్పదమైంది. బంగ్లాదేశ్‌లోని మురికివాడలను ఢిల్లీకి చెందినవి అని పేర్కొంటూ వారు చేసిన లైవ్‌స్ట్రీమింగ్‌పై భారత విదేశాంగశాఖ తీవ్రంగా స్పందించింది. అది దురదృష్టకర ఘటన అని పేర్కొంది. అసలేం జరిగిందంటే..

ఇటీవల కొంతమంది చైనీస్ వ్లాగర్లు తమ సోషల్ మీడియా ఖాతాల్లో భారత్‌లోని జీవన స్థితిగతులపై వీడియోలు పోస్ట్ చేశారు. ఢాకాలోని మురికివాడల దృశ్యాలను చూపిస్తూ.. అవన్నీ ఢిల్లీ ప్రాంతాలని అసత్య ప్రచారం చేశారు. దాదాపు 150 మంది చైనీస్ జాతీయులు ఈ వీడియోలను రికార్డు చేసినట్లు సమాచారం.

వీటిపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ మంగళవారం మీడియా సమావేశంలో స్పందించారు. ''ఈ విషయంపై మీడియాలో వచ్చిన నివేదికలను చూశాం. ఏ దేశాన్నయినా వక్రీకరించి చూపించే ఇలాంటి ప్రయత్నాలు దురదృష్టకరం. విదేశీ వ్యక్తుల సాయంతో కొంతమంది ఢాకాను ఢిల్లీగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు అనిపిస్తోంది. అయితే, ఇలాంటి తప్పుడు కథనాలతో వారు విశ్వసనీయతను కోల్పోతారనే విషయం గుర్తుంచుకోవాలి. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నా'' అని పేర్కొన్నారు.

నా బిడ్డను నదిలో పడేయడమా?

● తొలి కాన్పుపై సోనియా



ఢిల్లీ, నవంబర్ 10 : కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో వ్యక్తిగత జీవితానికి సంబంధించి అనేక విషయాలను వెల్లడించారు. తొలుత తాను తల్లిని కాబోతున్న విషయం తెలిసి కుటుంబం మొత్తం ఎంతో సంతోషించిందని.. ఎప్పుడూ గంభీరంగా కనిపించే ఇందిరా గాంధీ కూడా తనను ఆలింగనం చేసుకొని 'ఓ పెద్ద పసిపాప.. మరో పసిబిడ్డకు జన్మనివ్వబోతోంది' అని చెప్పారని అన్నారు. కానీ, ఆ ఆనందం ఎక్కువకాలం నిలవలేదని.. నెలలు నిండకుండానే మగబిడ్డ జన్మించి, గంటల్లోనే లోకాన్ని వీడిన విషయాన్ని వెల్లడించారు. రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ కలిసి ఆ నవజాత శిశువు మృతదేహాన్ని ఖననం చేశారని తెలిపారు.

''జనవరి 18, 1969.. ప్రసవ తేదీ కన్నా రెండు నెలల ముందే సాధారణ ప్రసవం ద్వారా ఓ మగబిడ్డకు జన్మనిచ్చా. ఇంక్యుబేటర్లో పెడుతున్నప్పుడు చిన్నారి మొదటి ఏడుపును విన్నాను. వాడిని చూపించడానికి రాజీవ్ నన్ను తీసుకెళ్లారు. నల్లని జుట్టు, పొడవాటి సన్నని వేళ్లు, చాలా చిన్నగా.. చక్కగా ఉన్నాడు. ఇద్దరం కలిసి శిశువును తదేకంగా చూస్తూ ఉండిపోయాం. కానీ, మా సంతోషం ఎక్కువసేపు నిలవలేదు. చిన్నారి బతుకుతుందో లేదో చెప్పలేమని వైద్యులు తెలిపారు. మరుసటి రోజు ఉదయం రాజీవ్ నా దగ్గరకు వచ్చి బిడ్డను కాపాడుకోలేకపోయామని చెప్పారు. గుండె పగిలేలా రోదించాను. ఆయన కూడా వెక్కి వెక్కి ఏడ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఇందిరా గాంధీ తన పర్యటనను రద్దు చేసుకొని వెంటనే ఆసుపత్రికి వచ్చారు. ఎరుపెక్కిన కళ్లతో ఉన్న ఆమె మమ్మల్ని ఆలింగనం చేసుకుని, చాలా సేపు మాతోనే కూర్చున్నారు. భారమైన హృదయంతోనే మరుసటి రోజు పర్యటనకు వెళ్లారు'' అని సోనియా పేర్కొన్నారు.

''ఆ తర్వాత శిశువు అంత్యక్రియలపై ప్రశ్నలు తలెత్తాయి. హిందూ సంప్రదాయం ప్రకారం నవజాత శిశువు మృతదేహాన్ని దహనం చేయరు. క్రిస్టియన్, పార్సీ సంప్రదాయాల ప్రకారం చేస్తే అదో పెద్ద సమస్యగా మారుతుంది. ఆ పసికందును నదిలో వదిలేయడంపైనా చర్చ జరిగింది. అయితే.. ఏదేమైనా నా బిడ్డను నదిలో పడేసేందుకు అంగీకరించే ప్రసక్తే లేదని అనుకున్నా. చివరకు మెహ్రౌలీలోని ఫిరోజ్ గాంధీ వ్యవసాయ క్షేత్రంలో ఖననం చేశారు. ఆ బాధ నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే విపక్షానికి చెందిన ఓ పత్రికలో శిశువు గురించి వచ్చిన కథనం మరింత వేదనకు గురిచేసింది. ఆ విషపూరిత పదాలు నా హృదయాన్ని ఎంతో గాయపరిచాయి. వీళ్లు ఇంత క్రూరంగా ఎలా ఉంటారు? నేనేం చేశానని ఇంత ద్వేషం? అని అనిపించేది. కాలం గడుస్తున్నకొద్దీ వీటన్నింటి నుంచి మెల్లమెల్లగా బయటపడ్డాం. అదే ఏడాది అక్టోబర్లో మరోసారి తల్లి కానున్న విషయాన్ని రాజీవ్‌కు చెప్పాను. ఓవైపు ఆందోళన, మరోవైపు సంతోషం.. 1970 జూన్ 19న రాహుల్‌కు జన్మనిచ్చా'' అని సోనియా తెలిపారు.

ఏపీ లో హల్ చల్ చేస్తున్న పవన్ కళ్యాణ్ డైవర్స్ వ్యవహారం

జీర్ణించుకోలేకపోతున్నా కూటమి నాయకులు, అభిమానులు, జనసైనికులు



పాలకొల్లు, నవంబర్ 10,మనం ప్రతినిధి: ఏపీ రాష్ట్ర డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్, భార్య అన్నా లెజ్నెవ విడాకుల వ్యవహారం ఏపీ రాష్ట్ర టాక్ ది ఏపీ గా మారిపోయింది. ఇప్పటికే ఇద్దరు భార్యలకు విడాకులు ఇచ్చిన పవన్ కళ్యాణ్ మళ్లీ మూడో భార్యకు కూడా విడాకులు ఇవ్వడం నమ్మ లేక పోతున్నామని అంటూ ఎక్కడ చూసినా చర్చ నియాసంగా మారింది. ఎలక్ట్రానిక్ మీడియా,సోషల్ మీడియా మాత్రమే కాకుండా గల్లి గల్లి కి మనిషి మనిషి కి చర్చ రావడం విశేషం. రష్యా మోడల్ గా ఉన్న అన్నా లెజెనెవను సెప్టెంబర్ 30, 2013లో పవన్ కళ్యాణ్ వివాహం చేసుకోగా మార్కు శంకర అనే బాబు కూడా కల్గిన విషయం తెలిసిందే.

జీర్ణించుకోలేకపోతున్నా కూటమి నాయకులు,అభిమానులు, జనసైనికులు:

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అన్న లేజ్ నే వా విడకుల వ్యవహారం పవన్ కళ్యాణ్ అభిమానులు జనసైనికులులో నే కాకుండా కూ టమి ప్రభుత్వంలోనే కలకలం రేపింది. ఒక్కసారిగా అందరూ ఉలిక్కిపడ్డట్టు అయింది అని పలువురు అంటున్నారు. పవన్ కళ్యాణ్ విడాకుల వ్యవహారం దావానంల రాష్ట్రవ్యాప్తంగా హల్చల్ చేయడం మెగా కుటుంబంలో కూడా తలనొప్పిగా మారినట్లు సమాచారం. ఇప్పుడిప్పుడే ఎన్నికల్లో నూరు శాతం స్ట్రైక్ రేట్స్ సాధించి సీఎం రేంజ్ స్థాయికి పార్టీ చేరుకుంటున్న తరుణంలో ఈ విడాకులు వ్యవహారం ఏమి నెష్టం చేస్తుందో అని జన సైనికులు, వీర మహిళలు, అభిమానులుజీర్ణించుకోలేని పరిస్థితి నెలకొంది. ఇక కూటమి పార్టీ అగ్ర నేతల సైతం ఈ వ్యవహారం పార్టీకి ఏ విధంగా నష్టం తెచ్చిపెడుతుందోనని డైలమాలో పడ్డట్టు సమాచారం. ఈ వ్యవహారం ప్రతిపక్షాలకు గొప్ప ఆయుధంగా మారుతుందేమోనని,తద్వారా కూటమి ప్రభుత్వం విచ్చిన్నానికి దారితీస్తుంది ఏమోనని కూడా ఆ పార్టీలో అంతర్గతంగా ఆందోళన కూడా నెలకొన్నట్లు ప్రచారం. మోడీ, యోగి ఆదిత్యనాథ్ దారిలోనే పవన్ కళ్యాణ్:: పవన్ కళ్యాణ్ విడాకుల వ్యవహారం ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనియాంశంగా మారిన నేపథ్యంలో పలువురు విశ్లేషకులు అయితే మోడీ, యోగి ఆదిత్యనాథ్ దారిలో నడవడానికి ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా ఉండొచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. డిప్యూటీ సీఎం అయిన తర్వాత పవన్ కళ్యాణ్ మూడో భార్యఅన్నా లెజ్నెవ తో కనీసం మాట్లాడే పరిస్థితి లేకపోవడం పూర్తిగా ప్రజల సేవకే అంకితం అయిపోవడంతో వారి ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి ఈ పరిస్థితి కి దారితీసి ఉండొచ్చని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ పవన్ కళ్యాణ్ మాత్రం ఇకపై మోడీ, యోగి ఆదిత్య బాటలో నడవడానికి ఈ కీలక నిర్ణయం తీసుకుని ఉండొచ్చని పలువురు విశ్లేషకులు కూడా భావిస్తున్నట్లు సమాచారం. అయితే భవిష్యత్ పరిస్థితి ఏ విధంగా ఉంటుందనేది వేచి చూడాల్సిందే మరి.

న్యూజెర్సీలో దీపావళి సంబరాలు..

చెత్తమయమైన వీధులు



న్యూజెర్సీ, నవంబర్ 10 : భారత్‌తోపాటు విదేశాల్లోనూ భారతీయులు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అయితే వేడుకల తర్వాత వ్యర్థాలతో న్యూజెర్సీ రహదారులు నిండిపోయాయి.

సుందరమైన నగర వీధులు చెత్త కుప్పలుగా మారడంతో వాటిని తొలగించడానికి అగ్నిమాపక బృందాలు, భద్రతా సిబ్బంది రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఇండియా స్ట్రీట్ సహా పలు ప్రాంతాల్లోనూ ఇవే పరిస్థితులు దర్శనమిచ్చాయి. వాటికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అందులో కాల్చి పడేసిన బాణసంచా, కార్డ్‌బోర్డ్ పెట్టెలు, ప్లాస్టిక్ కవర్లతో రోడ్లు నిండిపోయిన దృశ్యాలు కనిపిస్తున్నాయి.

ఆ వీధులను అగ్నిమాపక సిబ్బంది నీటి జెట్లు ఉపయోగించి శుభ్రం చేశారు. కొద్ది సేపటి వరకు రాకపోకలకు అంతరాయం కలగడంతో అక్కడి పరిస్థితిని పోలీసులు పర్యవేక్షించారు.

ఐఫోన్ ఫ్యాక్టరీలో.. ముగ్గురు కార్మికుల మృతి



చెన్నై, నవంబర్ 10 : తమిళనాడులోని హోసూర్ సమీపంలో ఉన్న ఐఫోన్ విడి భాగాల తయారీ ప్లాంట్‌లో విషాదం చోటుచేసుకుంది. ఈ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు మరణించారు. విషపూరిత వాయువులు పీల్చడమే వారి మరణాలకు కారణమని ప్రాథమిక సమాచారం. మెయింటనెన్స్ విభాగంలో పనిచేస్తున్న వీరు సోమవారం వ్యర్థ జలాల శుద్ధీకరణ ట్యాంక్ వద్ద ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. తొలుత ఓ కార్మికుడు ట్యాంకు లోపలికి తొంగి చూసే క్రమంలో ఉన్నట్టుండి కుప్పకూలాడు. అతడికి ఏం జరిగిందో తెలుసుకునేందుకు వెళ్లిన క్రమంలో మరో ఇద్దరు కార్మికులు స్పృహ కోల్పోయారు. తోటి సిబ్బంది వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆ ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్లాంట్ను టాటా ఎలక్ట్రానిక్స్ నిర్వహిస్తోంది. తాజా ఘటనపై ఈ కంపెనీ నుంచి గానీ.. యాపిల్ నుంచి గానీ ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే, ఘటనపై ఈ కంపెనీ అంతర్గత దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. పోస్ట్‌మార్టం నివేదిక తర్వాతే మరణాలకు గల అసలు కారణం తెలుస్తుందని పోలీసు అధికారులు వెల్లడించారు.

అనంతపురం జడ్పీ కుర్చీపై ఎవరి ధీమా వారిదే..


- అనంతపురం జడ్పీ పీఠంపై ఉత్కంఠ: కాలవ వ్యూహాలు వర్సెస్ మంత్రి పాచికలు.. పీఠం దక్కేది ఎవరికి?
- అనంత జడ్పీ చైర్మన్ రేసు: గంజే నాగరాజుకు దక్కుతుందా? చిత్రగుడి చిరంజీవికి వరిస్తుందా?
- జడ్పీ పీఠంపై మొదలైన రెండో ఘట్టం
- అనంతపురంలో ముదిరిన 'కూటమి' రాజకీయం!
- గార్లదిన్నె జడ్పీటీసీ నాగరాజు వర్సెస్ ఉరవకొండ జడ్పీటీసీ చిరంజీవి: అనంత జడ్పీ కుర్చీ ఎవరిది?
- తొలి ఘట్టంలో కాలవ మార్క్ వ్యూహం.. రెండో ఘట్టంలో మంత్రి పట్టు: అనంత జడ్పీ రేసు తీవ్రతరం!
- ఆర్థికంగా అండగా నిలిచిన నాగరాజుకా? మంత్రి మద్దతున్న చిరంజీవికా? జడ్పీ చైర్మన్ పీఠంపై సస్పెన్స్!
- 25 స్థానాలు గెలిచినా తప్పని తలనొప్పి.. అనంతపురం జడ్పీ పీఠం ఎవరిని వరించేను?
- బీసీ రిజర్వేషన్ పీఠంపై తీవ్ర పోటీ.. అనంత కూటమి అధిష్ఠానం ముందడుగు ఎటువైపు?

అనంతపురం, కలెక్టరేట్ నవంబర్ 10 : మనం న్యూస్ : అనంతపురం జిల్లా పరిషత్ (జడ్పీ) చైర్మన్ ఎంపిక రాజకీయం జిల్లాలో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల మొదటి ఘట్టంలో అభ్యర్థుల ఎంపిక నుంచి విజయాల వరకు స్పష్టమైన వ్యూహంతో ముందడుగు వేసిన నేతల నడుమ, ప్రస్తుత చైర్మన్ పీఠం ఎంపిక ఘట్టంలో తీవ్ర పోటీ నెలకొంది.

మాజీ మంత్రి, సీనియర్ నేత కాలవ శ్రీనివాసులు మద్దతుతో గార్లదిన్నె జడ్పీటీసీగా గెలుపొందిన గంజే నాగరాజు ఒకవైపు, ఉరవకొండ మండలంలో మంత్రి పాచికల మద్దతుతో విజయం సాధించిన చిత్రగుడి చిరంజీవి మరోవైపు ఈ పీఠం కోసం గట్టి పోటీలో నిలిచారు.

మొదటి ఘట్టం: కాలవ శ్రీనివాసులు వ్యూహం.. గంజే నాగరాజు గెలుపు

జడ్పీ చైర్మన్ పీఠం బీసీ వర్గానికి కేటాయించే రిజర్వేషన్ ప్రక్రియ ఆధారంగా



అభ్యర్థుల ఎంపిక జరిగింది. రాజకీయ సమీకరణాలలో భాగంగా గార్లదిన్నె జడ్పీటీసీ స్థానాన్ని బీసీ వర్గానికి చెందిన గంజే నాగరాజుకు కేటాయించేలా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు వేసిన వ్యూహం పారింది. మొదటి నుంచి జెడ్పీటీసీ అభ్యర్థుల గెలుపు కోసం తన సొంత ఆర్థిక వనరులను సమకూరుస్తూ, పార్టీ విజయం కోసం తీవ్రంగా శ్రమించిన గంజే నాగరాజు, ఎన్నికల్లో ఘనవిజయం సాధించి చైర్మన్ రేసులో ప్రధాన ఆశావహిగా నిలిచారు.

ఎన్నికల ఫలితాల గణాంకాలు:

జిల్లాలోని మొత్తం 31 జెడ్పీటీసీ స్థానాల్లో ఫలితాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

తెలుగుదేశం పార్టీ (టీడీపీ): 25 స్థానాలు
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైస్సార్సీపీ): 02 స్థానాలు
స్వతంత్రులు: 02 స్థానాలు
భారతీయ జనతా పార్టీ (బీజేపీ): 01 స్థానం
జనసేన పార్టీ (జె ఎస్ పి): 01 స్థానం
రెండో ఘట్టం: మారిన సమీకరణాలు.. మంత్రి పట్టు!

మొదటి నుంచి కాలవ శ్రీనివాసులు, ఎంపీ పార్థసారథులు అభ్యర్థుల గెలుపుపై దృష్టి సారించగా, ఎన్నికల ఫలితాల తర్వాత రాజకీయం మరింత ముదిరింది. ఉరవకొండ మండలం నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన చిత్రగుడి చిరంజీవి జడ్పీటీసీగా గెలుపొందడంతో కొత్త సమీకరణాలు తెరపైకి వచ్చాయి. మంత్రి ఇలాకా అయిన ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన చిరంజీవికి చైర్మన్ పదవి దక్కేలా మంత్రి వర్గం బలంగా పాచికలు కదుపుతోంది.

పీఠం ఎవరికి దక్కేను?

గంజే నాగరాజు పక్షం: మొదటి నుంచి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఆర్థికంగా, రాజకీయంగా అండగా నిలిచిన నాగరాజుకే ప్రాధాన్యత ఇవ్వాలని, కాలవ శ్రీనివాసులు ముందస్తు నిర్ణయం మేరకు గార్లదిన్నె జడ్పీటీసీగా గెలిచిన నాగరాజుకే చైర్మన్ కుర్చీ కేటాయించాలని ఆయన వర్గం కోరుతోంది.

చిత్రగుడి చిరంజీవి పక్షం: ఉరవకొండ నుంచి గెలిచిన చిరంజీవికి మంత్రి మద్దతుండటం, సొంత నియోజకవర్గ నేతకు పీఠం దక్కించుకోవాలని మంత్రి వర్గం గట్టిగా పట్టుబడుతుండటంతో పోటీ హోరాహోరీగా మారింది.

మొదటి ఘట్టం నుంచి పక్కా ఎత్తుగడలతో వ్యవహరించిన కాలవ శ్రీనివాసులు నిర్ణయానికే అధిష్ఠానం మొగ్గుచూపి గంజే నాగరాజుకు పీఠం కట్టబెడుతుందా? లేక మంత్రి పాచికలు పారి ఉరవకొండ జడ్పీటీసీ చిత్రగుడి చిరంజీవికి అవకాశం దక్కుతుందా? అనేది చూడాల్సి ఉంది.

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎస్ఆర్ఎం స్కూల్ విద్యార్థులు



కోదాడ, నవంబర్ 10(మనం న్యూస్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ పోటీల్లో ఎస్ఆర్ఎం స్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబర్ 9న కోదాడలోని సిసి రెడ్డి పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఎస్ఆర్ఎం స్కూల్ కి చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో 9వ తరగతి విద్యార్థి ఏ షణ్ముఖ ప్రియ, అండర్-14 విభాగంలో 7వ తరగతి విద్యార్థులు పి ఆర్తిశ్రీ, ఏ తేజవికాస్, యు ఉమామహేశ్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి విద్యార్థులను అభినందించారు. క్రీడలతో పాటు విద్యలోనూ రాణించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులను, కోచ్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదివే భవిష్యత్తుకు పునాది

కేజీబీవీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి
విద్యార్థినులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందించాలి
ఇంటర్మీడియట్లో 100 శాతం ప్రవేశాలు నమోదు చేయాలి
నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్....



ఉమ్మడి మహబూబ్ నగర్ నవంబర్ 10 (మనం బ్యూరో): కేజీబీవీల్లో చదువుకుంటున్న విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. విద్యార్థినులకు మెరుగైన విద్యా ప్రమాణాలు, సౌకర్యవంతమైన వసతి, నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వారి విద్యా ప్రగతికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం అచ్చంపేట మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, బోధన, భోజన ఏర్పాట్లు, ఇంటర్మీడియట్ కోర్సుల నిర్వహణ, విద్యార్థుల ప్రవేశాల నమోదు తదితర అంశాలను పాఠశాల పరిసరాలను పరిశీలించి పాఠశాల ప్రత్యేక అధికారి కుసుమ వివరాలు అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు.


సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కేజీబీవీ పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్, పాఠశాల చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ గోడ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ నిర్మాణం ఎంతో ముఖ్యమన్నారు. నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత సమయంలోగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

పాఠశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ కోర్సులు, విద్యార్థినుల ప్రవేశాల వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. 160 మంది విద్యార్థులకు గాను 95 మంది విద్యార్థులు ఉన్నారని తెలుపగా, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు 100 శాతం నమోదయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పాఠశాల ప్రత్యేక అధికారి కుసుమ ను కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యకు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సులో నల్లమల్ల అటవీ ప్రాంతంలోని విద్యార్థినిలకు ఏఐ ఆధారిత విద్యను అందించేలా విద్యార్థినుల ప్రవేశాలు మరింత పెరిగేలా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థినులకు భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే అవకాశాలను వివరించి, వారిని ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాలలో 10వ. తరగతి విద్యార్థినులు తెలుగు సబ్జెక్టులో రాస్తున్న స్లిప్ టెస్టును జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థినుల వద్దకు వెళ్లి పరీక్ష రాస్తున్న తీరును, ప్రశ్నలకు సమాధానాలు రాసే విధానాన్ని పరిశీలించారు. విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. 10వ. తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు ప్రతి విద్యార్థినిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. విద్యార్థినులకు పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తూ, చదువులో వెనుకబడిన వారిని గుర్తించి అదనపు బోధన అందించాలని సూచించారు. కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, విషయ పరిజ్ఞానం పెంపొందించుకునేలా బోధన సాగాలని కలెక్టర్ సూచించారు.

విద్యార్థినులకు అందిస్తున్న భోజన సౌకర్యాలపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థినుల ఆరోగ్యం, పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన, పౌష్టిక విలువలతో కూడిన భోజనం అందించాలని కలెక్టర్ సూచించారు. వంటశాల, భోజనశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర వసతుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వసతి గృహంలో పరిశుభ్రత, భద్రత, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థినుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థినులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు నిర్మించాల్సిన అవసరం ఉందని, క్రీడా ప్రాంగణాన్ని కూడా అభివృద్ధి చేయాలని పాఠశాల ప్రత్యేక అధికారి కుసుమ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, అదనపు తరగతి గదుల నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థినుల సంఖ్య, తరగతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా తగిన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అదేవిధంగా అవసరమైన మరుగుదొడ్ల సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాల ఆవరణలో ఉన్న క్రీడా మైదానాన్ని పరిశీలించిన కలెక్టర్, గ్రౌండ్ను పూర్తిస్థాయిలో లెవలింగ్ చేసి విద్యార్థినులకు అనువైన ఆటస్థలంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచేలా ప్రోత్సహించాలన్నారు. శారీరక దృఢత్వం, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కేజీబీవీలో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థినుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట నడింపల్లి గ్రామ సర్పంచ్ గోపి పద్మ, మండల విద్యాధికారి శ్రీనివాస మూర్తి, కేజీబీవీ ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలతో పాటు తదితరులు ఉన్నారు.

మిల్లర్లతో మిలాకత్ ఐ వడ్ల రేట్లు తగ్గించిన ప్రభుత్వం

బెల్లంకొండ సత్యనారాయణ



కోదాడ/నడిగూడెం, నవంబర్ 10(మనం న్యూస్): మిల్లర్లతో ప్రభుత్వం మిలాకత్ ఐ వడ్ల రేట్లు అమాంతం 1500 రూపాయల వరకు తగ్గించినారని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ అన్నారు. మంగళవారం నడిగూడెం మండలం వేణుగోపాలపురంలో ఈనెల 15వ తారీకు నల్లగొండ పట్టణంలో జరిగే ఆలిండియా రైతు సంఘం మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహిస్తూ బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడుతూ 4200 నుండి 4,500 వరకు క్వింటాల్ వరి ధాన్యం అమ్ముతుండగా ప్రభుత్వం మిల్లర్లు కుమ్మక్కై 3200 వరకు నేడు అమ్మే పరిస్థితి వచ్చిందని రైతులు ఎన్నో కష్టనష్టాలను ఓర్చి సాగునీరు లేక విద్యుత్ సమస్యలతోనే తుఫాను ప్రభావం వల్ల ఎన్నో రకాలుగా నష్టపోతున్న రైతుని ప్రభుత్వము దళారులు మోసం చేసి రైతుని ఇంకా నష్టపరుస్తున్న పరిస్థితి కళ్ళకు కట్టినట్టుగా కనపడుతుందని ఆయన అన్నారు. పంటలు రైతు చేతి నుండి మిల్లుకు చేరిన తర్వాత బియ్యం ధరలను పెంచి ప్రజలని మోసం చేస్తున్నారని మధ్య దళారులు బాగుపడుతున్నారని అన్నారు. రైతుల శ్రమకు తగిన గౌరవం కల్పించి వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే సరైన రేట్లు వచ్చే విధంగా చూడాలని బెల్లంకొండ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు రేఖ తిరుపయ్య, సంపత్, పిచ్చయ్య, కిన్నెర వెంకన్న, కందుల సంజీవరావు, వీరస్వామి, సత్యం, నరేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు

6 కోట్లు అవినీతి ఆరోపణలు అవాస్తవం

మంత్రి ఉత్తమ్ సహకారాలతో ఆదర్శ మున్సిపాలిటీగా నిలుపుదాం
శ్వేత పత్రాన్ని పాలకవర్గ సభ్యులతో కలిసి విడుదల చేసిన చైర్మన్ శ్రీనివాస్ గౌడ్



హుజూర్ నగర్, నవంబర్ 10 (మనం న్యూస్): మున్సిపాలిటీ ద్వారా సమాచారం అడిగిన విషయంలోపారదర్శకతనుపక్కదోవ పట్టిస్తూ సోషల్ మీడియాలోజరిగినటువంటి విష ప్రచారంగురించి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో హుజూర్ నగర్ మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించుకున్న అనంతరం సమావేశం ఏర్పాటు చేసి మున్సిపల్ బడ్జెట్ పై శ్వేత పత్రాన్ని విడుదల చేయడం జరిగింది.కొంతమంది వ్యక్తులు ప్రతిపక్ష పార్టీలతో జతకట్టి లోపాయకారి ఒప్పందాలతో మున్సిపల్ ప్రతిష్టని దెబ్బతీసే ప్రయత్నంచేస్తే ఒప్పుకునేది లేదని, ఏమాత్రం అవినీతికి తావియ్యకుండా పరిపాలన చేస్తున్నామన్నారుపాలకవర్గం ఏర్పడ్డ సుమారు 8 నెలలసమయంలో పారిశుద్ధ్య విషయం లో, మంచినీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిపాలన సాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంత్రిఉత్తమ్ కుమార్ రెడ్డి సహాయ సహకారాలతో ప్రతి వార్డులో 5 లక్షల రూపాయల శాశ్వత సీసీ నిర్మాణాలపైఇప్పటికే ప్రతిపాదనలు పంపడం జరిగిందని, త్వరలోనే శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి పార్టీలకతీతంగా, నిష్పక్షపాతంగా రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు జరుగుతున్నట్లు, పట్టణ పరిధిలో విద్య, మౌలిక వసతులు, రవాణా మెరుగుదల పై కోట్ల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులుదీనికి నిదర్శనమని కౌన్సిలర్లతో కలిసి పత్రికా సమావేశం ఏర్పాటు చేసి మున్సిపల్ చైర్మన్ వివరించి శ్వేత పత్రం విడుదల చేయడం జరిగింది..ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సతీష్ మాట్లాడుతూ వివిధ మార్గాల ద్వారా సంవత్సరానికి సుమారు రూ.3 కోట్ల 30 లక్షల ఆదాయంసమకూరుతుందని తెలిపారు. ఇందులో ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, వాహనాల అద్దెలు, ట్రాక్టర్లు, జేసీబీల డీజిల్ ఖర్చులు, కౌన్సిలర్ల గౌరవ వేతనాలు తదితర నిర్వహణ ఖర్చుల కోసం నెలకు సుమారు రూ.24 లక్షలకు పైగా వ్యయంఅవుతుందని వివరించారు. ఈ ఖర్చులన్నీ కలిపి ఆదాయంలో సుమారు రూ.3 కోట్ల వరకు వినియోగమవుతాయని మిగిలిన నిధులను పట్టణంలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు.మున్సిపాలిటీలో రూ.6 కోట్లకు పైగా అవినీతి జరిగిందంటూ కొందరు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని, కావాలనే తమపై దుష్ప్రచారం చేస్తున్నారని వారు ఖండించారు. హుజూర్ నగర్ పట్టణంలోని రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన ఆసుపత్రి, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సుమారు రూ.3 కోట్ల నిధులు మున్సిపాలిటీ ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులు ఆ నిధులను మున్సిపాలిటీ నుంచి తీసుకున్నారని వివరించారు. కౌన్సిల్ సమావేశంలో మొత్తం 28 మంది కౌన్సిలర్లకు గాను 22 మంది కౌన్సిలర్లు ఆమోదం తెలిపారని, మిగిలిన ఆరుగురు కౌన్సిలర్లు వ్యతిరేకించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ నిధుల విషయంలో ప్రజలకు అన్ని వివరాలు తెలియచేయటానికి సిద్ధంగా ఉన్నామని, ఎటువంటి ఆరోపణలు, అవాస్తవాలు నమ్మొద్దు అని వివరించటం జరిగింది.

దేవరకొండను జిల్లాగా ప్రకటించడంలో జాప్యం ఎందుకు?

- చారిత్రక ప్రాధాన్యత.. భౌగోళిక అర్హతలు ఉన్నా నిర్లక్ష్యమేనా?
- జిల్లా కేంద్రానికి 100 కిలోమీటర్ల ప్రయాణంతో ప్రజలకు తప్పని ఇబ్బందులు
- దేవరకొండను జిల్లాగా ప్రకటించాలి
- మాల మహానాడు అధ్యక్షుడు బోయిని చంద్రమౌళి డిమాండ్



దేవరకొండ నవంబర్10(మనం న్యూస్): దేవరకొండ ఒక్క చారిత్రక వైభవం, భౌగోళిక ప్రత్యేకతలు, అపారమైన సహజ వనరులు, గిరిజన, బహుజన జనాభా కలిగిన దేవరకొండ ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించాలనే డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ దేవరకొండను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు ఎందుకు వెనుకడుగు వేస్తున్నాయనే ప్రశ్నలు స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు బోయిని చంద్రమౌళి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 13వ శతాబ్దంలో రేచర్ల రెడ్డి రాజుల కాలంలో నిర్మితమైన దేవరకొండ ఖిల్లా దుర్గం చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు. ఒకప్పుడు రాజుల పాలనలో ప్రత్యేక గుర్తింపు పొందిన దేవరకొండ ప్రాంతం నేడు జిల్లా హోదా కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు.

భౌగోళికంగా దేవరకొండకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, తూర్పున పుట్టంగండి ప్రాజెక్టు, దక్షిణాన నక్కలగండి ప్రాజెక్టు, పడమరన డిండి ప్రాజెక్టు, ఉత్తరాన గొట్టిముక్కల రిజర్వాయర్ ఉన్నాయని వివరించారు. అంతేకాకుండా నల్లమల అటవీ ప్రాంతం, సహజ వనరులు, పర్యాటక అభివృద్ధికి అనుకూలమైన ప్రాంతాలు దేవరకొండ పరిసరాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇన్ని ప్రత్యేకతలు, అవకాశాలు ఉన్న దేవరకొండ ప్రాంతానికి జిల్లా హోదా కల్పించడంపై ప్రభుత్వాలు ఎందుకు స్పష్టమైన నిర్ణయం తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గిరిజన, బహుజన ప్రజలు అధికంగా నివసించే ఈ ప్రాంత ప్రజలు చిన్నచిన్న ప్రభుత్వ పనుల కోసం సుమారు 100 కిలోమీటర్ల దూరంలోని నల్లగొండ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణ ఖర్చులు, సమయం వృథా కావడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దేవరకొండను జిల్లాగా ప్రకటిస్తే పరిపాలన ప్రజలకు మరింత చేరువ కావడమే కాకుండా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వైద్య సదుపాయాలు, రహదారులు, ఉపాధి అవకాశాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు పొందిన దేవరకొండకు జిల్లా హోదా కల్పించడం ద్వారా అభివృద్ధికి కొత్త మార్గాలు ఏర్పడతాయని అభిప్రాయపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రాంత అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంపై హామీలు ఇచ్చే ప్రజాప్రతినిధులు దేవరకొండ జిల్లా డిమాండ్పై కూడా స్పష్టమైన వైఖరి ప్రకటించాలని కోరారు. కేవలం హామీలకే పరిమితం కాకుండా ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దేవరకొండను జిల్లాగా ప్రకటించకపోతే అన్ని బహుజన సంఘాలను, ప్రజాసంఘాలను కలుపుకొని భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని బోయిని చంద్రమౌళి హెచ్చరించారు.

చికెన్, గుడ్ల ధరలు తగ్గుతాయంటున్న వ్యాపారులు !

తాడేపల్లిగూడెం నవంబర్ 10(మనం న్యూస్): కార్తీక మాసం సందర్భంగా చికెన్, కోడిగుడ్ల ధరలు తగ్గిపోతాయంటూ ప్రచారం జరుగుతోంది. ఇటీవల రాష్ట్రంలో చికెన్, కోడిగుడ్ల ధరలు అధిక రేటులో పెరగడంతో సామాన్య ప్రజలు, హోటల్ వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్తీక మాసం రావడంతో ధరలు తగ్గుతాయని వ్యాపారస్తులు చెబుతుండటంతో వినియోగదారుల్లో కొంత ఊరట కలుగుతోంది.గత కొన్ని వారాలుగా రాష్ట్రంలో చికెన్ ధరలు ఆకాశాన్ని అంటాయి. కిలో చికెన్ ధర రూ. 220 నుంచి రూ. 280 వరకు పలికింది. అదే విధంగా కోడిగుడ్డు ధర కూడా రూ. 7 నుంచి రూ. 8.50 వరకు పెరిగింది. దీంతో రోజువారీగా చికెన్ తినేవారు, హోటళ్లు నడిపేవారు ధరల భారంతో సతమతమయ్యారు.ధరలు పెరగడానికి ప్రధాన కారణం ఫారాల్లో కోళ్ల ఉత్పత్తి తగ్గడం, దాణా ధరలు పెరగడం, రవాణా ఖర్చులు పెరగడమని వ్యాపారులు చెబుతున్నారు.

అయితే కార్తీక మాసం ప్రారంభం కాగానే చాలా మంది ప్రజలు మాంసాహారానికి దూరంగా ఉంటారు. నెల రోజుల పాటు ఉపవాసాలు, వ్రతాలు, శివాలయాలకు వెళ్లడం, కార్తీక స్నానాలు చేయడం వంటివి చేస్తుంటారు. దీంతో చికెన్, గుడ్లకు డిమాండ్ ఒక్కసారిగా పడిపోతుందని వ్యాపారులు చెబుతున్నారు. డిమాండ్ తగ్గితే ధరలు కూడా సహజంగానే తగ్గుతాయని అంటున్నారు. కార్తీక మాసంలో చికెన్ అమ్మకాలు 40 నుంచి 50 శాతం వరకు తగ్గిపోతాయి. ఫారాల్లో కోళ్లు మిగిలిపోతాయి కాబట్టి ధరలు తగ్గించక తప్పదు. కిలో చికెన్ రూ. 180 నుంచి రూ. 200 కి దిగివచ్చే అవకాశం ఉంది. గుడ్డు ధర కూడా రూ. 6 కి తగ్గొచ్చు అని తాడేపల్లిగూడెం చికెన్ వ్యాపారులు తెలిపారు.

మద్దిమడుగు గ్రామం అభివృద్ధి పథంలో ముందుండాలి

- అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దు సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలి
- శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామికి కలెక్టర్ ప్రత్యేక పూజలు
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



ఉమ్మడి మహబూబ్ నగర్, నవంబర్ 10 (మనం బ్యూరో): నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం పదర మండలం మద్దిమడుగు గ్రామంలో భూ భారతి కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన భూ రీ సర్వే అవగాహన సదస్సులో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని ఛాబ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్రలతో కలిసి నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పాల్గొని గ్రామస్తులకు సర్వే ప్రక్రియపై సంపూర్ణంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మద్దిమడుగు గ్రామానికి ఆధ్యాత్మికంగా, పర్యాటకపరంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. భవిష్యత్తులో గ్రామం మరింత అభివృద్ధి చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పరిధిలో భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలు, సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న భూ రీ సర్వేను అత్యంత ప్రాధాన్యతతో, పకడ్బందీగా నిర్వహించి నెల రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

గ్రామ పరిధిలోని అటవీ, రెవెన్యూ భూముల మధ్య ఉన్న సరిహద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టంగా గుర్తించాలని కలెక్టర్ సూచించారు. గతంలో భూ సరిహద్దుల విషయంలో తలెత్తిన సమస్యలు, అపోహలు, వివాదాలను గుర్తించి రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అందుబాటులో ఉన్న భూ రికార్డులు, మ్యాపులు, ఇతర ఆధారాలను పరిశీలించి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. భూ రీ సర్వే కేవలం భూముల కొలతలకే పరిమితం కాకుండా భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలకు తావులేకుండా స్పష్టమైన రికార్డులు రూపొందించేలా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే సమయంలో గ్రామస్తుల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. వారికి పూర్తి వివరాలు తెలియజేస్తూ వారి సమక్షంలోనే సర్వే ప్రక్రియ నిర్వహించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం మరోసారి గ్రామసభ నిర్వహించి గ్రామస్తుల నుంచి అభ్యంతరాలు, సమస్యలు, సూచనలు స్వీకరించాలని తెలిపారు.


సంబంధిత శాఖల నివేదికలు, భూ రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంటామని వివరించారు. గ్రామస్తులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇతర హక్కు పత్రాలు, అందుబాటులో ఉన్న రికార్డులను అధికారులకు అందించి సర్వేకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయంతో భూముల సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించడం ద్వారా భవిష్యత్తులో అనవసర వివాదాలను నివారించవచ్చన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి ఒక్కరి భూ హక్కులకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా, గ్రామంలో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో స్థల ఎంపికతో పాటు అవసరమైన ఏర్పాట్లపై ముందస్తు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని ఛాబ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, గ్రామ సర్పంచ్తో కలిసి మద్దిమడుగు శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అధికారులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ ప్రజలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్టియుసి కికేరాఫ్ నాగన్న గౌడ్



హుజూర్ నగర్, నవంబర్ 10 (మనం న్యూస్): ఐ ఎన్ టి యు సిరాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగని నాగన్న గౌడ్ పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులకు మంగళవారం పండ్లు పంపిణీ చేశారు ఐఎన్టియుసి పట్టణ అధ్యక్షులు మద్దం నాగేందర్ ఆధ్వర్యంలో మాజీ మార్కెట్ చైర్మన్ ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ సందర్భంగా ఏరియా హాస్పిటల్ లో పేషెంట్లకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఐ ఎన్ టి యు సి నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ గురువయ్య గౌడ్ ఐ ఎన్ టి యు సిమండల అధ్యక్షులు మేళ్లచెరువు ముక్కంటి సహకారాలతో కార్యక్రమాన్ని ఏర్పరిచారు అలాగే నాగన్న యూనియన్ సభ్యులకి యూనియన్ అధ్యక్షులకి లేబర్ కార్డు విషయంలో యాక్సిడెంట్ జరిగితే పది లక్షల రూపాయలు నార్మల్ డెత్ కు రెండు లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా వస్తుందని తెలంగాణ రాష్ట్రం అంగన్వాడి టీచర్లకు ఆయాలకు సెలవులు ప్రకటించినట్లు వివరించారు తెలంగాణ రాష్ట్రం ఆటో కార్మికులకు కూడా మినిమం 30 రూపాయలు చార్జి చేశారని కూడా మాట్లాడారు కార్మికులకు చాలావరకు న్యాయం చేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఐ ఐ ఎన్ టి యు సి జిల్లా కార్యదర్శి పాశం రామరాజు యాదవ్ సూర్యాపేట జిల్లా కోశాధికారి చింతకాయల రాము మహిళా హుజూర్ నగర్ ఐ ఎన్ టి యు సిఅధ్యక్షురాలు సప్పిడి సావిత్రి ఎస్ డబ్ల్యూ గోడం యూనియన్ అధ్యక్షులు కందుల వెంకన్న హుజూర్నగర్ మండల అధ్యక్షురాలు గడ్డం వెంకటమ్మ భూతం శీను ఆశ వర్కర్ యూనియన్ సభ్యురాలు గొర్రె సుజాత సిహెచ్ జ్యోతి సాయిరాం మరియు తదితర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

భూమి కొనుగోలు రుజువైతే అసైన్డ్ పట్టాలు రద్దు చేస్తాం



- అసైన్డ్(ప్రభుత్వ) భూమిలో నుండి రోడ్డు వేయడంపై తహసిల్దార్ ఆగ్రహం వ్యక్తం
- మట్టి తీసిన స్థలాన్ని,రోడ్డు వేసిన భూమి ఎవరిదన్న విషయాన్ని విచారణ చేయండని ఆర్ఐకి ఆదేశాలు జారీ
- ఈ రోడ్డు నిర్మాణ పనులకు పూనుకున్న జేసీబీ, వాహనాలు,వ్యక్తులపై కేసులు నమోదు చేస్తాం అంటూ స్పష్టం

ములుగు, నవంబర్ 10(మనంన్యూస్): మండల కేంద్రమైన ములుగులోని సర్వే నంబర్ 97లో గల వ్యవసాయ భూమిని సాగు చేసుకుని జీవనోపాధి పొందేందుకు గాను అప్పటి ఇందిరా గాంధీ,ప్రభుత్వం అసైన్డ్ పట్టాలు చేసి దళిత రైతులకు అందజేసింది. కాగా అట్టి భూమిలో రైతులు ఏళ్లుగా సాగుచుకుని జీవనోపాధి పొందుతున్నారు. అందుకు అనుగూణంగా రైతులు తమ సాగుచేసుకునే పొలాల్లోకి వెళ్లేందుకు వీలుగా సుమారు ఇరవై పీట్ల వైశాల్యంతో తారు రోడ్డును సైతం అధికారులు వేసి ఇచ్చారు. అయితే అదే రోడ్డును తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లేందుకు ఉపయోగించుకుంటున్న వేరే జిల్లాకు చెందిన ఓ ప్రైవేటు వ్యక్తి రోడ్డు విస్తరణకు సిద్ధమై దళిత రైతులకు సొమ్మును ఆశాజూపి రోడ్డుకు ఆనుకుని ఉన్న భూములను కొద్దో గొప్పో ముట్టజెప్పి కొనుగోలు చేసినట్లుగా సమాచారం. అయితే రోడ్డుకు ఒకవైపుగా ఉన్న చెట్లను సైతం తొలగించి యద్దెచ్చగా ఈ తంతుకు శ్రీకారం చుట్టినట్లుగా తెలుస్తుంది. రోడ్డు ఏర్పాటుకు కావలిన మట్టిని సైతం మరో రైతుతో బేరమడి రాత్రికి రాత్రే సుమారు నలభై పీట్ల విస్తీర్ణంతో మట్టిని పోసి చదును చేసినట్లుగా సమాచారం.దీంతో అసైన్డ్ భూమిలో నుండి రోడ్డు మరమ్మతు పనుల విషయాన్ని తెలుసుకున్న ములుగు తహశీల్దార్ రవీందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు మరమ్మతులు చేసిన స్థలం ఏ రైతు పేరుపై అసైన్డ్ పట్టా చేసి ఉందోనన్న విషయాన్ని గుర్తించండి ఆర్ఐ రాజుకు ఆదేశాలు జారీచేశారు. అదేవిధంగా మట్టిని తీసిన భూమిని సైతం గుర్తించి విచారణ జరపాలని చెప్పారు. అంతేకాక మట్టిని తీసుకుని వచ్చిన వాహనాలను జేసీబీ , టిప్పర్లను గుర్తించాలని ఇందుకు పూనుకున్న వ్యక్తులపై కేసులు నమోదుచేసి కటకటాల పాలు చేస్తామని తహసిల్దార్ హెచ్చరించారు. ప్రభుత్వ (అసైన్డ్)భూములు అమ్మిన , కొనుగోలు చేసిన విధించే చట్టాలపై జిల్లా స్థాయి అధికారులతో చర్చించి అసైన్డ్ రైతుల పట్టాలను రద్దు చేస్తామని తహసిల్దార్ రవీందర్ రెడ్డి చెప్పారు.

దొంగలు బాబోయ్ దొంగలు

- వణికిపోతున్న రైతులు

మహానంది, నవంబర్10,మనంన్యూస్: ఒకవైపు ప్రకృతి సహకరించక పోవడంతో పంటలు పండక నష్టాల పాలవుతున్న రైతులకు దొంగల బెడదతో వణికిపోతున్నారు. రాత్రివేళ గుర్తుతెలియని వ్యక్తులు పంటపొలాల వద్ద విద్యుత్ మోటార్లకు ఏర్పాటు చేసుకున్న వయర్లను దోచుకువెళ్తున్నారు.
మహానంది మండలంలోని పలుగ్రామలలో రైతుల పంటపొలాల వద్ద విద్యుత్ వయర్లు చోరీకి గురికావడంతో రైతులు మరోవిదంగా ఇబ్బందులు పడుతున్నారు.

కుంజ సుమంత్ కుటుంబానికి ఆర్థిక సాయం

- దశదిన కర్మల నిర్వహణకు మంత్రి సీతక్క చేయూత
- ఆపదలో కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం
- గుమ్మడి సోమయ్య, చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు



మంగపేట, నవంబర్ 10,మనం ప్రతినిధి: మంగపేట మండలం నిమ్మగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుంజ రాంబాబు కుమారుడు కుంజ సుమంత్ ఇటీవల మృతి చెందగా, మంత్రి ధనసరి అనసూయ సీతక్క కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. మంత్రి సీతక్క ఆదేశాలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచన మేరకు పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సుమంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దశదిన కర్మల నిర్వహణ నిమిత్తం మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆపద సమయంలో పార్టీ కార్యకర్తలను, వారి కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ
కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయ్యోరి యానయ్య, మాజీ మండల అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి, మార్కెట్ కమిటీ సభ్యుడు కొమురం బాలన్న, నాయకులు కొమురం సారయ్య, శానం సత్యనారాయణ, గంగినేని శేషగిరి, మద్దెల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం
- ములుగు జిల్లా ఆర్టీఐ చైర్మన్ బండ జగన్మోహన్‌రెడ్డి

మంగపేట, నవంబర్ 10, మనం ప్రతినిధి: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ములుగు జిల్లా ఆర్టీఐ చైర్మన్ బండ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మంగపేట మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మంగళవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. పేదలకు సన్నబియ్యం పంపిణీతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యమన్నారు.
ఈ కార్యక్రమంలో మంగపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాడిషా ఆదినారాయణ, బ్రాహ్మణపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు సున్నం ఆనందం, నాయకులు సోయం ఈశ్వర్‌రావు, కురసం శీను, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెట్టుబడుల పండుగకు విశాఖ సిద్ధం



- 12, 13వ తేదీల్లో సాగర తీరాన సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్-2026
- విశాఖకు ఒకరోజు ముందుగానే ముఖ్యమంత్రి... పలువురితో భేటీలు
- విదేశీ ప్రతినిధులు, పరిశ్రమల అధినేతలతో సమావేశం కానున్న సీఎం
- ప్రపంచ నలుమూలల నుంచి పారిశ్రామిక దిగ్గజాల రాక
- సింగపూర్, యూఏఈ, జపాన్, రష్యా, స్లోవేకియా, గ్వాటెమాల ప్రతినిధుల భాగస్వామ్యం

అమరావతి, నవంబర్ 10,(మనం ప్రత్యేక ప్రతినిధి): ఏపీని పెట్టుబడులకు, పారిశ్రామికాభివృద్ధికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ నెల 12, 13వ తేదీల్లో విశాఖపట్నంలో 31వ సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్-2026ను ప్రభుత్వం నిర్వహించనుంది. గతేడాది నిర్వహించిన భాగస్వామ్య సదస్సుకు భిన్నంగా 2026 సీఐఐ భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఇప్పటికే ఐదు ప్రాంతీయ సదస్సులు నిర్వహణతో రూ.86 వేల కోట్ల పెట్టుబడులను వచ్చాయి. అలాగే వివిధ రంగాలపై ప్రాంతీయ సదస్సుల్లో చర్చలు జరిగాయి. దీంతో పెట్టుబడుల సదస్సులో ఎలాంటి చర్చలు జరుగుతాయోననే అంశంపై అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య సంయుక్తంగా చేపట్టనున్న ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల ప్రభుత్వ ప్రతినిధులు, మంత్రులు, దౌత్యవేత్తలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, బహుళజాతి సంస్థల అధినేతలు హాజరుకానున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని, వివిధ దేశాల ప్రతినిధులు, ప్రముఖ పారిశ్రామిక సంస్థల అధినేతలతో సమావేశం కానున్నారు. నవంబర్ 12వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలో సదస్సు ప్రారంభ కార్యక్రమం జరగనుంది. సదస్సు ప్రారంభం కార్యక్రమాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభిస్తారు. ఆ తర్వాత జరగనున్న వివిధ సెషన్లు... సమావేశాల్లో కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు భాగస్వాములు కానున్నారు. అలాగే కీలక సమావేశాల్లో సీఎం చంద్రబాబు పాల్గొని... ఆయా అంశాలపై చర్చించడంతోపాటు... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను వివరించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అందుబాటులో ఉన్న అవకాశాలు, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక విధానాలు, తయారీ, సాంకేతిక రంగాల్లోని అవకాశాలను పారిశ్రామిక వర్గాలకు సీఎం వివరిస్తారు.



అంతర్జాతీయ ప్రతినిధులతో ముఖ్యమంత్రి భేటీలు

సీఐఐ సమ్మిట్లో భాగంగా ముఖ్యమంత్రి పలు దేశాల మంత్రులు, రాయబారులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతోనూ సమావేశమవుతారు. సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, గ్వాటెమాలా, స్లోవేకియా దేశాలకు చెందిన ప్రభుత్వ ప్రతినిధులతో సీఎం భేటీ కానున్నారు. అలాగే జపాన్, రష్యా రాయబారులతో ముఖ్యమంత్రి చర్చించనున్నారు. వీరితో పాటు ప్రపంచ మేధోసంపత్తి సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డారెన్ టాంగ్తో కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఇక సదస్సులో ఆటోమొబైల్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, నిర్మాణ సామగ్రి, మౌలిక సదుపాయాలు, మాన్యుఫ్యాక్చరింగ్, సాంకేతిక రంగాలకు చెందిన ప్రముఖులు భాగస్వాములు కానున్నారు. కియా మోటార్స్కు, రెన్యూ, మాండలెజ్ ఇండియా, సెయింట్ గోబెయిన్, నాల్కో, లెవిస్టా వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు సదస్సులో భాగస్వాములు కానున్నారు. ఇక సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా స్పేస్ రంగంలోని స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు నిలవనున్నారు. అంతరిక్ష సాంకేతికత, పరిశోధన, తయారీ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను విస్తరించే లక్ష్యంతో తేదీన ప్రముఖ భారతీయ పైవేటు అంతరిక్ష సంస్థల ప్రతినిధులతో సీఎం ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో హాథోర్ రాకెట్స్, అగ్నికుల్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, స్కైరూట్ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారు. అలాగే జపాన్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్కు చెందిన ఇన్స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ స్ట్రాటజీ చైర్మన్తో సీఎం భేటీ అవుతారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు నేపథ్యంలోనే మహిళా సాధికారతకు ప్రాధాన్యతిస్తూ ఓ సమావేశం నిర్వించనున్నారు. దీనికి సీఎం చంద్రబాబు హాజరు కానున్నారు. 'విమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్-2026' పేరుతో విశాఖ నోవోటెల్లో ప్రారంభ కార్యక్రమం జరగనుంది. మహిళల ఆర్థిక సాధికారత, పారిశ్రామిక రంగంలో మహిళల భాగస్వామ్యం, వ్యాపారవేత్తలుగా మహిళలకు ప్రోత్సాహం వంటి అంశాలపై ఈ కార్యక్రమంలో చర్చించనున్నారు.

కేంద్రమంత్రులతో ముఖ్యమంత్రి వరుస భేటీలు

సదస్సులో వివిధ శాఖలకు చెందిన కేంద్రమంత్రులతో సీఎం ఈ రెండు రోజుల్లో సమావేశం కానున్నారు. వివిధ రంగాల్లో పారిశ్రామికాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు... రాష్ట్రానికి అందించాల్సిన చేయూతపై కేంద్ర మంత్రులతో సీఎం చర్చించనున్నారు. అలాగే రాష్ట్రంలోని వివిధ వర్గాలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా కొన్ని వెసులుబాట్లు కల్పించే అంశాలను కేంద్రమంత్రుల వద్ద ప్రస్తావించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో తలెత్తుతున్న పరిణామాలతో రాష్ట్రంలోని పలు రంగాలపై పడుతున్న ప్రభావాన్ని కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లనున్నారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, చిరాగ్ పాశ్వాన్, ప్రహ్లాద్ జోషి, సర్బానంద సోనోవాల్ వంటి వారితో సీఎం భేటీ కానున్నారు.

ఒకరోజు ముందే సీఎం సమావేశాలు

సమ్మిట్కు ఒకరోజు ముందుగానే ముఖ్యమంత్రి చంద్రబాబు అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో అమరావతి, విశాఖల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. బుధవారం సింగపూర్ మంత్రి గాన్ సియో హువాంగ్తో అమరావతిలో సమావేశమవుతారు. అనంతరం విశాఖ చేరుకుని వివిధ భేటీల్లో పాల్గొంటారు. డబ్ల్యూఐపీవో డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, జపాన్ రాయబారి కీచి ఒనో, యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ, రెన్యూ సంస్థ సీఈవో సుమంత్ సిన్హాలతో బుధవారమే సమావేశం కానున్నారు. బుధవారం సాయంత్రం సీఐఐ సీఈవోలతో సమావేశం, అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటు చేసిన స్వాగత విందులో పాల్గొంటారు.

కేబినెట్ భేటీలో సీఎం కి నిడదవోలు రైతుల కన్నీటి కష్టాలు వివరించిన మంత్రి కందుల

ఎర్రకాలువ వరద ముంపు బాధితులకు అండగా నిలవాలని సీఎంను కోరిన మంత్రి దుర్గేష్



నిడదవోలు,అమరావతి,నవంబర్,10,(మనం న్యూస్) : వరుసగా విరుచుకుపడిన 'మురసు', 'అర్నాబ్' తుఫాన్ల దాటికి తూర్పు గోదావరి జిల్లాతో పాటు ప్రత్యేకించి నిడదవోలు నియోజకవర్గ రైతాంగం తీవ్రంగా దెబ్బతిని ఆవేదనలో ఉందని సీఎం చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. అమరావతిలో జరిగిన కేబినెట్ సమావేశంలో తూర్పు గోదావరి జిల్లాతో పాటు నిడదవోలు నియోజకవర్గంలో ప్రకృతి వైపరీత్యం సృష్టించిన బీభత్సాన్ని, రైతుల కష్టాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందు మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా ప్రస్తావించారు.
ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ సీఎం చంద్రబాబు నాయుడుతో మాట్లాడుతూ... తుఫాన్ల ఉధృతికి తోడు ఎర్రకాలువ పొంగిపొర్లడంతో సమీప గ్రామాలు జలమయమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంట చేలు పూర్తిగా నాశనమై రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలిందని తెలిపారు. ఇళ్లలోకి భారీగా వరద నీరు చేరి ప్రజల జనజీవనం స్తంభించిపోయిందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పంట ఇన్సూరెన్స్ కొద్దిమందికే ఉన్నందున, ఇన్సూరెన్స్ లేని రైతులను కూడా మానవీయ కోణంలో పరిగణనలోకి తీసుకుని నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకూ ప్రభుత్వ పరిహారం అందించాలని విన్నవించారు..తుఫాన్ తో పాటు ఎర్రకాలువ వరద వల్ల దెబ్బతిన్న పంటలు, ఇళ్ల నష్టాన్ని తక్షణమే అంచనా వేసి (ఎన్యుమరేషన్), నిబంధనలకు అతీతంగా అర్హులైన ప్రతి రైతునూ జాబితాలో చేర్చాలని కోరారు.. నిడదవోలు నియోజకవర్గ రైతాంగాన్ని, ప్రజలను అన్ని విధాలా ఆదుకుని కొండంత అండగా నిలవాలని మంత్రి దుర్గేష్ విజ్ఞప్తి చేయగా దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో సానుకూలంగా స్పందించారని మంత్రి దుర్గేష్ తెలిపారు.

పెనుకొండలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటు

- ఫలించిన మంత్రి సవిత కృషి
- ఐటీఐ కళాశాల ఏర్పాటుకు రెండు ఎకరాల భూమి కేటాయింపు
- కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం
- స్థానిక యువతకు సాంకేతిక, వృత్తి విద్యలో శిక్షణ
- కియా, అనుబంధ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలకు మార్గం
- సీఎం చంద్రబాబుకు, మంత్రివర్గానికి మంత్రి సవిత కృతజ్ఞతలు



పెనుకొండ నవంబర్ 10 మనం న్యూస్ : పెనుకొండ ప్రాంత యువతకు సాంకేతిక విద్య, ఉపాధి అవకాశాలు మరింత చేరువ కానున్నాయి. పట్టణంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటుకు రెండు ఎకరాల భూమిని కేటాయిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పెనుకొండ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1245-1లో ఉన్న రెండు ఎకరాల భూమిని ఐటీఐ కళాశాల ఏర్పాటుకు కేటాయించనున్నారు. ఈ నిర్ణయం వెనుక మంత్రి సవిత చేసిన కృషి ఫలించడం తో స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది.ఐటీఐ కళాశాల అందుబాటులోకి వస్తే పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు స్థానికంగానే వృత్తి, సాంకేతిక విద్యను అభ్యసించే అవకాశం కలుగుతుంది. వివిధ సాంకేతిక కోర్సుల్లో శిక్షణ పొందిన యువతకు పెనుకొండలోని కియా పరిశ్రమతో పాటు దాని అనుబంధ పరిశ్రమలు, ఇతర పారిశ్రామిక సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. పెనుకొండ నియోజకవర్గంతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చే విద్యార్థులకు కూడా ఈ కళాశాల ప్రయోజనకరంగా మారనుంది.

స్థానికంగానే ఉద్యోగావకాశాలు

పెనుకొండలో కియా పరిశ్రమతో పాటు అనుబంధ పరిశ్రమలు విస్తరిస్తున్న నేపథ్యంలో నైపుణ్యం కలిగిన యువతకు మంచి డిమాండ్ ఉందని మంత్రి సవిత తెలిపారు. ఐటీఐ కళాశాల ద్వారా యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక శిక్షణ అందుతుందని, తద్వారా స్థానికంగానే ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటుతో వేలాది మంది విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుందన్నారు. 2029 నాటికి 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఎన్నికల హామీకి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పెనుకొండలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటుకు రెండు ఎకరాల భూమి కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్కు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్కు, సహచర మంత్రివర్గ సభ్యులందరికీ మంత్రి సవిత మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యత పెంచిన...'స్థానిక' విజయం

ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన అఖండ విజయంతో మనపై బాధ్యత మరింత పెరిగిందని, విజయాలు వచ్చాయని గర్వంతో విర్రవీగకుండా మరింత ఒద్దికగా ప్రజల్లోకి వెళ్లాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులకు స్పష్టమైన అల్టిమేటం జారీ చేశారు

(అమరావతి, పిమీరా హుస్సేన్ ఖాన్, మనం ప్రత్యేక ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ లో మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ మంత్రివర్గ సమావేశంలో దాదాపు 30కి పైగా అజెండా అంశాలకు ఆమోదం తెలపడమే కాకుండా, రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఇప్పటి నుంచే బాధ్యతాయుతంగా పనిచేయాలని చంద్రబాబు మంత్రివర్గానికి దిశానిర్దేశం చేసారు. ఈ కీలక భేటీకి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్తో పాటు రాష్ట్ర మంత్రివర్గ సభ్యులందరూ మరియు ఉన్నతాధికారులు హాజరయ్యారు.స్థానిక సంస్థల ఎన్నికలలో సాధించిన భారీ విజయం (ఓట్ షేర్ 3.6% పెరిగిన నేపథ్యంలో) కేబినెట్ ప్రారంభంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్లకు మంత్రులందరూ కలిసి ఘనంగా అభినందనలు తెలియజేశారు.
కేబినెట్ ఎజెండా ముగిసిన తర్వాత సీఎం చంద్రబాబు దాదాపు గంటన్నర పాటు మంత్రులతో రాజకీయ, పాలనాపరమైన అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన ఇచ్చిన ఆదేశాలు ఎపి అభివృద్ధికి దోహదపతాయి. ఎన్నికల గెలుపు ఉత్సాహంలో మంత్రులు, నేతలు ఎవరూ అతిగా ప్రవర్తించకూడదు. మరింత వినయంతో ప్రజలకు సేవ చేయాలి. అభివృద్ధి, సంక్షేమాలను సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తూ.. 2029 ఎన్నికలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ తమ శాఖల్లో సమర్థవంతంగా పనిచేయాలి.
ప్రభుత్వ పథకాలు మరియు పారిశ్రామిక ఉపాధి అవకాశాలు నేరుగా అర్హులకు అందేలా మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి.

కేబినెట్ ఆమోదించిన కీలక నిర్ణయాలు

రాష్ట్రాన్ని ఫ్యూచర్ టెక్నాలజీ హబ్గా మార్చేలా వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. అందులోని ప్రధాన ప్రాజెక్టులు ఉన్నాయి.
ఏఎం ఇంటెలిజెన్స్ ఏఐ డేటా సెంటర్ రూ. 31,387 కోట్ల భారీ పెట్టుబడి భీమిలి
కార్బన్ కాస్మో బ్యాటరీ పరిశ్రమ రూ. 4,000 కోట్ల పెట్టుబడి నాయుడుపేటరిలయన్స్ ఏఐ డేటా సెంటర్ 24.96 ఎకరాల భూమి కేటాయింపు భోగాపురం
డిక్సన్ టెక్నాలజీస్ రూ. 700 కోట్ల పెట్టుబడి భూ కేటాయింపు తిరుపతి
మహిళా పారిశ్రామిక పార్క్ 30 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు జగ్గయ్యపేట
ఈప్యాక్ డేటా సెంటర్ పరికరాలు రూ. 570 కోట్ల పెట్టుబడి రాంబిల్ల
'కొత్త టెక్నాలజీ పాలసీలు కూడా ఆమోదం పొందాయి. విజువల్ ఎఫెక్ట్స్ మరియు గేమింగ్ రంగాన్ని పెంచేలా 'ఏపీ ఏవీజీసీ-ఎక్స్ ఆర్ పాలసీ', 'రోబోటిక్స్ అండ్ ఫిజికల్ ఏఐ పాలసీ' మరియు సవరించిన 'సెమీ కండక్టర్ పాలసీ'కి కేబినెట్ ఆమోదం తెలిపింది. విజయవాడలో 15 మెగావాట్ల వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్తో పాటు సోలార్, బయోగ్యాస్ ప్రాజెక్టులకు అనుమతులిచ్చారు. నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులో హెటెరో గ్రూపునకు భూ కేటాయింపులు జరిగాయి. భూముల రద్దు గతంలో నిబంధనలు పాటించని తిరుపతిలోని కొన్ని సంస్థల వెబ్సోల్, మెట్రో డెకరేటివ్ భూ కేటాయింపులను కేబినెట్ రద్దు చేసింది.

కష్టాల్లో ఉన్న వాళ్లని ఇంకా దూషించడం అమానుషం.. రేణు దేశాయ్

సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్గా ఉండే టాలీవుడ్ నటి రేణు దేశాయ్ ఇన్స్టాగ్రామ్ వేదికగా చేసిన పోస్ట్ ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశమైంది. టాలీవుడ్ హీరో, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, అన్నా లెజినోవా అధికారికంగా విడాకులు తీసుకున్న నేపథ్యంలో విమర్శలు వస్తుండగా.. రేణు ఈ పోస్ట్ చేయడంతో పలు చర్చలు మొదలయ్యాయి. ఎవరైనా కష్టాల్లో ఉన్నప్పుడు వారిని మరింత దూషించడం లేదా ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్నవారిని మానసికంగా తొక్కాలని చూడటం అమానుషమని రేణు దేశాయ్ అభిప్రాయపడ్డారు. సెలబ్రిటీలు సమాజంలో ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ, వారు కూడా సామాన్య మనుషులని.. ఎవరో ఒకరికి సంతానంగా, తల్లిదండ్రులుగా లేదా తోబుట్టువులుగా ఉంటారనే విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు.



మనమందరం అసంపూర్ణమైన అద్దాల ఇళ్లలోనే నివసిస్తున్నామని, అలాంటప్పుడు ఇతరుల ఇళ్లపై రాళ్లు రువ్వడం సరికాదని అన్నారు. మనుషులుగా జీవించడానికి దయ, ఎదుటివారి బాధను అర్థం చేసుకునే తత్వం చాలా అవసరమని పేర్కొన్నారు. అయితే తాను ఈ పోస్ట్ పెట్టినంత మాత్రాన ఎవరికి వారు తెలివితక్కువ ఊహాగానాలు మొదలుపెట్టవద్దని కోరారు. అలాగే, తాను దయతో లేదా తెలివితో మాట్లాడటానికి ఎవరి దగ్గర్నుంచి ఎలాంటి పేటీఎం డబ్బులు తీసుకోలేదని, సరిగ్గా పనిచేసే బ్రెయిన్తోనే విషయాలను గ్రహించి రాశానని స్పష్టం చేశారు. ఈ పోస్ట్తో ఎవరి పేరును నేరుగా ప్రస్తావించనప్పటికీ, పవన్కు మద్దతుగానే రేణు దేశాయ్ ఈ వ్యాఖ్యలు చేశారని నెటిజన్లు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట చర్చనీయాంశంగా మారింది.

సెమీ ఫైనల్‌కు యువ భారత్



అండర్-19 ఆసియా వన్డే టోర్నీలో భారత్ సెమీ ఫైనల్ కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన మ్యాచ్ లో యూఏఈని యువ భారత్ 70 పరుగుల తేడాతో ఓడించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 309 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో యూఏఈ సరిగ్గా 50 ఓవర్లలో 239 పరుగులకు ఆలౌటైంది. అహ్మద్ ఖుదాదాద్ (74; 74 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్ లు), నూరుల్లా అయోబీ (39; 25 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్ లు) రాణించారు.

యయిన్ రాయ్ (29; 44 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్ లు), అయాన్ మిస్రా (27; 53 బంతుల్లో 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. ఏడో వికెట్ కు ఖుదాదాద్, నూరుల్లా 52 బంతుల్లో 90 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి పోరాడినా యూఏఈకి ఓటమి తప్పలేదు. భారత బౌలర్లలో ఇషాన్ సోద్ (4/37) అదరగొట్టాడు. గురువారం జరగనున్న రెండో సెమీ ఫైనల్ లో అఫ్గాన్తో భారత్ తలపడనుంది.

తొలుత బ్యాటింగ్ చేసిన భారత బ్యాటర్లలో వీరేంద్ర సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ (160; 168 బంతుల్లో 17 ఫోర్లు, 7 సిక్స్ లు) చెలరేగిపోయాడు. వీకే వినీత్ (67) హాఫ్ సెంచరీ చేసి రాణించాడు. లక్ష్య రాజేశ్ రాయ్చందాని (17), యశ్వర్ధన్ చౌహాన్ (17), అన్వయ్ ద్రవిడ్ (12) ఫర్వాలేదనిపించారు. యూఏఈ బౌలర్లలో నసీమ్ ఖాన్ 4.. హదయుతుల్లా ఖాన్, నూరుల్లా అయోబి, అయాన్ మిస్రా తలో వికెట్ తీశారు.



వరుణుడిదే మూడో వన్డే..

ఇక సిరీస్ భారత్ చేజారదు

గత రెండు వన్డేల్లో అడపాదడపా వచ్చి భయపెట్టిన వరుణుడు.. ఈసారి తానే మ్యాచ్ ఆడేశాడు. హామిల్టన్ వేదికగా జరగాల్సిన మూడో వన్డే మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. టాస్ నెగ్గిన టీమ్ఇండియా బౌలింగ్ ఎంచుకుంది. కనీసం 20 ఓవర్ల ఆటైనా సాధ్యపడుతుందని అంతా భావించినా.. ఆ అవకాశం లేకుండా పోయింది. చివరికి మ్యాచ్ను రద్దు చేస్తూ అంపైర్లు నిర్ణయించారు. దీంతో ఐదు వన్డేల సిరీస్ను టీమ్ఇండియా కోల్పోదు. ఇప్పటికే 2-0 ఆధిక్యంలో భారత్ ఉంది. మిగతా రెండింట్లో ఒక్కటి గెలిచినా సిరీస్ సొంతమవుతుంది. ఆఖరి మ్యాచుల్లో ఓడినా అప్పుడు ఇరు జట్లు సమంగా నిలుస్తాయి.



అందుకే మూవీ లాంచ్‌లో కనిపించాను : రిషికాంత్

చాన్నాళ్లుగా తమిళ సినిమాల్లో సహాయ పాత్రలు చేసిన రిషికాంత్.. రీసెంట్ టైంలో మొదరాత్రి, డోరతి చిత్రాలతో హిట్స్ కొట్టాడు. అద్భుతమైన పేరు తెచ్చుకున్నాడు. ఇతడు రామ్ చరణ్-సుకుమార్ మూవీలోనూ కీలక పాత్ర చేయనున్నాడనే రూమర్స్ వచ్చాయి. ఇప్పుడు వీటిపై స్వయంగా రిషికాంత్ క్లారిటీ ఇచ్చేశాడు. తాజా ఇంటర్వ్యూలో దీని గురించి స్పందించాడు.

'నేను రామ్ చరణ్ కొత్త సినిమాలో నటించట్లేదు. మైత్రీ నిర్మాణ సంస్థ తీసిన 'మొదరాత్రి'లో పనిచేశాను. మైత్రీ వాళ్లు ఆహ్వానిస్తేనే ఈ మూవీ పూజా కార్యక్రమానికి వచ్చాను. మళ్లీ మూవీ వచ్చిన తర్వాత చూసి తెలుసుకోవడం కంటే నేనే ఇప్పుడు చెప్పేస్తున్నాను' అని రిషికాంత్ క్లారిటీ ఇచ్చాడు.

రామ్ చరణ్, సుకుమార్.. 2018లో రిలీజైన 'రంగస్థలం' చేశారు. ఇది అప్పట్లో సూపర్ హిట్ అయింది. మళ్లీ ఇన్నాళ్లకు కలిసి పనిచేస్తున్నారు. మూవీ లాంచ్ అయింది గానీ సంగీత దర్శకుడు ఎవరు? హీరోయిన్ ఎవరు? అనే విషయాలు బయటకు రాలేదు. బహుశా జనవరి నుంచి షూటింగ్ మొదలయ్యే అవకాశముందని తెలుస్తోంది.

టీమ్ఇండియాకు గుడ్ న్యూస్

న్యూజిలాండ్ బయలుదేరనున్న పంత్!



ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న టీమ్ఇండియా నవంబర్ 19 నుంచి ఆతిథ్య జట్టుతో రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఈ టెస్టు మ్యాచ్లకు ముందు టీమ్ఇండియాకు గుడ్న్యూస్. వికెట్కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్ గురువారం న్యూజిలాండ్ బయలుదేరనున్నాడు. ఇటీవల పంత్ రెస్ట్ ఆఫ్ ఇండియా తరఫున ఇరానీ కప్ మ్యాచ్ ఆడుతుండగా పక్కటెముకల గాయానికి గురయ్యాడు. ఈ క్రమంలో న్యూజిలాండ్ 'ఎ'తో అనధికార టెస్టు సిరీస్లో ఒక మ్యాచ్కు పంత్ను ఎంపిక చేశారు. ఫిట్నెస్ సాధిస్తేనే ఆ మ్యాచ్కు తీసుకుంటామని షరతు పెట్టారు. కానీ, బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అతడికి రిటర్న్ టు ప్లే సర్టిఫికేట్ ఇవ్వలేదు. తాజాగా పంత్ ఫిట్ నెస్ సాధించి న్యూజిలాండ్ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాడని బీసీసీఐ వర్గాల సమాచారం.

''పంత్ పూర్తిగా ఫిట్గా ఉన్నాడు. మంగళవారం అతడు ఇండోర్లో మ్యాచ్ సిమ్యులేషన్ డ్రిల్స్లో పాల్గొంటున్నాడు. బుధవారం కూడా ఒక రౌండ్ సిమ్యులేషన్ జరగనుంది. ఈ రెండు రౌండ్లు విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత పంత్ నవంబర్ 12న వెల్లింగ్టన్ కు బయలుదేరతాడు'' బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. 2020లో టీమ్ఇండియా న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లినప్పుడు పంత్ కూడా జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఆ టూర్ లో పంత్ నాలుగు ఇన్నింగ్స్లో కలిపి 60 పరుగులే చేశాడు.



జనాల నవ్వును కూడా జడ్జ్ చేసే హక్కు ఎవరిచ్చారు?

రివ్యూవర్స్ పై తరుణ్ భాస్కర్ ఫైర్



టాలీవుడ్ యూత్ ఫేవరెట్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న కల్ట్ కామెడీ 'ఈ నగరానికి ఏమైంది' సినిమాకు సీక్వెల్ గా 'ఈ నగరానికి ఏమైంది-2' త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. విశ్వక్ సేన్, అభినవ్ గోమఠం, వెంకటేష్ కాకుమాను, సాయినాథ్ మాగంటి, సిమ్రాన్ చౌదరి కాంబినేషన్ లో వస్తున్న ఈ సినిమా నవంబర్ 19న గ్రాండ్గా రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తరుణ్ భాస్కర్ సోషల్ మీడియా రివ్యూవర్లపై చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట బాగా వైరల్ అవుతున్నాయి. ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్ పేరుతో సోషల్ మీడియాలో కొందరు హద్దులు దాటుతున్నారని తరుణ్ భాస్కర్ మండిపడ్డారు.. రాజకీయాల గురించి మాట్లాడేటప్పుడు కనిపించని ఉత్సాహం, ధైర్యం.. సినిమాలపై విమర్శలు చేయడానికి మాత్రం విపరీతంగా వాడేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

సినిమా నచ్చలేదని చెప్పడం వరకు ఓకే కానీ, 'ఫలానా సీన్ ఇలా తీసి ఉండాల్సింది' అంటూ కామెంట్స్ చేసేవారిని చూస్తే.. అంత బాగా తెలిస్తే 'నువ్వే ఒక సినిమా తీసి చూపించు' అని అనాలనిపిస్తుందని అన్నారు. ఇలా సోషల్ మీడియాలో నెగెటివిటీని ప్రచారం చేసేవాళ్లు కేవలం ఒక శాతం మాత్రమే ఉంటారని, అసలైన 99 శాతం మంది ప్రేక్షకులు ఎక్కడా కామెంట్లు పెట్టకుండా సైలెంట్గా థియేటర్కి వెళ్లి టికెట్ కొని సినిమాను ఆస్వాదిస్తారని గుర్తుచేశారు. రివ్యూలు ఇవ్వడం తప్పు కాదని, వాటివల్ల తనకు ఎలాంటి సమస్య లేదని కానీ ఈ మధ్య కొందరు 'ఇది పాత జోక్, దీనికి నవ్వకండి' అంటూ ప్రేక్షకులను ప్రభావితం చేసేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ప్రేక్షకులకు ఏ సీన్ చూసి నవ్వాలో, దేనికి నవ్వకూడదో చెప్పడానికి వాళ్లెవరని.. జనాలు నవ్వే నవ్వును కూడా జడ్జ్ చేయడం ఏంటని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ఉద్యోగం చేసే మహిళలకు సరైన గౌరవం లభించడం లేదు: జెనీలియా



సీనియర్ బ్యూటీ జెనీలియా దేశ్ముఖ్ ఓ షోలో పాల్గొని చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. మహిళల్లో వచ్చే మేనోపాజ్ (రుతుక్రమం ఆగిపోవడం), వయసు పెరగడం వల్ల వచ్చే మార్పులపై ఉన్న అపోహల గురించి మాట్లాడుతూ.. మేనోపాజ్ దాటిన తర్వాత వయసు అయిపోయినట్లు కనిపిస్తారనే భయంతో చాలామంది ఈ విషయం గురించి మాట్లాడటానికి ఇష్టపడరని ఆమె అన్నారు. అయితే వయసు పెరగడం అనేది ఒక అందమైన మార్పు అని, వయస్సుతో పాటు వచ్చే మార్పులను స్వీకరించాలని ఆమె అభిప్రాయపడ్డారు. కాబట్టి తాను మళ్లీ తన 20 ఏళ్ల వయసులోకి వెళ్లాలని అనుకోవడం లేదని తెలిపారు. 20ల కంటే ఇప్పుడు 40 ఏళ్ల వయసులోనే తాను మరింత కూల్ గా, ఎంతో ధైర్యంగా అనిపిస్తున్నానని పేర్కొన్నారు.

సమాజం ఎల్లప్పుడూ మహిళలు చిన్నవయస్కులుగా, గ్లామరస్ గా కనిపించాలనే ఒత్తిడిని తెస్తుందని, కానీ మేనోపాజ్ వంటి ముఖ్యమైన ఆరోగ్య విషయాలను చర్చించకుండా దాటవేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తన కెరీర్ ప్రారంభంలో ముఖంపై ఉన్న మచ్చల వల్ల ఎదుర్కొన్న విమర్శలను గుర్తుచేసుకుంటూ.. 'జానే తూ... యా జానే నా' సినిమా సమయంలో అమీర్ ఖాన్ తనను నాచురల్ లుక్ లోనే ఉండమని ప్రోత్సహించిన తీరును ఆమె గుర్తుచేసుకున్నారు. అలాగే, గృహిణిగా ఉండటం అనేది ప్రపంచంలోనే అత్యంత కష్టమైన ఉద్యోగమని.. కానీ దానికి తగిన గుర్తింపు, గౌరవం లభించడం లేదని చెప్పుకొచ్చారు.

నా వైఫల్యాల వల్ల జీవితంలో ఎన్నో పాఠాలు నేర్చుకున్నా : సమంత

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం ప్రెగ్నెన్సీ కారణంగా సినిమాలకు కొద్దిగా గ్యాప్ ఇచ్చినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటూ అభిమానులతో టచ్ లో ఉంటున్నారు. చివరగా 'మా ఇంటి బంగారం' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఆమె, ప్రస్తుతం తమిళంలో పాపులర్ కుకింగ్ షో అయిన 'సెలబ్రిటీ మాస్టర్ షెఫ్ తమిళ్' కు హోస్ట్ గా వ్యవహరిస్తూ అలరిస్తున్నారు. అంతేకాకుండా వివిధ ఇంటర్వ్యూలు, టాక్ షోలలో పాల్గొంటూ నిత్యం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారుతున్నారు. తాజాగా, ఓ షోలో సమంత పాల్గొని తన వృత్తిపరమైన జీవితం గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన జీవితంలో ఎదురైన వైఫల్యాల గురించి మాట్లాడుతూ ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు.

తన జీవితంలో మొదటి వ్యాపార భాగస్వామ్యం అనుకున్న విధంగా జరగలేదని, ప్రతి చిన్న విషయాన్ని చాలా వివరంగా తెలుసుకోవాలనుకున్నానని.. కానీ అనుకోని విధంగా ఆ ప్రాజెక్ట్ విఫలమైందని తెలిపారు. అయితే జీవితంలో ఎదురయ్యే మొదటి వైఫల్యం నిజానికి ఒక మంచి విషయమే కావచ్చునని సమంత అభిప్రాయపడ్డారు. విజయం కంటే వైఫల్యాలే మనుషులకు ఎక్కువ పాఠాలు నేర్పుతాయని స్పష్టం చేశారు. తన జీవిత ప్రయాణం కేవలం తాను సాధించిన విజయాల నుండి మాత్రమే కాకుండా, తాను ఎదుర్కొన్న ఓటములు, వైఫల్యాల నుండి నేర్చుకున్న అనుభవాలతోనే ముడిపడి ఉందని సమంత చెప్పుకొచ్చారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.